ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5
ప్రకాశం
జిల్లా వార్తలు
శుక్రవారం 18, జూలై 2025



ఒనకూరడంలేదు!

- పెరిగిన కూరగాయల ధరలు ● కొన్ని.. కిలోకు రూ.20 పెరుగుదల
- సెంచరీ కొట్టిన బీన్స్ ● గణనీయంగా తగ్గిన ఉత్పత్తే కారణం 7
- మరికొద్ది రోజులు ఇదే విధంగా కొనసాగుతాయంటున్న వ్యాపారులు

మేం అర్హులమే... మాకూ ఇవ్వండి

అన్నదాత సుఖీభవ లబ్ధికోసం అభ్యర్థనలు

ఇప్పటివరకు 2,278 అర్జీలు

పరిశీలిస్తున్న వ్యవసాయ, రెవెన్యూ సిబ్బంది

వినతుల స్వీకరణకు గడువు పెంపు

గతంలోనే 2,67,396 మంది లబ్ధిదారుల గుర్తింపు

ఒంగోలు, జూలై 17 (ఆంధ్రజ్యోతి) : 'మేం కూడా అర్హులమే, మాకు కూడా పథకాన్ని ఇవ్వండి... లబ్ధిదారుల జాబితాలో మా పేర్లు చేర్చండి' అంటూ పలువురు రైతులు అన్నదాత సుఖీభవ పథకం కోసం వ్యవసాయశాఖ అధికారులకు అర్జీలు ఇస్తున్నారు. శాఖపరంగా పరిశీలన అనంతరం ఈనెల 9న లబ్ధిదారులుగా గుర్తించబడిన వారి వివరాలను రాష్ట్ర వ్యాప్తంగా క్షేత్రస్థాయిలో ఉండే రైతుసేవా కేంద్రాలు (ఆర్‌ఎస్‌కే)లలో వ్యవసాయశాఖ ప్రకటించింది. అలా జిల్లాలో అప్పటివరకు గుర్తించబడిన తుది జాబితా ప్రకారం 2,67,003 మంది రైతుల పేర్ల వివరాలను గ్రామాల వారీగా జిల్లాలోని 616 ఆర్‌ఎస్‌కే కార్యాలయాల్లో ప్రచురించారు. అభ్యంతరాలున్న వారు

మిగతా 6లో...

ఇక ఆగనీయరు

ముమ్మరంగా సాగునీటి వనరుల మరమ్మతులు

- ఉమ్మడి జిల్లాలో రూ.17.12 కోట్లు మంజూరు
- నీటి సంఘాల ద్వారా కాలువల నిర్వహణ
- ఈ సీజన్ నీటి సరఫరాకు ఇక్కట్లు లేకుండా చర్యలు
- చకచకా పాలేరు-బిట్రగుంట చానల్ వర్కులు

జిల్లాలో సాగునీటి వనరుల మరమ్మతులు ముమ్మరంగా జరుగుతున్నాయి. సాగర్ కాలువలు, చిన్ననీటి వనరులలో చిల్లచెట్లు తొలగించి శుభ్రం చేస్తున్నారు. తెగిన కట్టలను బలోపేతం చేస్తున్నారు. దర్శి ప్రాంతంలోని అన్నికాలువల మరమ్మతు పనులు శరవేగంగా జరుగుతున్నాయి. కాలువ కట్లపై చిల్లచెట్లను తొలగించి శుభ్రం చేసిన తర్వాత ఎంతో పరిశుభ్రంగా కనిపిస్తుండటంతో ఆయకట్టు రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. సాగర్ డ్యామ్‌కు పుష్కలంగా నీరు చేరుతుండటంతో వచ్చేనెలలో సాగునీరు విడుదలయ్యే అవకాశం ఉంది. ఈనెలాఖరులోపు కాలువలకు మరమ్మతులు పూర్తి చేయటం లక్ష్యంగా అధికారులు పనులు నిర్వహిస్తున్నారు.

ఒంగోలు, జూలై 17 (ఆంధ్రజ్యోతి)/కొండపి/దర్శి : పంటల సాగు సీజన్ సమీపిస్తున్న వేళ జిల్లాలో సాగునీటి వనరుల మరమ్మతులు జరుగుతున్నాయి. అత్యవసర పనుల పేరుతో గతనెలలో కూటమి ప్రభుత్వం ఉమ్మడి జిల్లాలో ఒంగోలు సర్కిల్ పరిధిలోని 11 అసెంబ్లీ నియోజకవర్గాల్లో రూ.17.12 కోట్లతో 303 పనులను మంజూరు చేసింది. ఆ పనులను సత్వరం పూర్తిచేసి ఈ సీజన్‌లో నీటి సరఫరాకు ఇక్కట్లు లేకుండా చూడాలని ఆదేశించడంతో జలవనరుల శాఖ జిల్లా అధికారులు తదనుగుణంగా చర్యలు చేపట్టారు. సాగునీటి సంఘాలకు పనుల బాధ్యతను అప్పగించగా పలుచోట్ల ముమ్మరంగా ఆ పనులను చేస్తున్నారు. ఒంగోలు ఇరిగేషన్ సర్కిల్ పరిధిలోని ఉమ్మడి జిల్లాలో

మిగతా 6లో...

- పాలేరు మీద విక్కిరాలపేట నుంచి బింగినపల్లి వరకు సప్లయ్ చానల్ 21.320 కి.మీ దూరం ఉంటుంది. ఇందులో పూడికతీత, రక్షణ గోడల నిర్మాణం పనులు 50 శాతం పూర్తయ్యాయి. జరుగుమల్లి మండలంలోని కె.బిట్రగుంట, సింగరాయకొండ మండలంలోని చవిటి చెరువు, జువ్వలగుంట చెరువు, కొండరాజుగుంట చెరువు, మర్రిచెరువు, పాకల కొత్త, పాత చెరువులు, బింగినపల్లి చెరువులకు నీరు చేరుతుంది. పీబీ చానల్ పరిధిలోని చెరువుల కింద 7,318 ఎకరాలు సాగవుతుంది. మరో రూ.50లక్షలతో చెరవుల మరమ్మతు పనులు సాగనున్నాయి.
- దర్శి ఎన్‌ఎస్‌పీ డివిజన్ పరిధిలోని సాగర్ ప్రధాన కాలువ, దర్శి బ్రాంచ్ కాలువ, పమిడిపాడు బ్రాంచ్ కాలువలతో పాటు మేజర్లు, మైనర్ల మరమ్మతు పనులను రూ.1.08కోట్లతో చేస్తున్నారు. 70శాతం పూర్తయ్యాయి. చీమకుర్తి డివిజన్ పరిధిలోని దర్శి-2 సబ్ డివిజన్‌లో రూ.60 లక్షలతో సాగర్ కాలువ మరమ్మతులు చేస్తున్నారు. ఇక్కడ ఒంగోలు బ్రాంచ్ కాలువతో పాటు నిప్పట్లపాడు మేజరు, ఇతర మేజర్లు, మైనర్లకు మరమ్మతులు చేస్తున్నారు. ఒంగోలు బ్రాంచ్ కాలువ కట్టలపై కొద్దిరోజులుగా చిల్లచెట్లు తొలగింపు కార్యక్రమం శరవేగంతో సాగుతోంది.



పాలేరు - బిట్రగుంట ఛానల్ నుంచి చెరువుల్లోకి వెళుతున్న నీరు

నియోజకవర్గాల వారీగా మంజూరులైన పనులు, నిధుల వివరాలు

నియోజకవర్గం	పనులు	నిధులు (రూ.కోట్లలో)
దర్శి	50	2.93
కొండపి	25	2.00
ఒంగోలు	19	0.96
ఎస్‌ఎన్‌పాడు	31	1.55
వైపాలెం	24	1.00
గిద్దలూరు	16	0.76
మార్కాపురం	23	1.15
అద్దంకి	43	2.17
పర్చూరు	48	1.57
కందుకూరు	26	1.51
మొత్తం	301	17.12



ఒంగోలు బ్రాంచ్ కాలువ కట్టపై చిల్లచెట్లు తొలగించి కాలువను శుభ్రం చేస్తున్న ఎక్స్‌కవేటర్

ప్రైవేట్ బీఈడీ కళాశాలల మాయాజాలం

- తవ్వుతున్న కొద్దీ వెలుగులోకి వస్తున్న అక్రమాలు
- బోగస్ చిరునామాలతో అధికారులకు నివేదికలు
- యథేచ్ఛగా అనుమతులిస్తున్న ఏకే యూనివర్సిటీ

ప్రైవేట్ బీఈడీ కళాశాలల్లో తవ్విన కొద్దీ అక్రమాలు వెలుగులోకి వస్తున్నాయి. అడ్డగోలుగా అనుమతులు పొందిన పలు కళాశాలలు చిరునామాలు కూడా సక్రమంగా ఇవ్వటం లేదు. ఇష్టానుసారంగా రికార్డులు సమర్పించినప్పటికీ యూనివర్సిటీ అధికారులు ముడుపులు తీసుకొని అనుమతులు ఇస్తున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి.

దర్శి, జూలై 17 (ఆంధ్రజ్యోతి): దర్శిలో 17 బీఈడీ కళాశాలలు ఉన్నాయి. అందులో కొన్నింటికి భవనాలు కూడా లేవు. అన్ని కళాశాలల్లో ఇతర రాష్ట్రాలకు చెందిన విద్యార్థులు మాత్రమే చేరుతుంటారు. ఈక్రమంలో ఆన్‌లైన్ కౌన్సెలింగ్ మొక్కుబడిగా సాగుతుంది. ఎవరైన ఇక్కడి విద్యార్థులు కౌన్సెలింగ్‌లో పాల్గొని అర్హత సాధించినప్పటికీ ఏదోరకంగా కొర్రీలు పెట్టి సీట్లు ఇవ్వకుండా ఎగనామం పెడుతున్నారు. కొంతమంది దళారులతో కుదుర్చుకున్న ఒప్పందం ప్రకారం వారు పంపిన విద్యార్థులను మాత్రమే చేర్చుకుంటున్నారు.

పాస్ గ్యారెంటీ పేరుతో..

దర్శి ప్రాంతానికి చెందిన కొంతమంది దళారులు ఇతర రాష్ట్రాల్లో కన్సల్టెన్సీ కేంద్రాలు ఏర్పాటు చేసుకొని ఇక్కడి కళాశాలలకు విద్యార్థులను పంపుతుంటారు.. బోధనా తరగతులకు హాజరుకావాల్సిన అవసరం లేదని, పాస్ గ్యారెంటీ చేస్తామని చెప్పి ఒక్కో విద్యార్థి నుంచి లక్షా యాభై వేలు వసూల్ చేస్తున్నారు. ఇక్కడ సులభంగా ఉత్తీర్ణత సాధించి సర్టిఫికెట్ పొందవచ్చనే ఉద్దేశంతో వారు అడిగినంత డబ్బులు చెల్లించి ఇక్కడ చేరుతున్నారు. ఆ విద్యార్థులు పరీక్షలకు మాత్రమే హాజరవుతున్నారు. కొన్ని కళాశాలల్లో ప్రాక్టికల్స్ కూడా సక్రమంగా నిర్వహించటం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. విద్యార్థులతో ముందుగానే సంతకాలు తీసుకొని ప్రాక్టికల్స్ నిర్వహించినట్లు

మిగతా 6లో...

ఒంగోలులో దొంగలు హల్‌చల్



- 5 ఇళ్లలో చోరీలు
- రూ.34 లక్షలు విలువైన సొత్తు అపహరణ
- ఘటనా స్థలాలను పరిశీలించిన డీఎస్పీ

6,7

హుషారుగా ఇంటింటికీ

- ఏడాది పాలన ప్రచారోద్యమంలో టీడీపీ ● తాజాగా కనిగిరిలో హాజరైన ఇన్‌చార్జి మంత్రి ఆనం



కనిగిరిలో ఇంటింటికీ ప్రచారంలో పాల్గొన్న మంత్రి ఆనం రామనారాయణరెడ్డి, ఎమ్మెల్యే ఉగ్ర

ఒంగోలు, జూలై 17(ఆంధ్రజ్యోతి): సుపరిపాలనలో తొలి అడుగు పేరుతో కూటమి ప్రభుత్వం ఏడాది పాలనపై చేపట్టిన ప్రచారోద్యమం జిల్లాలో హుషారుగా సాగుతోంది. పార్టీ అధిష్ఠానం ఆదేశాలతో జిల్లావ్యాప్తంగా క్షేత్రస్థాయిలో పార్టీ కేడర్ ఇంటింటికీ వెళ్లి ప్రజలను కలుస్తూ ఏడాది పాలనపై రూపొందించిన కరపత్రాలను పంపిణీ చేస్తున్నారు. స్థానిక సమస్యలపై ప్రజలు చెప్పే అంశాలను కూడా స్వీకరిస్తున్నారు. బూత్‌స్థాయిలో కార్యక్రమ నిర్వహణ తీరుపై కేంద్ర కార్యాలయం నుంచి విచారిస్తున్న నేపథ్యంలో మరింత చురుగ్గా సాగేలా ఎమ్మెల్యేలు, ఇన్‌చార్జులు, పరిశీలకులు చర్యలు

మిగతా 6లో...



ఒంగోలులో ప్రజావాణి బాక్సులో ఫిర్యాదు పత్రం వేస్తున్న టీడీపీ నాయకుడు

డిగ్రీ అడ్మిషన్లకు లైన్‌క్లియర్

- ఉత్తర్వులు జారీచేసిన ప్రభుత్వం

ఒంగోలు విద్య, జూలై 17 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని డిగ్రీ కళాశాలల్లో 2025-26 విద్యా సంవత్సరంలో ప్రవేశాలకు ఎట్టకేలకు లైన్‌క్లియర్ అయింది. డిగ్రీ ప్రవేశాల్లో ఈ ఏడాది బాగా జాప్యం జరిగింది. ఏప్రిల్‌లో ఇంటర్మీడియెట్ ఫలితాలు వెలువడగా మూడు నెలల జాప్యంతో ఇప్పుడు డిగ్రీ ప్రవేశాలకు ఆమోదం తెలిపింది. అడ్మిషన్లకు సంబంధించి రాష్ట్ర ఉన్నత విద్యామండలి షెడ్యూల్ విడుదల చేయాల్సి ఉంది. తెలంగాణ రాష్ట్రంలో జూన్ ఆఖరుకు డిగ్రీ ప్రవేశాలు పూర్తికాగా మన రాష్ట్రంలో జూలై ఆఖరుకు కూడా పూర్తయ్యే పరిస్థితి కనిపించడం లేదు. డిగ్రీ అడ్మిషన్లకు దరఖాస్తు చేయడంలో ఎస్సీ రిజర్వేషన్ల అమలులో ప్రభుత్వం మార్పులు చేసింది. ఈ మేరకు బుధవారం రాత్రి రాష్ట్ర ఉన్నత విద్యాశాఖ కార్యదర్శి కొన శశిధర్ ఉత్తర్వులు జారీ చేశారు. ఆర్ట్స్, సైన్స్, సోషల్, సైన్స్, కామర్స్ మేనేజ్‌మెంట్, కంప్యూటర్ అప్లికేషన్స్, సోషల్ వర్క్ సబ్జెక్టుల్లో బీఏ, బీఎస్సీ, బీకాం అండర్ గ్రాడ్యుయేషన్ కోర్సుల్లో ప్రవేశాలకు ప్రభుత్వం అనుమతి మంజూరు చేసింది. ప్రవేశాలకు ఇప్పటివరకు ఆన్‌లైన్‌లోనే దరఖాస్తులు స్వీకరించేవారు. ప్రస్తుతం ఆఫ్‌లైన్‌లో కూడా దరఖాస్తులు చేసుకునేందుకు అనుమతి ఇచ్చారు. అయితే ఆఫ్‌లైన్‌లో దరఖాస్తులు స్వీకరించే కళాశాలలు ఆ వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేయాల్సి

మిగతా 6లో...

నామమాత్రంగా అపరాధ రుసుం

- పొగాకు బోర్డు ఈడీని కలిసి కోరిన రైతుప్రతినిధులు

ఒంగోలు కలెక్టరేట్, జూలై 17 (ఆంధ్రజ్యోతి) : అనుమతించిన దాని కన్నా అదనంగా పండిన పొగాకు పంట కొనుగోలుకు అనుమతి ఇవ్వాలని రైతు ప్రతినిధులు పొగాకు బోర్డు ఈడీ విశ్వశ్రీని విజ్ఞప్తి చేశారు. ఆ అదనపు పంటకు అధికంగా కాకుండా నామమాత్రంగా 2 లేదా 3 శాతం మాత్రమే అపరాధ రుసుం వసూలు చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఒంగోలులోని ఆర్‌ఎం కార్యాలయానికి గురువారం సాయంత్రం వచ్చిన బోర్డు ఈడీ విశ్వశ్రీని వివిధ వేలం కేంద్రాల రైతు కమిటీల ప్రతినిధులు కలిసి వినతిపత్రం అందజేశారు. అదనపు పంటకు అధికంగా అపరాధ రుసుం విధిస్తే దారుణంగా నష్టపోతామన్నారు. వాస్తవ పరిస్థితిని కేంద్ర వాణిజ్య శాఖ దృష్టికి తీసుకెళ్లి నామమాత్రపు రుసుంతో కొనేలా చూడాలని కోరారు. రానున్న సీజన్‌కు పొగాకు బోర్డు ద్వారా రైతులకు ఎరువులు సరఫరా జరిగేలా చూడాలని కోరారు. ఈడీని కలిసిన వారిలో పోతుల నరసింహారావు, వడ్డెళ్ల వరప్రసాద్ ఉన్నారు.

రేషన్ కార్డుల్లో పేర్ల తొలగింపునకు అవకాశం

- వయసునూ సరిచేసుకోవచ్చు



ఒంగోలు కలెక్టరేట్, జూలై 17 (ఆంధ్రజ్యోతి): రేషన్ కార్డుల్లో పేర్లు తొలగింపునకు ప్రభుత్వం అవకాశం కల్పించింది. మే నెలలో రేషన్ కార్డుల్లో చేర్పులు, మార్పులకు అవకాశం కల్పించగా, తాజాగా రేషన్ కార్డుల్లో ఉన్న పేర్లను తొలగింపునకు అవకాశం కల్పించింది. జిల్లాలోని అనేక ప్రాంతాల్లో మహిళలు వివాహాలు చేసుకొని మరో ఇంటికి వెళ్లారు. అయితే వారి పేర్లను రేషన్ కార్డుల నుంచి తొలగించేందుకు అవకాశం లేకుండాపోయింది. ఇంకొక వైపు రేషన్‌కార్డుల్లో వయస్సు ఎక్కువగా ఉన్న వాటిని సరిచేసేందుకు అవకాశం లేదు. ఇప్పుడు తాజాగా ప్రభుత్వం ఆ మార్పులకు అవకాశం కల్పించింది. రేషన్ కార్డుల్లో అన్ని రకాల మార్పులకు అవకాశం కల్పించడంతో కార్డుదారులు సచివాలయాల్లో దరఖాస్తు చేసుకోవాల్సి ఉంది. అందుకు సంబంధించిన ధ్రువీకరణ పత్రాలతో దరఖాస్తు చేసుకుంటే వాటిని పరిశీలించి తొలగించే ప్రక్రియను చేపడతారు. ప్రభుత్వం తాజాగా ఈ ప్రక్రియను చేపట్టడంతో జిల్లావ్యాప్తంగా భారీగా దరఖాస్తులు వచ్చే అవకాశం ఉంది. ఇప్పటికే తమ రేషన్ కార్డుల్లో చనిపోయిన వారిని, వివాహం చేసుకొని వెళ్లిపోయిన వారిని, వయస్సు తక్కువగా ఉందని తదితరాల కోసం ప్రజలు దరఖాస్తులు చేసుకుంటూ వస్తున్నారు. ఈ నేపథ్యంలో ప్రభుత్వం తాజాగా అవకాశం కల్పించడంతో ప్రజలకు ఎంతో మేలు జరగనుంది.

3 రోజులు పోస్టల్ సేవలు నిలుపుదల

ఒంగోలు, కార్పొరేషన్, జూలై 17 (ఆంధ్రజ్యోతి) : వినియోగదారులు ఇంటి నుంచే సేవలు పొందేలా ఈనెల 22వ తేదీ నుంచి అధునాతన తపాల శాఖ సాంకేతిక విధానాన్ని అమలులోకి తీసుకొస్తున్నట్లు ప్రకాశం డివిజన్ సూపరింటెండెంట్ మహ్మద్ జాఫర్ సాధిక్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. అందులో భాగంగా ఈనెల 19వ తేదీ నుంచి 21వ తేదీ వరకు మూడు రోజులపాటు జిల్లాలోని 452 పోస్టాఫీస్‌లలో సేవలను తాత్కాలికంగా నిలుపుదల చేశారు. తిరిగి 22వ తేదీ నుంచి ఆఫీస్‌లు యథావిధిగా సేవలు అందిస్తాయని ఆయన వివరించారు. నూతన సాంకేతిక విధానం అమలులోకి తీసుకురావడం వల్ల పోస్టల్ సేవలు సామర్థ్యం పెంపు, సెల్‌ఫోన్ ద్వారా ఆర్థిక, బీమా, బ్యాంకింగ్, ఇతర లావాదేవీల నిర్వహణతోపాటు, మెరుగైన ట్రాకింగ్‌తో పోస్టల్ సేవలను వినియోగదారులకు అందించడం జరుగుతుందని ప్రజలు సహకరించాలని కోరారు.

తోకపల్లి టూ పందిళ్లపల్లి

- ఉమ్మడి ప్రకాశంలో తూర్పు, పశ్చిమ ప్రాంతాలను కలుపుతూ జాతీయ రహదారి
- మంత్రి రవికుమార్ ప్రతిపాదనలకు సీఎం ఓకే
- కేంద్రానికి పంపిన రాష్ట్ర ప్రభుత్వం



అలవలపాడు వద్ద అద్దంకి-కొణికి ఆర్‌అండ్‌బీ రోడ్డు

అద్దంకి, జూలై 17 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి ప్రకాశం జిల్లాలో తూర్పు, పశ్చిమ ప్రాంతాలను కలుపుతూ జాతీయ రహదారి నిర్మాణానికి రాష్ట్ర ప్రభుత్వం ప్రతిపాదనలు సిద్ధం చేసి కేంద్ర ప్రభుత్వానికి పంపింది. పెద్దారవీడు మండలం తోకపల్లి నుంచి దొనకొండ, దర్శి, అద్దంకి, చందలూరు, ఇంకొల్లు, కడవకుదురు, మోటుపల్లి మీదుగా పందిళ్లపల్లి వరకు సుమారు 130.345 కి.మీ దూరం జాతీయ రహదారి నిర్మాణానికి విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ ప్రతిపాదనలు సిద్ధం చేసి సీఎం దృష్టికి తీసుకు పోవటంతో అంగీకరించారు. ఈ నేపథ్యంలో జాతీయ రహదారి నిర్మాణానికి రాష్ట్ర ప్రభుత్వం నుంచి కేంద్ర ప్రభుత్వానికి ప్రతిపాదనలు వెళ్లినట్లు విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ తెలిపారు.



దర్శి-అద్దంకి ఆర్‌అండ్‌బీ రోడ్డు

ప్రతిపాదనలివీ..

- పెద్దారవీడు మండలం కుంట వద్ద రెండు జాతీయ రహదారుల నుంచి ప్రారంభమై దొనకొండ, చందవరం, చీరాల ప్రాంతాన్ని కలుపుతూ ఒంగోలు-దిగమర్రు హైవేలో కలిసేలా జాతీయ రహదారి నిర్మాణానికి ప్రతిపాదనలు పంపినట్లు తెలుస్తోంది.
- దీని ద్వారా కుంట వద్ద ఉన్న రెండు జాతీయ రహదారులు, అద్దంకి సమీపంలో ఉన్న నామ్ రోడ్డు, విజయవాడ-బెంగళూరు గ్రీన్ ఫీల్డ్ రోడ్డు, పాత మద్రాస్ రోడ్డు, ఒంగోలు-దిగమర్రు రోడ్డులను అనుసంధానం చేసేలా జాతీయ రహదారి ఉంటుందని ప్రతిపాదనలలో వివరించారు.
- విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ దీనిపై పూర్తి కసరత్తు చేసి సీఎం చంద్రబాబునాయుడును ఒప్పించి కేంద్ర ప్రభుత్వ ఆమోదానికి పంపినట్లు తెలుస్తోంది.

బాబాయి, పిన్నిలపై అబ్బాయి దాడి

- ఆస్తి వివాదాలే కారణం ● ఇద్దరి పరిస్థితి విషమం 7

గోవా మద్యం పట్టివేత

ముగ్గురు నిందితుల అరెస్ట్ | 144 క్వార్టర్ బాటిళ్లు, పలు వాహనాలు సీజ్ 7

కంభం ప్రైవేటు క్లినిక్‌లో విద్యార్థికి ఇంజక్షన్

వికటించి సీరియస్



చికిత్స పొందుతున్న సతీష్‌కుమార్



ఎడమ చేయి మణికట్టు వద్ద పడిన రంధ్రం

కంభం, జూలై 17 (ఆంధ్రజ్యోతి) : కంభం ప్రభుత్వ వైద్యశాలలో 10వ తరగతి చదువుతున్న విద్యార్థికి నీరసం పోయేందుకు అని చెప్పి ఓ ప్రైవేటు క్లినిక్‌లో ఎడమచేతి మణికట్టుకు ఇంజక్షన్ వేయడంతో అది వికటించి స్పృహ తప్పి పడిపోయాడు. వెంటనే ఆ బాలుడిని కంభం ప్రభుత్వ వైద్యశాలకు తరలించిన ఘటన గురువారం జరిగింది. కందులాపురం పంచాయతీ పరిధిలో రావిపాడు వెళ్లే దారిలో దర్గా సమీపంలో నివాసముంటున్న రమణమ్మ తన ఇద్దరు పిల్లలతో నివసిస్తున్నది. చిన్నకుమారుడు కె.సతీష్‌కుమార్ కంభం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 10వ తరగతి చదువుతున్నాడు. గత వారం సతీష్‌కుమార్ పీఈటీ పీరియడ్‌లో ఆడుకుంటున్న సమయంలో నీరసంగా ఉందని చెప్పడంతో స్నేహితుడు నితీష్ పాఠశాల సమీపంలోని ప్రైవేటు క్లినిక్ తీసుకెళ్లగా వారు బలవంతంగా మణికట్టు వద్ద ఇంజక్షన్ వేశారు. అయితే ఆ ఇంజక్షన్ వికటించి ఒళ్లంతా ఇన్‌ఫెక్షన్ వచ్చి మణికట్టు వద్ద రంధ్రం ఏర్పడింది. గురువారం సాయంత్రం 5గంటల సమయంలో సతీష్‌కుమార్ స్పృహ తప్పి పడిపోవడంతో కుటుంబసభ్యులు ప్రభుత్వ వైద్యశాలలో చేర్పించగా పరీక్షించిన వైద్యులు పోలీసులకు సమాచారం అందించడంతో ఎస్సై నరసింహారావు బాలుడిని విచారించి కేసు నమోదు చేశారు. కాగా ప్రైవేటు క్లినిక్ పేరుతో కాంపౌండర్లుగా పని చేస్తున్న పలువురు ఆసుపత్రులను తెరిచి జీవితాలతో ఆటలాడుతున్నారనే విమర్శలు బాగా వినిపిస్తున్నాయి. ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.



బొప్పాయి మొక్కలు నాటేందుకు సాళ్లు తోలుతున్న ట్రాక్టరు

ఆశల సాగుకు రైతులు సిద్ధం

వాతావరణం అనుకూలించకపోయినా.. వరుణుడు కరుణించకపోయినా.. పంటలు పండుతాయో లేదో అనే అనుమానాలు ఆవహిస్తున్నా.. నష్టాలు వస్తాయని భయం కలుగుతున్నా.. అన్నింటినీ అధిగమించి ఏదో ఒకరోజు వర్షాలు కురవకపోతాయా? పంటలు పండకపోతాయా అనే నమ్మకంతో రైతులు వారి ప్రయత్నం వారు చేస్తూనే ఉంటారు. ఖరీఫ్ ప్రారంభమైన తరువాత ఇప్పటివరకు వర్షాలు లేక ఎండల తీవ్రత అధికంగా ఉండి వేసిన పైర్లు కూడా ఎండుముఖం పడుతున్నాయి. ఎర్రగొండపాలెం నియోజకవర్గం పరిధిలో రైతులు నారుమళ్లు సిద్ధం చేస్తున్నారు. మిర్చి నారుకు నర్సరీలు ఏర్పాటు చేశారు. వరినారు సిద్ధం చేసుకోవడం, పంట పొలాలను దున్ని సిద్ధం చేయడం ఇలా ఆశల సాగుకు రైతులు సంసిద్ధులై కనిపిస్తున్నారు.

- త్రిపురాంతకం, ఆంధ్రజ్యోతి.



వరినారుకోసం విత్తనాలు చల్లుతున్న రైతు



నర్సరీల్లో మిర్చి విత్తనాలు నాటుతున్న మహిళలు



మిర్చినారు మడిని సిద్ధం చేసుకున్న రైతులు

ఇక ఆగనీయరు...

(5వపేజీ తరువాయి)!

ప్రధాన సాగునీటి వనరుగా సాగర్ కుడికాలువ ఉంది. రాళ్ళపాడు, మోపాడు, కంభం చెరువు, వీఆర్‌కోట ఆనకట్ట, పీబీ చానల్‌లు, మధ్యతరహా వనరులు కింద, మరో 953 చెరువులు, చిన్నతరహా నీటి వనరులు ఉన్నాయి. అందులో సుమారు 4.43 లక్షల ఎకరాలు సాగర్ కాలువ కింద ఆయకట్టు ఉండగా 40వేల ఎకరాలు మధ్యతరహా, లక్షా 30వేల ఎరాలు చిన్నతరహా వనరుల కింద ఉంది.

గత ఐదేళ్లు పట్టించుకోని వైసీపీ ప్రభుత్వం

సాగర్ కాలువల నీటికి ప్రధాన వనరు కృష్ణా జలాలు. ఇతర వాటికి వర్షపునీరే ఆధారం. కృష్ణాజలాల సరఫరా బాగానే ఉంటున్నా సాగర్ కాలువల నిర్వహణ సరిలేక పంట పొలాలకు నీరందడం లేదు. గత వైసీపీ ప్రభుత్వంలో ఈ రంగాన్ని పూర్తిగా నిర్లక్ష్యం చేశారు. అంతకు ముందు టీడీపీ కాలంలో సాగర్ కాలువల ఆధునికీకరణ పనులు భారీగా చేయగా వైసీపీ ఐదేళ్ల కాలంలో కనీసం పూడిక తీత, జంగిల్ క్లియరెన్స్ వంటివి కూడా చేయలేదు. దీంతో పలు మేజర్, మైనర్ కాలువలు, అక్కడక్కడా బ్రాంచి కాలువలు కూడా అధ్వానంగా మారి నీటి సరఫరా సరిలేక రైతులు అవస్థలు పడ్డారు. మీడియం, మైనర్ ఇరిగేషన్ పనుల పరిస్థితి మరింత దారుణంగా ఉంది. ఈ నేపథ్యంలో గత ఏడాది అధికారంలోకి వచ్చిన వెంటనే కూటమి ఈ పరిస్థితిపై దృష్టిసారించి తక్షణం అవసరమైన కొన్ని పనులు చేసి నీటి సరఫరా చేశారు. ప్రస్తుత సీజన్‌లో ఆగస్టు నుంచి సాగర్ కాలువలలో అనంతరం సెప్టెంబరు, అక్టోబరు నుంచి మధ్యతరహా, చిన్నతరహా నీటివనరుల్లో నీటిసరఫరాకు అవకాశం ఉంటుంది. దీంతో జూలై ఆఖరు నాటికి ఆయా వనరులలో అత్యవసరమైన పనులు చేసేలా ప్రజా ప్రభుత్వం దృష్టిసారించింది.

● జిల్లాలో 301 పనులు మంజూరు

రాష్ట్రవ్యాప్తంగా ఇలాంటి పనుల కోసం ప్రభుత్వం గతనెలలో రూ.374 కోట్లు మంజూరు చేసింది. అందులో ఒంగోలు సర్కిల్ పరిధిలో ఉమ్మడి జిల్లాలో ఉన్న నియోజకవర్గాలకు రూ.17.12 కోట్ల విలువైన 301 పనులు మంజూరు చేసింది. అందులో సాగర్ కాలువలకు సంబంధించి రూ.9.54 కోట్ల విలువైన 205 పనులు ఉండగా మీడియంలో రూ.3.40 కోట్ల విలువైన 61 పనులు ఉన్నాయి. ఆయా నియోజకవర్గాల వారీగా చేస్తే గరిష్ఠంగా అన్ని విభాగాల పనులు కలిపి దాదాపు రూ.2.93 కోట్ల విలువైన 50 పనులు ఉన్నాయి. కనిష్ఠంగా గిద్దలూరులో రూ.76లక్షల విలువైన 16 పనులు ఉన్నాయి. ప్రధానంగా జంగిల్ క్లియరెన్స్, పూడికతీత, అక్కడక్కడ షట్టర్లు, డ్రాపుల మరమ్మతుల పనులు అధికంగా ఉన్నాయి. కనిష్ఠంగా రూ.2లక్షలు, గరిష్ఠంగా రూ.10లక్షలలోపు ఈ పనులు ఉన్నాయి. ఈ పనులన్నీ నీటి సంఘాల ద్వారా జరుగుతున్నాయి. ప్రస్తుతం అన్ని ప్రాంతాల్లో పనులు జరుగుతున్నాయని ఈ నెలాఖరులోపు పూర్తిచేసేలా చర్యలు తీసుకుంటున్నట్లు జలవనరుల శాఖ ఎస్‌ఈ వరలక్ష్మి తెలిపారు ఆయా నియోజకవర్గాల వారీ వివరాలు ఇలా ఉన్నాయి.

ప్రైవేటు బీఈడీ కళాశాలల మాయాజాలం

(5వపేజీ తరువాయి)

రికార్డులు సృష్టిస్తున్నట్లు తెలిసింది.

అడ్డగోలుగా అనుమతులు

కళాశాలలు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నా యూనివర్సిటీ అధికారులు మాత్రం అంతా సక్రమంగా ఉన్నట్లు నివేదికలు ఇస్తున్నారు. గతంలో ఈ కళాశాలలు నాగార్జున యూనివర్సిటీ పరిధిలో ఉండేవి. కొన్ని సంవత్సరాలుగా బీఈడీ కళాశాలల్లో ఈ తంతు కొనసాగుతుంది. ఇటీవల జిల్లాలో ఆంధ్రకేసరి యూనివర్సిటీ ఏర్పాటుచేయటంతో ఈ బీఈడీ కళాశాలలను ఆంధ్రకేసరీ యూనివర్సిటీ అనుబంధం చేశారు. ప్రస్తుతం ఆ యూనివర్సిటీ అధికారులు దర్శిలో ప్రైవేట్ బీఈడీ కళాశాలలను గత కొన్ని రోజులుగా తనిఖీలు చేస్తున్నారు. అనుమతులు పొందిన కళాశాలల్లో కొన్నింటికి భవనాలు లేకపోగా, అడ్రస్సులు కూడా సరిగ్గా ఇవ్వలేదు. రెండు కళాశాలలు తానంచింతల గ్రామం, పొదిలి రోడ్డులో ఉన్నట్లు రికార్డులు సమర్పించారు. పొదిలి రోడ్డులో తానంచింతల గ్రామం లేదు. దర్శి-కురిచేడు రోడ్డులో ఆ కళాశాల ఉంది. రికార్డులు అడ్డగోలుగా సమర్పించినా యూనివర్సిటీ అధికారులు ఎలాంటి తనిఖీలు చేయకుండానే అడ్డగోలుగా అనుమతులు ఇస్తున్నారు.

● గత ప్రభుత్వంలో భ్రష్టుపట్టిన విద్యావ్యవస్థ

గత వైసీపీ ప్రభుత్వంలో విద్యావ్యవస్థ భ్రష్టుపట్టిపోయింది. ప్రైవేట్ కళాశాలలు ఇష్టారాజ్యంగా వ్యవహరించాయి. ప్రస్తుత ప్రజా ప్రభుత్వంలో మంత్రి నారా లోకేష్ విద్యాశాఖలో అనేక మార్పులు తెచ్చారు. ప్రైవేట్ బీఈడీ కళాశాలల్లో మాత్రం ఇంకా ప్రక్షాళన జరగలేదు. అధికారులు ఇప్పటికీ గతంలో మాదిరి వ్యవహరిస్తున్నారు. పేరుకు మాత్రమే పరిశీలన చేస్తున్నారు. వారు ఎప్పుడు ఏ కళాశాలలు తనిఖీలు చేస్తున్నారో ఎవరికీ తెలియదు. గుట్టుగా వచ్చి కళాశాలల యజమానులు ఏర్పాటుచేసిన వసతి భవనాల్లో ఉంటూ ముడుపులు తీసుకొని సంతకాలు పెడుతున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఉన్నతాధికారులు ప్రైవేట్ కళాశాలల్లో జరుగుతున్న తంతును గుర్తించి సక్రమంగా నడిచే విధంగా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

పీ-4 పథకాన్ని వేగంగా అమలు చేయాలి : కలెక్టర్

ఒంగోలు(రూరల్), జూలై17(ఆంధ్రజ్యోతి): పి-4 పథకాన్ని వేగంగా అమలుకు అధికారులు దృష్టి సారించాలని కలెక్టర్ తమీమ్ అన్సారియా ఆదేశించారు. గురువారం స్థానిక కలెక్టరేట్‌లో జరిగిన సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ బంగారుకుటుంబాల అవసరాలను గుర్తించటంతోపాటు వారిని దత్తత తీసుకునే మార్గదర్శకులను త్వరగా గుర్తించాలని చెప్పారు. కార్యక్రమంలో ఆర్డీవో లక్ష్మీప్రసన్న, డీపీవో వెంకటనాయుడు, జడ్పీ సీఈవో చిరంజీవి, పౌరసరఫరాల శాఖ అధికారి వరలక్ష్మి, నగర కమిషనర్ వెంకటేశ్వరరావు, పరిశ్రమల మేనేజర్ శ్రీనివాసరావు, సీపీవో స్వరూపరాణి పాల్గొన్నారు.

హుషారుగా ఇంటింటికీ..

(5వపేజీ తరువాయి)!

తీసుకుంటున్నారు. మరోవైపు నిత్యం ఈ కార్యక్రమంలో ఇంచుమించు అందరూ ఎమ్మెల్యేలు లేదా ఇన్‌చార్జులు, ఇతర ముఖ్యనేతలు పాల్గొంటున్నారు. అత్యవసర పనులు ఉంటే ఒకరోజు, రెండు రోజులు తప్ప గతపక్షం రోజులుగా సాగుతున్న ఈ ప్రచార కార్యక్రమంలో నిత్యం ఆ స్థాయి నాయకులు హాజరవుతున్నారు.

● జిల్లావ్యాప్తంగా అనేక గ్రామాలు, పట్టణ ప్రాంతాల్లోని వార్డుల్లో గురువారం ఇంటింటికీ టీడీపీ కార్యక్రమం జరగ్గా జిల్లా ఇన్‌చార్జి మంత్రి ఆనం రామనారాయణరెడ్డి కనిగిరి పట్టణంలో అక్కడి ఎమ్మెల్యే డాక్టర్ ముక్కు ఉగ్రనరసింహారెడ్డితో కలిసి పాల్గొన్నారు. ప్రధానంగా వ్యాపార వర్గాలు అధికంగా ఉండే ప్రాంతంలో పర్యటించడంతోపాటు స్థానికంగా దేవాలయ నిర్మాణానికి శంకుస్థాపన కూడా చేశారు.

● ఒంగోలులో ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ నగరంలోని 34, 35 డివిజన్లలో పాల్గొనడంతోపాటు ప్రజా సమస్యల పరిష్కారం కోసం వారి నుంచి ఫిర్యాదుల స్వీకరణకు ప్రజావాణి పేరుతో నగరంలో మూడుచోట్ల ఏర్పాటు చేసిన బాక్సులను కొత్తపట్నం బస్టాండు వద్ద ప్రారంభించారు.

● ఎస్ఎన్‌పాడు ఎమ్మెల్యే బీఎన్ విజయకుమార్ సంతనూతలపాడు మండలం బి.మాచవరంలో పాల్గొనగా గిద్దలూరు ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి రాచర్ల మండలం చినగానిపల్లిలో, కాల్వపల్లి గ్రామాల్లో పాల్గొన్నారు.

● మారిటైం బోర్డు చైర్మన్ దామచర్ల సత్యనారాయణ పొన్నలూరు మండలంలోని పలు గ్రామాల్లో ప్రచారం నిర్వహించారు. దర్శి ఇన్‌చార్జి ముండ్లమూరులో పాల్గొనగా వైపాలెం టీడీపీ ఇన్‌చార్జి ఈ కార్యక్రమంలో భాగంగా వైపాలెం నుంచి పుల్లలచెరువు వరకు రూ.2.80 కోట్లతో నిర్మిస్తున్న తారురోడ్డు పనులకు శంకుస్థాపన చేశారు.

డిగ్రీ అడ్మిషన్ల లైన్‌క్లియర్

(5వపేజీ తరువాయి)!

ఉంటుంది. దరఖాస్తు స్వీకరించిన ప్రిన్సిపాల్స్ తప్పనిసరిగా రసీదు ఇవ్వాలి. విద్యార్థి ఏ కళాశాలలో అయితే దరఖాస్తు చేస్తారో ఆ కళాశాలను, అక్కడి కోర్సులను ప్రథమ ప్రాధాన్యతగా ఎంపిక చేసుకోవాల్సి ఉంటుంది. ఆన్‌లైన్‌లో దరఖాస్తులు సమర్పించే విద్యార్థులు దరఖాస్తుతోపాటు తాము ప్రవేశం పొందే కళాశాలలో కోర్సులను ప్రాధాన్యత క్రమంలో పేర్కొనాలి. డిగ్రీ కళాశాలల్లో ప్రవేశాలను మెరిట్ కమ్ రోస్టర్ విధానంలో నిర్వహిస్తారు. రిజర్వుడు కేటగిరీ విద్యార్థులకు వారి రిజర్వేషన్ ప్రకారం సీట్లు కేటాయిస్తారు. ఎస్సీ విద్యార్థులకు మొత్తం సీట్లలో 15 శాతం కేటాయిస్తారు. ఈ రిజర్వేషన్లను వర్గీకరణ ప్రకారం అమలుచేస్తారు. గ్రూపు-1లోని 12 కులాలకు 1 శాతం, గ్రూపు-2లోని 18 కులాలకు 6.5శాతం, గ్రూపు-3లోని 29 కులాలకు 7.5శాతం వంతున 15 శాతం సీట్లు కేటాయిస్తారు.

మేం అర్హులమే.. మాకూ ఇవ్వండి!

(5వపేజీ తరువాయి)

అర్జీలు ఇవ్వాల్సిందిగా ప్రభుత్వం సూచించింది. అందుకు ఈనెల 13 వరకు గడువు ఇచ్చింది. అలా ఐదురోజులు అవకావం ఇవ్వగా జిల్లాలో 2,278 మంది రైతులు తమకు కూడా అర్హత ఉండగా జాబితాల్లో పేర్లు లేవని, పరిశీలించి లబ్ధిదారుల జాబితాలో చేర్చాలని కోరుతూ వ్యవసాయశాఖ అధికారులకు అర్జీలు ఇచ్చారు. వాటిలో 116 అర్జీలు ప్రభుత్వ, ఈనాం భూములు వంటి అంశాలకు చెందినవిగా ఉండటంతో వాటిని రెవెన్యూ పరిశీలనకు పంపిన వ్యవసాయ శాఖ అధికారులు మిగిలిన వాటిలో అర్హత ఉన్నవాటిని లబ్ధిదారుల జాబితాల్లో చేర్చుతున్నారు. తొలుత అర్జీలు ఇచ్చేందుకు ఈనెల 13 వరకు మాత్రమే గడువు ఇచ్చిన ప్రభుత్వం ప్రస్తుతం పొడిగింపు తదుపరి ఆదేశాలు ఇచ్చే వరకు స్వీకరించాలని జిల్లా అధికారులకు సూచించింది. దీంతో రైతులు అర్జీలు పెట్టుకొనే అవకాశం ఉంది. మరో వారంలో తొలివిడత పీఎం కిసాన్-అన్నదాత సుఖీభవ పథకం కింద రూ.7000 నగదు ఖాతాల్లో జమ అయ్యే అవకాశం ఉండటంతో తుది జాబితా ఎంపిక పనిలో ఉన్నారు.

డైట్‌లో ప్రారంభమైన డీసెట్ కౌన్సెలింగ్

సంతనూతలపాడు, జూలై 17(ఆంధ్రజ్యోతి): మైనంపాడు డైట్ కళాశాలలో గురువారం డీసెట్ కౌన్సిలింగ్ ప్రారంభమైనట్లు ప్రిన్సిపాల్ సోమా సుబ్బారావు తెలిపారు. కౌన్సిలింగ్ ఈనెల 22వరకు జరుగుతుందన్నారు. ప్రభుత్వం సూచించిన మేరకు తెలుగు, ఇంగ్లీషు మీడియంలకు రెండు టీములను ఏర్పాటు చేశామని, తద్వారా ఒరిజినల్ ధృవీకరణ పత్రాలను పరిశీలిస్తామని పేర్కొన్నారు. ప్రొవిజనల్ అడ్మిషన్ లెటర్‌తో వచ్చిన అభ్యర్థికి అన్ని ధృవీకరణ పత్రాలను పరిశీలించిన అనంతరం ఫైనల్ అడ్మిషన్ లెటర్ ఇస్తామని ఆయన చెప్పారు. జిల్లాలోని మైనంపాడు డైట్ కళాశాలతో పాటు దర్శి, కనిగిరి రెండు ప్రైవేట్ డైట్ కళాశాలలకు మైనంపాడులోనే కళాశాలలో ధృవీకరణ పత్రాల పరిశీలన జరుగుతుందన్నారు. తొలిరోజు నలుగురు అభ్యర్థులకు సీట్లు కేటాయించినట్లు వెల్లడించారు.



సీట్లు పొందిన అభ్యర్థులకు అడ్మిషన్ లెటర్ ఇస్తున్న ప్రిన్సిపాల్ సుబ్బారావు

అవీఇవీ

ఉద్యాన శాఖ పథకాలను వినియోగించుకోవాలి

ఒంగోలు కలెక్టరేట్, జూలై 17 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో ఉద్యాన శాఖ ద్వారా అమలవుతున్న పథకాలను రైతులు వినియోగించుకోవాలని ఆ శాఖ అధికారి వై గోపీచంద్ ఒక ప్రకటనలో కోరారు. ఉద్యాన పంటలు సాగు చేసే రైతులకు రక్షిత సాగు విధానాలను వివరించారు. రక్షిత గృహాలు(రక్షితవ్యవసాయం) వాటి కిందపాలీహౌసులు, అధికవిలువైన కూరగాయలు, పూల పెంపకం, మల్చింగ్, దానిమ్మలో పక్షుల నుంచి కాపాడుకొనేందుకు వల, పండ్ల కవర్లు వంటి పథకాలు ఉన్నాయని తెలిపారు. వాతావరణ పరిస్థితులపై నియంత్రణ కలిగి ఉండే పాలీహౌసుల వినియోగంతో ఎక్కువ దిగుబడి సాధించవచ్చని పేర్కొన్నారు. టమోటా, క్యాప్సికమ్, స్ట్రాబెర్రి, పూలు తదితర విలువైన పంటల సాగుకు అనుకూలంగా ఉంటుందని, సూర్య కిరణాల తీవ్రతను తగ్గించడంలో షేడ్ నెట్‌లు దోహదపడుతాయని వివరించారు. రక్షిత సాగు పద్ధతులలో సాగు చేస్తే నియంత్రణ వాతావరణంలో చీడపీడల నివారణతోపాటు అధిక దిగుబడులను సాధించడంతో పాటు మార్కెట్‌లో అధిక ధరలకు విక్రయించవచ్చని తెలిపారు. ఈ పథకాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. వివరాలకు మండల ఉద్యానవన అధికారులు, సచివాలయ సిబ్బందిని సంప్రదించాలని ఆయన కోరారు.

శ్యామల నోట పచ్చి అబద్ధాలు

పొదిలి సమ్మర్ స్టోరేజీ పరిశీలన పేరుతో పర్యటన

పనులు చూడకుండానే ప్రభుత్వంపై విమర్శలు

ఆమె మాటలకు అవాక్కయిన వైసీపీ నాయకులు



మాట్లాడుతున్న వైసీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి శ్యామల

పొదిలి, జూలై 17 (ఆంధ్రజ్యోతి) : వైసీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి శ్యామల గురువారం పొదిలి సమ్మర్ స్టోరేజీ పరిశీలన పేరుతో సాగిన పర్యటన పెద్దడ్రామను తలపించింది. పొదిలి పట్టణ ప్రజల కోసం ప్రతిష్ఠాత్మకంగా ఏర్పాటు చేసిన సమ్మర్‌స్టోరేజీ ట్యాంక్ మట్టి దిబ్బలకే పరిమితం చేశారంటూ చెప్పే ప్రయత్నం చేశారు. వాస్తవంగా సమ్మర్ స్టోరేజీ ట్యాంక్ పనులు అత్యంత వేగంగా జరుగుతున్నాయి. ఆమె చెరువును కానీ జరుగుతున్న పనులను గానీ చూడకుండా శిలాఫలకం వేసిన ప్రాంతాన్ని చూసి డంపుయార్డ్‌లా ఉందని అబద్ధాలు చెప్పారు. ఇప్పటికే పైపులైన్ నిర్మాణ పనులు రెండునెలలకుపైగా శరవేగంగా జరుగుతున్నప్పటికీ అటువైపు చూడకుండా కేవలం చెరువు కట్ట వద్ద ఉన్న మట్టి దిబ్బలను చూపించి ప్రభుత్వంపై బురద జల్లే ప్రయత్నం చేశారు. వైసీపీ పాలనలో ఎన్నికలకు ముందు లబ్ధి కోసం ఆర్థిక అనుమతులు ఇవ్వకుండా పరిపాలనా ఆమోదం ఇచ్చి ప్రజలను మభ్యపెట్టారనే విషయాన్ని విలేకరులు ఆమె దృష్టికి తీసుకెళ్లగా సమాధానం చెప్పలేక నీళ్లు నమిలారు. అంతే కాకుండా జగన్‌రెడ్డి వేసిన శిలాఫలకాన్ని ధ్వంసం చేశారని మరో అబద్ధం ఆడే ప్రయత్నం చేయడంతో వైసీపీ నాయకులు కూడా అవాక్కయ్యారు. ఆమె అంతటితో ఆగకుండా మార్కాపురంలో రూ.1290కోట్లతో ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ శంకుస్థాపన చేసిన పనులు ప్రారంభించలేదని చెప్పడం విడ్డూరమనిపించింది. మొత్తంమ్మీద శ్యామల పర్యటన వైసీపీకి ప్రయోజనం లేకపోగా విమర్శలకు ఆస్కారం కల్పించింది.

కిక్కు తలకెక్కింది.. నడిరోడ్డే పానుపు అయింది



మద్యం ఎక్కువై పట్టపగలు నడిరోడ్డుపై పడుకున్న వ్యక్తి

మార్కాపురం, జూలై 17 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలో ఓ తాగుబోతు గురువారం మధ్యాహ్నం హల్‌చల్ చేశాడు. పూటుగా మద్యం సేవించిన ఆ వ్యక్తి నడి రోడ్డుపైనే సుమారు గంటపాటు పడుకుని వాహనదారులను తీవ్ర ఇబ్బందులకు గురిచేశాడు. మద్యం మత్తు తలకెక్కిన మందుబాబు స్థానిక ఆర్టీసీ బస్టాండ్‌కు సమీపంలోని పెట్రోల్ బంకుకు ఎదురుగా నడిరోడ్డుపై కండువా పరుచుకుని పడుకున్నాడు. దీంతో వాహనదారులు అతన్ని తప్పించేందుకు ఇబ్బందులు పడ్డారు. చుట్టుపక్కల వాళ్లు వెళ్లి మందలిస్తే తిట్ల దండకం అందుకున్నాడు. చివరికి అటుగా వెళ్తున్న ఓ హోంగార్డు చొరవ తీసుకుని తాగుబోతును రోడ్డు పక్కకు తీసుకువచ్చి తలపై నీళ్లు పోసి నీడన కూర్చోబెట్టడంతో వాహనదారులకు ఇబ్బంది తప్పింది.

వీరయ్యచౌదరి హత్య కేసులో ఇరువురికి బెయిల్

ఒంగోలు క్రైం, జూలై17 (ఆంధ్రజ్యోతి): టీడీపీ నేత వీరయ్యచౌదరి హత్య కేసులో నిందితులు వీరగంధం దేవేంద్రనాథ్‌చౌదరి, మారుతి కిరణ్‌కుమార్‌లకు కోర్టు గురువారం బెయిల్ మంజురు చేసింది. నిందితులు ఇప్పటికే 63 రోజులు రిమాండ్‌లో ఉన్నారు. ఇంకా కేసులో ప్రధాన సూత్రధారిగా చెబుతున్న ముప్పా సురేష్ పోలీసులకు కళ్లుగప్పి తిరుగుతున్నాడు.

అధ్యాపకుల పోస్టుల పరీక్షలకు పటిష్ఠమైన భద్రత

ఒంగోలు రూరల్, జూలై17 (ఆంధ్రజ్యోతి) : వివిధ అధ్యాపకుల పోస్టుల భర్తీ కోసం నిర్వహించే పరీక్షలకు పటిష్ఠమైన భద్రత ఏర్పాట్లు చేసినట్లు డీఆర్వో బి.చినఓబులేసు తెలిపారు. గురువారం స్థానిక కలెక్టరేట్‌లోని తన కార్యాలయంలో మాట్లాడుతూ ఈ నెల 15నుంచి 23వ తేదీ వరకు ఉదయం, మధ్యాహ్నం రెండు పూటలా జిల్లావ్యాప్తంగా ఆరు కేంద్రాల్లో ఆన్‌లైన్ విధానంలో పరీక్షలు జరుగుతున్నాయని చెప్పారు. గురువారం ఒంగోలులోని నేషనల్‌కౌన్సిల్ ఫర్ ది చర్చ్ సోషల్ యాక్షన్ ఇండియా కాలేజీలో మాత్రమే పరీక్షలు జరిగినట్లు తెలిపారు. ఉదయం పరీక్షకు 49కి 29 మంది, మధ్యాహ్నం పరీక్షకు 77 మందికి గాను 35మంది హాజరయ్యారని ఆయన పేర్కొన్నారు.

దిబ్బలరోడ్డులో భారీ చోరీ

● 225గ్రాముల బంగారం, రూ.1.80 లక్షల నగదు అపహరణ

ఒంగోలు క్రైం, జూలై 17(ఆంధ్రజ్యోతి) : స్థానిక దిబ్బలరోడ్డులోని పిండిమర సమీపంలో దగ్గుబాటి వెంకటసుబ్బారావు ఇంట్లో భారీ చోరీ జరిగింది. సుమారు రూ.25లక్షల విలువైన బంగారు సొత్తును దొంగలు అపహరిచుకెళ్లారు. వెంకటసుబ్బయ్య ప్రస్తుతం వీగ్రాండ్ రెస్టారెంట్‌లో పనిచేస్తున్నారు. ఈనెల 12న తన కుటుంబసభ్యులతో కలసి స్వగ్రామం పోరుమామిళ్ల వెళ్లారు. గురువారం ఉదయం వారు ఇంటికి బయిలుదేరారు. అదేసమయంలో ఇంటి పక్కన ఉన్న వారు తలుపులు తెరిచి ఉన్నాయని ఫోన్ ద్వారా వెంకటసుబ్బయ్యకు తెలిపారు. దీంతో వారు గురువారం మధ్యాహం వచ్చి చూసే సరికి ఇంటి తాళం పెకిలించి ఉంది. బీరువా తాళం పగలగొట్టి సుమారు 225 గ్రాములు బంగారం ఆభరణాలు, రూ.1.85 లక్షలు నగదును దుండగులు చోరీ చేశారు. దీంతో బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశారు. సంఘటన స్థలాన్ని తాలుకా సీఐ విజయకృష్ణ, తన సిబ్బందితో పరిశీలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రాజీవ్‌నగర్‌లో దొంగలు హల్‌చల్



చిందరవందరగా పడేసిన దుస్తులు

నాలుగు ఇళ్లలో చోరీలు
రూ.8 లక్షలు విలువైన సొత్తు అపహరణ
ఘటనా స్థలాన్ని పరిశీలించిన ఒంగోలు డీఎస్పీ

ఒంగోలు క్రైం, జూలై 17(ఆంధ్రజ్యోతి) : తాళం వేసి ఉన్న ఇళ్లే లక్ష్యంగా దొంగలు హల్‌చల్ చేశారు. బుధవారం రాత్రి ఒంగోలు నగరంలోని రాజీవ్‌నగర్‌లో నాలుగు ఇళ్లలో దొంగలు చోరీలకు పాల్పడి సుమారు రూ.8 లక్షలు విలువైన సొత్తును అపహరించుకెళ్లారు. ఒకే ప్రాంతంలో నాలుగు ఇళ్ల తాళాలు పగులు కొట్టి సొత్తు చోరీ చేయడం గమనార్హం. ఈ చోరీలకు పాల్పడింది ఒకే ముఠానా లేకా వేరువేరుగా ఉన్నారా అనేది సీసీ ఫుటేజీలను పోలీసులు పరిశీలిస్తున్నారు.



దొంగలు పగులగొట్టిన గడి

వరుస దొంగతనాలు

• స్థానిక రాజీవ్‌నగర్ బ్రాహ్మణ వృద్ధాశ్రమానికి సంబంధించిన గదులలో అద్దెకు విప్పర్ల రాజ్యం కుటుంబం ఉంటోంది. బుధవారంరాత్రి పడుకునే సమయంలో ఇంటికి తాళం వేసి బిల్డింగ్ పైన పడుకున్నారు. గురువారం ఉదయం 4.30 నిద్ర లేచిచూడగా ఇంటి తాళం పగులకొట్టి ఉంది. బీరువా తలుపు పెకిలించి ఉంది. దీంతో పోలీసులకు సమాచారమిచ్చారు. బీరువాలో ఉన్న రూ.50 వేల నగదు, రెండున్నర సవర బంగారం ఆభరణాలు, 100 గ్రాముల వెండి అపహరించుకెళ్లారు. సుమారు రూ.2.5 లక్షల విలువైన సొత్తు అపహరించుకెళ్లారు.

• రాజీవ్‌నగర్ ప్రాంతంలో మోదేపల్లి శ్రీనివాసులు ఇంటికి తాళం వేసి ఊరు వెళ్లారు. గురువారం ఉదయం చూసే సరికి ఇంట్లో దొంగలు తాళం పగుల కొట్టి చొరబడి రూ.20 వేలు నగదు, రెండున్నర సవర్ల బంగారు ఆభరణాలు, మూడుకిలోల వెండి సామగ్రి అపహరించుకెళ్లారు. సుమారు రూ 3.5 లక్షల విలువైన సొత్తును చోరీ చేశారు.

• రాజీవ్ నగర్‌లోని అచ్చుకాల శంకర్రావు ఇంటి తలుపు వేసి ఊరు వెళ్లారు. వారు వచ్చే సరికి ఇంటి తలుపు పెకిలించి రూ.70 వేలు నగదు ఎత్తుకెళ్లారు.

• పచ్చవ వరలక్ష్మీ ఇంటి తాళం పగలు కొట్టి దొంగలు ప్రవేశించి సీసీ కెమెరాలకు సంబంధించిన డీవీఆర్ బాక్స్‌ను అపహరించుకెళ్లారు.

నాలుగుఇళ్లలో సుమారు రూ.8 లక్షలు సొత్తు అపహరణకు గురైనట్లు పోలీసులు అంచనాకు వచ్చారు. ఈ మేరకు ఒంగోలు డీఎస్పీ ఆర్.శ్రీనివాసరావు, తాలూకా సీఐ విజయకృష్ణ, సిబ్బంది సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. కేసులు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని డీఎస్పీ చెప్పారు.



బాధితులతో మాట్లాడుతున్న డీఎస్పీ శ్రీనివాసరావు

ఒనకూరడంలేదు...!

పెరిగిన కూరగాయల ధరలు
కొన్ని రకాలకు కిలోకు రూ.20 పెరుగుదల
బీన్స్ ధర సెంచరీ దాటింది
గణనీయంగా తగ్గిన ఉత్పత్తి
మరికొద్ది రోజులు ఇదే విధంగా కొనసాగనున్న ధరలు



మార్కెట్‌లో కూరగాయలు

ఒంగోలు కలెక్టరేట్, జూలై 17 (ఆంధ్రజ్యోతి) : జిల్లా ప్రజానీకానికి కూరగాయల ధరలు చుక్కలు చూపిస్తున్నాయి. వేసవిలో పెరగాల్సిన కూరగాయాలు ధరలు ఇప్పుడు రోజురోజుకు పెరిగిపోతుండటంతో సామాన్యుడు కొనుగోలు చేయాలంటేనే భయపడాల్సిన పరిస్థితి ఏర్పడింది. వారం రోజుల వ్యవధిలోనే కిలోకు రూ.15నుంచి 20 రూపాయల వరకు కొన్ని రకాలకు పెరగ్గా, మరికొన్ని కూరగాయల ధరలు రూ.25నుంచి రూ.30 వరకు పెరిగాయి. ఇక బీన్స్ కిలో రూ.120కి చేరింది. సాధారణంగా ప్రస్తుతం కూరగాయల సీజన్ ప్రారంభంకావాల్సి ఉండగా ఎండల తీవ్రత, తదితర కారణాలతో కూరగాయల ఉత్పత్తి గణనీయంగా పడిపోయింది. వినియోగానికి అనుగుణంగా ఉత్పత్తి రాకపోవడం, ఇతర ప్రాంతాల నుంచి దిగుమతి చేసుకోవాల్సి రావడంతో రవాణా చార్జీలుపెరగడం వంటి కారణాలతో ధరలు పెరిగిపోయాయి. నాలుగు రోజుల వ్యవధిలో టమోటా కిలోకు రూ.10 పెరిగింది. వారం క్రితం కిలో టమోటా రూ.30 ఉండగా ప్రస్తుతం 40కి చేరింది. ఇక బీన్స్ గత వారం కిలో రూ.80నుంచి రూ.90 మధ్య ఉండగా ఇప్పుడు రూ.120కి చేరింది. ఇలా అన్ని రకాల కూరగాయాలధరలు పెరిగిపోయాయి.

● మార్టూరు, కొత్తపట్నం నుంచి తగ్గుముఖం

మార్టూరు, కొత్తపట్నం ప్రాంతాల నుంచి మార్కెట్‌కు పలు రకాల కూరగాయాలు వస్తాయి. ఆ రెండు ప్రాంతాల్లో కూరగాయాల ఉత్పత్తి పడిపోయింది. మరో వైపు పశ్చిమ ప్రాంతంలో ప్రస్తుత సమయంలో టమోటాలు రావాల్సి ఉన్నా రాని పరిస్థితి ఏర్పడింది. దీంతో పలు రకాల కూరగాయలను చెన్నై, పలమనేరు, మదనపల్లి తదితర ప్రాంతాల నుంచి ఒంగోలుకు దిగుమతి చేసుకుంటున్నారు. ఈ కారణంగానే ధరలు పెరిగాయని వ్యాపారులు చెప్తున్నారు.

● తక్కువ మొత్తం కొనుగోలుకు ఇబ్బందులు

కుటుంబంలో ఒకరిద్దరు ఉంటే ఏ రోజుకారోజు కూరగాయలను కొనుగోలు చేస్తుంటారు. అటువంటి వారు ఇప్పుడు ఆ ధరలను చూసి భయపడాల్సిన పరిస్థితి ఏర్పడింది. మరో వైపు తోపుడు బండ్ల ద్వారా ఇంటింటికీ తిరిగి కూరగాయాలు విక్రయించే చిరు వ్యాపారుల వద్ద కొనుగోలు చేయాలంటే ప్రజలు ఓమ్మో అనాల్సిన పరిస్థితి ఏర్పడింది. కూరగాయల ధరలు ఇలా ఉండగా ఇప్పుడు ఆకుకూరల ధరలు కూడా చుక్కులు చూపిస్తున్నారు. ప్రస్తుతం మార్కెట్లో కూరగాయల ధరలు ఇలా ఉన్నాయి.

కూరగాయల రకం	ధరలు
బీన్స్	120.00
బీట్‌రూట్	60.00
క్యారేట్	66.00
టమోటాలు	40.00
పచ్చిమిర్చి	70.00
వంకాయలు	50.00
వంకాయలు(మోటుమాల)	55.00
బీర	50.00
దొండ	30.00
చామదుంప	50.00
పెద్దచిక్కుళ్ళు	80.00
చిన్నచిక్కుళ్ళు	50.00
దోస	25.00
బంగాళదుంప	40.00
కాకర	60.00
బెండ	40.00
దొండకాయలు	30.00

ఎంపీహెచ్‌ఈవో శ్రీనివాసరావు బదిలీ ఉత్తర్వులు సస్పెండ్

ఒంగోలు కలెక్టరేట్, జూలై 17 (ఆంధ్రజ్యోతి) : జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి కార్యాలయంలో మల్టీపర్పస్ హెల్త్ ఎక్స్‌టెన్షన్ అధికారి(ఏపీహెచ్‌ఈవో)గా పనిచే స్తున్న డీవీ శ్రీనివాసరావును బాపట్ల డీఎంహెచ్‌వో కార్యాలయానికి బదిలీ చేస్తూ గుంటూరు రీజనల్ డైరెక్టర్ ఆఫ్ మెడికల్ అండ్ హెల్త్ సర్వీసెస్ జారీ చేసిన ఉత్తర్వులను హైకోర్టు సస్పెండ్ చేసింది. ఎంపీహెచ్‌ఈవో శ్రీనివాసరావును ఇటీవల జరిగిన బదిలీల్లో బాపట్లకు బదిలీ చేస్తూ గుంటూరు వైద్య ఆరోగ్య సేవల ప్రాంతీయ డైరెక్టర్ బదిలీ చేసి అక్కడ పనిచేస్తున్న రవిరాజ్‌ను ఒంగోలుకు బదిలీ చేశారు. ఈ మేరకు జూన్ 21న ఉత్తర్వులు జారీ అయ్యాయి. తన బదిలీ ఉత్తర్వులను సవాల్ చేస్తూ శ్రీనివాసరావు హైకోర్టును ఆశ్రయించారు. తాను ప్రభుత్వ ఉద్యోగుల సంఘం జిల్లా అసోసియేట్ అధ్యక్షుడిగా ఎన్నికయ్యాయని కోర్టు దృష్టికి తీసుకెళ్లారు. ప్రభుత్వం జారీ చేసిన బదిలీ ఉత్తర్వుల్లో ఉద్యోగసంఘాల ఆఫీస్ బేరర్లకు బదిలీ నుంచి మినహాయింపు ఇవ్వాలని స్పష్టంగా పేర్కొన్నప్పటికీ తనను అక్రమంగా బదిలీ చేశారని శ్రీనివాసరావు హైకోర్టును ఆశ్రయించారు. తన బదిలీ ప్రభుత్వ ఉత్తర్వులకు భిన్నంగా జరిగినందున రద్దు చేసి న్యాయం చేయాలని న్యాయస్థానాన్ని శ్రీనివాసరావు వేడుకున్నారు. ఈ అంశంలో సాక్ష్యాధారాలను పరిశీలించిన న్యాయస్థానం శ్రీనివాసరావు ఆఫీసు బేరర్‌గా ఎన్నికైనందున బదిలీ మినహాయింపునకు అర్హుడేనని గుర్తించి బదిలీ ఉత్తర్వులను హైకోర్టు సస్పెండ్ చేసింది.

గుర్తుతెలియని లారీ ఢీకొని గర్భిణి మృతి



మృతదేహాన్ని పరిశీలిస్తున్న ఎస్సై మహేంద్ర

సింగరాయకొండ, జూలై 17 (ఆంధ్రజ్యోతి) : గుర్తుతెలియని లారీ ఢీకొని గర్భిణి అక్కడికక్కడే మృతిచెందింది. ఈ ఘటన హైవేపై బీకేటీ ఫ్యాక్టరీ ఎదురుగా గురువారం రాత్రి చోటుచేసుకుంది. పోలీసుల వివరాలు మేరకు.. అస్సాం రాష్ట్రానికి చెందిన వర్ష బీకేటీ ఫ్యాక్టరీలో పనిచేస్తోంది. టంగుటూరుకు చెందిన నాగరాజు అనే వ్యక్తిని ప్రేమించి రెండో వివాహం చేసుకొని టంగుటూరులో నివాసం ఉంటుంది. ప్రస్తుతం వర్ష ఐదు నెలల గర్భిణి. టంగుటూరు నుంచి ఫ్యాక్టరీకి వెళ్లడానికి రోడ్డు దాటుతుండగా గురువారం రాత్రి గుర్తుతెలియని లారీ వర్షను ఢీకొట్టింది. ఆమె అక్కడికక్కడే మృతిచెందింది. ఎస్సై బి.మహేంద్ర ఘటనా స్థలానికి చేరుకుని ప్రమాదం తీరును పరిశీలించారు. మృతదేహాన్ని ఒంగోలు రిమ్స్‌కు తరలించారు. జరిగిన ప్రమాదంపై కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై మహేంద్ర తెలిపారు.

పసివాడి ప్రాణం తీసిందెవరు?

బాలుడి మృతదేహం వెలుగు చూసి వారం గడిచినా నేటికీ దొరకని ఆచూకీ
కారకులను పట్టుకొని శిక్షించాలని కోరుతున్న ప్రజలు
దుండగులను గుర్తించడం పోలీసుల వంతు



లక్షిత్ (ఫైల్)

కంభం, జూలై 17 (ఆంధ్రజ్యోతి) : పాపం లక్షిత్.. బుడిబుడి అడుగులతో వచ్చీరానీ మాటలతో సందడి చేసే రెండున్నర సంవత్సరాల లక్షిత్‌ను అన్యాయంగా పొట్టన పెట్టుకున్న దుండగులు ఎవరనేది ఇంకా గుర్తించలేదు. ఈ నెల 8వ తేదీన లింగోజీపల్లి అంగన్‌వాడీ స్కూల్ నుంచి బయటకు వెళ్లిన లక్షిత్ ఆ తర్వాత అదృశ్యమవడం, రెండు రోజులైనా బాలుడు ఆచూకీ లభించకపోవడంతో కిడ్నాప్‌కు గురై ఉంటాడని అందరూ భావించారు. అయితే 3వ రోజు అంటే గురువారం ఉదయం లక్షిత్ మృతదేహం సూరేపల్లి సమీపంలోని పొలంలో లభించడం జిల్లా వ్యాప్తంగా సంచలనం కలిగించింది. ఈ నేపథ్యంలో బాలుడిది కిడ్నాప్ కాదని, దారితప్పి 3 రోజులు నీరు, ఆహారం లేక గొంతు ఎండి మరణించాడని ప్రచారం జరగడం, దీనిపై లక్షిత్ కుటుంబసభ్యులు, గ్రామస్థు లందరూ పోలీసు స్టేషన్ ముందు ధర్నా చేయడం తెలిసిందే. లక్షిత్‌ను కిడ్నాప్ చేసి నిందితులు బయటపడకుండా తెలివిగా గొంతు ఎండి మరణించాడని కథలు అల్లిన వారు ఎవరు, లక్షిత్ మరణానికి కారణమైన వారిని శిక్షించాలని డిమాండ్ చేశారు. లక్షిత్ కనిపించకుండా పోయిన రోజు నుంచి అనుమానాస్పద స్థితిలో శవమై కనిపించడం, ఆ తరువాత నిందితులను రక్షించేందుకు కొన్ని రాజకీయ శక్తులు శాయిశక్తులా ప్రయత్నించి కొంత మేర అనుకున్నది సాధించినట్లు తెలుస్తుంది. ఆ శక్తులు పోలీసులను, కుటుంబ సభ్యులను కూడా ప్రభావితం చేయడంతో కేసు పక్కదారి పట్టిందనే విమర్శలు వస్తున్నాయి. ముక్కుపచ్చలారని అన్నెంపుణ్యం ఎరుగని చిన్నారిని ఏ ప్రతిఫలం ఆశించి కిడ్నాప్ చేశారు, ఎందుకు అంతమొందించారన్నదే అంతుచిక్కని ప్రశ్నగా మారింది. బాలుడు అంగన్‌వాడీ సెంటర్ నుంచి తప్పిపోవడానికి ప్రధాన కారకులైన అంగన్‌వాడీ టీచర్, ఆయాను కలెక్టర్ సస్పెండ్ చేయడంపై బాధిత కుటుంబసభ్యులు కలెక్టర్‌కు కృతజ్ఞతలు చెప్పారు. లక్షిత్ మరణానికి కారకులైన వారిని పట్టుకుని శిక్షించే బాధ్యత పోలీసుల దేనని, తమకు వారిపై నమ్మకం ఉందని వారు అంటున్నారు.

బాబాయి, పిన్నిలపై అబ్బాయి దాడి

ఆస్తి వివాదాలే హత్యాయత్నానికి కారణం
ఇద్దరి పరిస్థితి విషమం



గాయపడ్డ రమణారెడ్డి



గాయపడ్డ సుబ్బమ్మ

గిద్దలూరు టౌన్, జూలై 17 (ఆంధ్రజ్యోతి) : ఆస్తి తగాదాలతో బాబాయి, పిన్నిపై స్వయాన అన్న కుమారుడు ఇనుపరాడ్‌తో దాడి చేసి తీవ్రంగా గాయపరిచాడు. గాయపడిన భార్యాభర్తల పరిస్థితి విషమంగా ఉంది. పోలీసుల కథనం ప్రకారం.. గిద్దలూరు మండలం పొదలకొండపల్లె గ్రామానికి చెందిన శనివారపు రమణారెడ్డి వ్యవసాయం చేసుకుంటూ జీవిస్తున్నారు. రమణారెడ్డి, శివారెడ్డి అన్నదమ్ములు. ఇద్దరి మధ్య పొలంలో వేసిన వ్యవసాయ బోరు, భూమి భాగపంపకాలపై కొంతకాలంగా గొడవలు జరుగుతున్నాయి. పలు సందర్భాలలో పెద్దమనుషుల సమక్షంలో పంచాయితీ జరగ్గా భూమి, బోరు వ్యవహారం కొలిక్కిరాలేదు. అన్న శివారెడ్డి కుమారుడైన నిరంజన్‌రెడ్డి బాబాయ్ రమణారెడ్డిపై ద్వేషం పెంచుకుని బుధవారం రాత్రి రమణారెడ్డి, భార్య వెంకటసుబ్బమ్మ ఇంట్లో నిద్రిస్తుండగా వెళ్లి గొడవ చేశాడు. అక్కడితో ఆగకుండా ఇనుప రాడ్‌తో బాబాయి, పిన్నిపై దాడి చేశారు. ఇద్దరూ తీవ్రంగా గాయపడ్డారు. ఇరుగుపొరుగు వారు జోక్యం చేసుకుని గాయపడిన ఇద్దరినీ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ప్రాథమిక చికిత్స అనంతరం ఇద్దరినీ నంద్యాలకు తరలించారు. తన తల్లిదండ్రులపై దాడి చేసిన నిరంజన్‌రెడ్డి, తిరుపతిరెడ్డి ప్రేరణతోనే దాడి చేసినట్లు రమణారెడ్డి కొడుకు సాయికుమార్‌రెడ్డి ఫిర్యాదు చేసినట్లు అర్బన్ సీఐ కె.సురేష్ తెలిపారు. కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

సమస్య ఏదైనా సరే.. ధైర్యంగా చెప్పండి

ఎమ్మెల్యే దామచర్ల
ప్రజల సమస్యల పరిష్కారం కోసం 'ప్రజా వాణి' బాక్సుల ఏర్పాటు
నగరంలో ప్రారంభించిన జనార్దన్



ప్రజావాణి డబ్బాను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే జనార్దన్

ఒంగోలు, కార్పొరేషన్, జూలై 17 (ఆంధ్రజ్యోతి) : ప్రజల సమస్యలకు సత్వర పరిష్కారం కోసం రాష్ట్రంలో ఎక్కడా లేని విధంగా మొట్టమొదటిసారి ఒంగోలులో 'ప్రజావాణి' బాక్సులు ఏర్పాటు చేయడం సంతోషంగా ఉందని శాసనసభ్యులు దామచర్ల జనార్దన్ తెలిపారు. ఎమ్మెల్యే ఆధ్వర్యంలో వినూత్నంగా చేపట్టిన కార్యక్రమాన్ని గురువారం నగర పరిధిలోని కొత్తపట్నం బస్టాండ్‌లో ఏర్పాటు చేసిన ఫిర్యాదుల బాక్సును ఆయన ప్రారంభించి, మీడియాతో మాట్లాడారు. పరిపాలనా పరంగా వివిధ కార్యక్రమాల్లో బిజీగా ఉన్నందున ప్రజలు తనను నేరుగా కలవలేని పరిస్థితి కనిపిస్తుందన్నారు. ఈ సమస్య పరిష్కారం కోసం ప్రజల నుంచి వచ్చే ప్రతి సమస్యను తెలుసుకుని నేరుగా పరిష్కరించేందుకు వినూత్నంగా ఈ విధానం అమలులోకి తీసుకొచ్చామని చెప్పారు. తొలుత వీటిని అద్దంకి బస్టాండ్, రంగారాయుడు చెరువు, కొత్తపట్నం బస్టాండ్ సెంటర్‌లో ఏర్పాటు చేశామని, త్వరలోనే మరికొన్ని ప్రాంతాల్లో జనం రద్దీగా ఉండే ప్రాంతాల్లో ఏర్పాటు చేస్తామని తెలిపారు. ప్రజలు తనను నేరుగా కవలేకపోయామనే నిరాశ వద్దన్నారు. సమస్య ఏదైనా కాగితంపై రాసి, పూర్తి వివరాలతో తెలియజేయాలని చెప్పారు. ప్రతి శుక్రవారం బాక్సులను ఓపెన్ చేసి, ఆ అర్జీలను పరిశీలించడంతోపాటు అర్జీదారుడుకు సెల్‌కు మెసేజ్ పంపడం, 48 గంటల్లో పరిష్కారం చేస్తామని తెలిపారు. తాగునీరు, పారిశుధ్యం, రోడ్లు, ఆక్రమణలు, పట్టాలు, రేషన్ కార్డులు, ఇతరత్రా సమస్యలు తెలియజేయవచ్చన్నారు. గత వైసీపీ ప్రభుత్వం హయాంలో భూ కబ్జాల సమస్యలు కూడా తెలియజేయవచ్చని చెప్పారు. అర్జీదారుల పూర్తి వివరాలను గోప్యంగా ఉంచుతామని దామచర్ల తెలిపారు. కార్యక్రమంలో నగర పార్టీ అధ్యక్షులు బండారు మదన్, మాజీ అధ్యక్షులు కొఠారి నాగేశ్వరరావు, మైనార్టీ కార్పొరేషన్ రాష్ట్ర మాజీ డైరెక్టర్ కపిల్ బాషా, కార్పొరేటర్లు దాచర్ల వెంకటరమణయ్య, అంబూరి శ్రీనివాసరావు, సంగ్రపాటి వర్ధ్వర్ధ్, శాండిల్య, 12వ డివిజన్ అధ్యక్షులు గంగవరపు సందీప్, శశికాంత్ భూషణ్ పాల్గొన్నారు.

గోవా మద్యం పట్టివేత

● ముగ్గురు అరెస్ట్
● 144 క్వార్టర్ బాటిళ్లు స్వాధీనం
● రూ. 2.13 లక్షల విలువ చేసే మద్యం, రెండు బైక్‌లు సీజ్



పట్టుబడిన మద్యం బాటిళ్లు, నిందితులను చూపుతున్న ఎక్సైజ్ సీఐ శివకుమారి

సింగరాయకొండ, జూలై 17 (ఆంధ్రజ్యోతి) : అక్రమంగా గోవా నుంచి మద్యం దిగుమతి చేసుకొని అమ్మకాలు చేస్తున్న ముగ్గురు వ్యక్తులను ఎక్సైజ్ సీఐ మేడికొండ శివకుమారి వారి సిబ్బందితో కలిసి అరెస్ట్ చేశారు. నిందితుల నుంచి రూ.2.13 లక్షలు విలువ చేసే 144 క్వార్టర్ బాటిళ్లను, రెండు మోటార్ బైక్‌లను సీజ్ చేశారు. గురువారం ఎక్సైజ్ కార్యాలయంలో సీఐ శివకుమారి తెలిపిన వివరాలు మేరకు.. చినగంజాం మండలం కొడూరిపాలెం గ్రామానికి చెందిన ప్రళయకావేరి జయంతిబాబు, నెల్లూరు జిల్లా విడవలూరుకి చెందిన జాన నాగార్జున, సింగరాయకొండ మండలం ఊళ్లపాలేనికి చెందిన అరవ పవన్ గతంలో అక్రమంగా మద్యం అమ్మకాలు చేస్తూ జైలు జీవితాన్ని గడిపారు. అక్కడ ముగ్గురికి పరిచయం ఏర్పడింది. ప్రళయకావేరి జయంతిబాబు గోవా నుంచి అక్రమంగా మద్యం దిగుమతి చేసుకొని కొంత లాభం చూసుకొని విడవలూరికి చెందిన నాగార్జున్‌కు అమ్మకాలు చేసేవారు. ఆ మద్యాన్ని నాగార్జున ఊళ్లపాలేనికి చెందిన అరవ పవన్‌కు సరఫరా చేస్తున్నారు. ఎక్సైజ్ సీఐ శివకుమారికి అందిన సమాచారం మేరకు గురువారం పాకల పంచాయతీ పోతయ్యగారి పట్టపుపాలెంలో తనిఖీలు నిర్వహించారు. ఈ క్రమంలో బకింగ్‌హాం కెనాల్ వద్ద జయంతిబాబు, నాగార్జున్ మద్యం బాటిళ్లను అరవ పవన్‌కు అందజేస్తుండగా ఎక్సైజ్ సీఐ శివకుమారి ముగ్గురిని అదుపులోకి తీసుకొని అరెస్ట్‌చేశారు. నిందితుల నుంచి 144 క్వార్టర్ బాటిళ్లను, రెండు బైక్‌లను సీజ్ చేశారు. సీజ్ చేసిన క్వార్టర్ కేరళ మాల్ట్ మద్యాన్ని పరిశీలిస్తే దిమ్మతిరిగే విషయం వెలుగులోకి వచ్చింది. తక్కువ ధరకు గోవా నుంచి చీప్ మద్యాన్ని దిగుమతి చేసుకొని ఆ బాటిళ్లపై నకిలీ లేబుళ్లవేసి అమ్మకాలు చేస్తున్నట్లు ఎక్సైజ్ సీఐ శివకుమారి గుర్తించారు. నిందితులు ముగ్గురిని కోర్టులో హాజరు పరచగా రిమాండ్ విధించింది. గోవా మద్యం సరఫరా చేస్తున్న ముఠాను చాకచక్యంగా పట్టుకున్న ఎక్సైజ్ సీఐ శివకుమారి వారి సిబ్బందిని ఉన్నతాధికారులు అభినందించారు.

పేదరికం నిర్మూలనపై దృష్టి సారించాలి

● రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి విజయానంద్

ఒంగోలు కలెక్టరేట్, జూలై 17 (ఆంధ్రజ్యోతి): పేదరిక నిర్మూలనే లక్ష్యంగా ప్రభుత్వం చేపట్టిన పి4 కార్యక్రమం అమలుపై ప్రత్యేక దృష్టి సారించాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్ ఆదేశించారు. గురువారం జిల్లా కలెక్టర్లతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో ఆయన మాట్లాడుతూ పేదరిక నిర్మూలనే లక్ష్యంగా ప్రభుత్వం పి4 పథకాన్ని అమలు చేస్తుందన్నారు. దీనిని పూర్తిస్థాయిలో అమలు జరిగేలా తగిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అర్హులైన పేద కుటుంబాలను గుర్తించడంతో పాటు వారిని దత్తత తీసుకునేందుకు మార్గదర్శకులను గుర్తించి ప్రోత్సహించాలన్నారు. ప్రతి నియోజకవర్గంలో ఎంఎస్ఎంఈ పార్కుల ఏర్పాటుకు అవసరమైన భూములను గుర్తించాలన్నారు. రిజిస్ట్రేషన్, ఆర్టీసీ, పంచాయతీరాజ్, పౌరసరఫరాల శాఖల ద్వారా అమలు చేస్తున్న సేవలపై ప్రజల సంతృప్తి స్థాయిని పెంచేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో కలెక్టర్ తమీమ్ అన్సారియా, జేసీ గోపాలకృష్ణ, పలు శాఖల అధికారుల చిరంజీవి, వెంకటేశ్వరరావు, వెంకట నాయుడు, శ్రీనివాసరావు, పద్మశ్రీ, వరలక్ష్మి, లక్ష్మానాయక్, బాలశంకరరావు తదితరులు పాల్గొన్నారు.

బంగారుబాల్యం కేంద్రానికి కంప్యూటర్లు అందజేత


కంప్యూటర్, ప్రింటర్లను కలెక్టర్ అన్సారియా చేతుల మీదుగా అందజేస్తున్న అధికారులు

ఒంగోలు కలెక్టరేట్, జూలై 17 (ఆంధ్రజ్యోతి): స్థానిక కలెక్టరేట్‌లోని బంగారు బాల్యం జిల్లా వనరుల కేంద్రానికి ఒంగోలు మైన్స్ అండ్ జియా లాజీ శాఖ ఆధ్వర్యంలో నాలుగు కంప్యూటర్లు, ప్రింటర్లు, స్కానర్‌ను కలెక్టర్ తమీమ్ అన్సారియా చేతుల మీదుగా అందజేశారు. స్థానిక కలెక్టరేట్‌లోని బంగారు బాల్యం జిల్లావనరుల కేంద్రంలో గురువారం ఈ కంప్యూటర్లను నోడల్‌అధికారి గిరిధరశర్మకు అందించారు. కార్యక్రమంలో జియాలజీశాఖ డిప్యూటీ డైరెక్టర్ రాజశేఖర్, డీఆర్పీ సభ్యులు పాల్గొన్నారు.

విద్యుత్ సమస్యలకు సత్వర పరిష్కారం

● ఫోరం అధ్యక్షుడు విక్టర్ ఇమ్మానియేల్


సమస్యలు తెలుసుకుంటున్న విక్టర్ ఇమ్మానియేల్

ఒంగోలు క్రైం, జూలై 17(ఆంధ్రజ్యోతి): కరెంటుకు సంబంధించిన సమస్యలకు సత్వరమే పరిష్కారం చూపేలా చర్యలు తీసుకుంటామని విద్యుత్ వినియోగదారుల ఫోరం అధ్యక్షుడు ఎన్.విక్టర్‌ఇమ్మానియేల్ పేర్కొన్నారు. గురువారం ఒంగోలులోని విద్యుత్‌భవన్‌లో విద్యుత్ అదాలత్ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఫోరం అధ్యక్షుడు విక్టర్ ఇమ్మానియేల్, ఎస్ఈ కట్టా వెంకటేశ్వర్లు ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు. ఒంగోలు సబ్‌డివిజన్ పరిధిలో గల విద్యుత్ వినియోగదారులు 18 మంది ఫిర్యాదులు అందజేశారు. ఆయా సమస్యలను వెంటనే పరిష్కరించారు. అదేవిధంగా విజయవాడలోని తమ కార్యాలయంలో గాని, ఆన్‌లైన్‌లో అయిన తమకు నేరుగా ఫిర్యాదులు చేయవచ్చని విక్టర్‌ఇమ్మానియేల్ తెలిపారు, కార్యక్రమంలో ఈఈ హరిబాబు, డీఈలు పాండురంగారావు, శ్రీకాంత్, మోహన్‌రావు, సిబ్బంది పాల్గొన్నారు.

ఆకట్టుకున్న విద్యార్థుల ప్రదర్శన


నృత్య ప్రదర్శన చేస్తున్న విద్యార్థినులు

ఒంగోలు కలెక్టరేట్, జూలై 17 (ఆంధ్రజ్యోతి) : ఒంగోలు నగర పాలక సంస్థ పరిధిలోని సాయిబాబా సెంట్రల్ స్కూలులో గురువారం రైతులకు కృతజ్ఞతాభావం అనే అంశంపై చేపట్టిన విద్యార్థుల ప్రదర్శన విశేషంగా ఆకట్టుకుంది. రైతుల అకుంఠిత సేవలు, వారి కష్టాలను ప్రతిబింబించేలా విద్యార్థులు నాటిక, నృత్యాలను ప్రదర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థులను యాజమాన్యం, అధ్యాపకులు అభినందించారు.

ఎమ్మెల్యే బీఎన్‌కు సత్కారం


ఎమ్మెల్యే విజయ్‌కుమార్‌ను సత్కరిస్తున్న జనసేన నాయకులు

నాగులుప్పలపాడు, జూలై 17 (ఆంధ్రజ్యోతి): మద్దిపాడు వ్యవసాయ మార్కెట్ కమిటీ డైరెక్టర్‌గా ఎన్నికైన జనసేన పార్టీ నాయకుడు కొంజేటి ధనుష్ గురువారం ఒంగోలులో ఎమ్మెల్యే బీఎన్.విజయ్‌కుమార్‌ను మర్యాదపూర్వకరంగా కలిశారు. తనకు పదవికి ఎన్నిక చేయడంపై ఎమ్మెల్యేకు ఆయన ధన్యవాదాలు తెలిపి బొకే అందజేసి శాలువా కప్పి ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో జనసేన పార్టీ నియోజకవర్గ సమన్వయకర్త కందుకూరి బాబు, మద్దిపాడు మండల అధ్యక్షుడు సున్నా బాలసుబ్రమణ్యం, చదలవాడ ఎంపీటీసీ పమిడిముక్కల శివకృష్ణ, పల్లపోతు సాయిచరణ్, కేశినేని నాగరాజు, గంగిశెట్టి నాగేశ్వరరావు, కొండపి బ్రహ్మం తదితరులు పాల్గొన్నారు.

పారిశుధ్య పనులకు ప్రాధాన్యత ఇవ్వాలి

● డీపీవో వెంకటనాయుడు

ఒంగోలు(రూరల్), జూలై17(ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో పారిశుధ్య పనులకు ప్రాధాన్యత ఇవ్వాలని డీపీవో వెంకటనాయుడు ఆదేశించారు. గురువారం ఒంగోలులోని ఎంపీడీవో జిల్లాలోని ఎంపీడీవోలు, డిప్యూటీ ఎంపీడీవోలతో ఆయన ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డీపీవో మాట్లాడుతూ గ్రామాల్లో ప్రతిరోజు గృహాల నుంచి వచ్చే వ్యర్థాలను సాలీడ్ వేస్ట్ మేనేజ్ మెంట్ కేంద్రాలకు తరలించాలన్నారు. రోడ్లపై చెత్తా చెదారం లేకుండా చూడాలని సూచించారు. దోమలు నివారణకు, సీజనల్ వ్యాధుల ప్రబలకుండా తగిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. పంచా యతీ కార్యదర్శులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే వారిపై క్రమశిక్షణ చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో జడీప సీఈవో చిరంజీవి, డీఎల్‌డీవో శ్రీనివాసరెడ్డి, డీఎల్‌పీవో పద్మ, ఎంపీడీవో రాజశేఖరరావు, డిప్యూటీ ఎంపీడీవో బాలచెన్నయ్య తదితరులు పాల్గొన్నారు.

కారంచేడు మృతవీరులకు నివాళి

ఒంగోలు కలెక్టరేట్, జూలై 17 (ఆంధ్రజ్యోతి): ఒంగోలులోని కేవీపీఎస్ సంఘం కార్యాలయంలో కారంచేడు మృతవీరుల సంస్మరణ సభను గురువారం నిర్వహించారు. రాష్ట్ర కమిటీ సభ్యుడు అట్లూరి రాఘవులు అధ్యక్షతన జరిగిన సభలో జిల్లా ప్రధానకార్యదర్శి బి.రఘురాం మాట్లాడుతూ కారంచేడు మారణకాండ దేశవ్యాప్తంగా దళితుల ఆత్మగౌరవ పోరాటాలను నేర్పిందని తెలిపారు. కార్యక్రమంలో మోజేష్, రామారావు, గడ్డం సాల్మన్, దాసరి రక్షణకుమార్ తదితరులు పాల్గొన్నారు.

విషజ్వరాలు ప్రబలకుండా పకడ్బందీ చర్యలు

● డీఎంహెచ్‌వో డాక్టర్ వెంకటేశ్వర్లు


బావిని పరిశీలిస్తున్న డీఎంహెచ్‌వో వెంకటేశ్వర్లు, వైద్యులు

చీమకుర్తి, జూలై17 (ఆంధ్రజ్యోతి) : డెంగ్యూ, మలేరియా లాంటి విషజ్వరాలు ప్రబలకుండా పకడ్బందీ చర్యలు చేపట్టాలని డీఎంహెచ్‌వో డాక్టర్ వెంకటేశ్వర్లు తెలిపారు. రామతీర్థం తదితర ప్రాంతాల్లో విషజ్వరాలు వ్యాప్తి చెందకుండా బావులు, క్వారీ కుంటల్లో గంబూషియా చేపలు విడుదల చేయటం, స్రేయింగ్ కార్యక్రమాలను గురువారం ఆయన పరిశీలించారు. చీమకుర్తి పట్టణంలోని ఆరోగ్యకేంద్రాలను సందర్శించారు. తదుపరి బండ్లమూడి పీహెచ్‌సీని పరిశీలించి సి బ్బందితో మాట్లాడారు. కార్యక్రమంలో డాక్టర్ హరిణి, శ్రీనివాసులు, సాగర్, ప్రసాదరావు, మాధవరావు, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

అభివృద్ధి, సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

● ఎమ్మెల్యే దామచర్ల


చిరువ్యాపారితో మాట్లాడుతున్న ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్

ఒంగోలు కార్పొరేషన్, జూలై 17 (ఆంధ్రజ్యోతి) : ప్రజా ఆశీర్వాదంలో కూటమి ఏడాదిపూర్తి చేసుకుని అభివృద్ధి వైపు అడుగులు వేయడం సంతోషంగా ఉందని ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ పేర్కొన్నారు. సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమాన్ని గురువారం నగరంలోని 34,35 డివిజన్లలో నిర్వహించారు. ఈ సందర్భంగా దామచర్ల ప్రతి ఇంటికీ వెళ్ళి పలకరించి, ప్రజల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాల గురించి అడగ్గా, ప్రతి ఒక్కరూ తమకు చేరుతున్నాయని ఆనందం వెల్లిబుచ్చారు. ఇదే సమయంలో వీఐపీరోడ్‌లోని ఖాళీగా ఉన్న మునిసిపల్ స్థలంలో కమ్యూనిటీ హాలు నిర్మించాలని పలువురు ఎమ్మెల్యేకు విన్నవించారు. దీనిపై పరిశీలన చేయాలని ఆయన అధికారులను ఆదేశించారు. అనంతరం ఎమ్మెల్యే దామచర్ల మీడియాతో మాట్లాడుతూ గత ఐదేళ్ళ వైసీపీ పాలనలో అన్ని వర్గాల ప్రజలు అనేక ఇబ్బందులు పడ్డారన్నారు. అయితే ప్రజలు కోరుకున్న పాలన కూటమి ప్రభుత్వంతోనే సాధ్యమన్నారు. సూపర్ సిక్స్ హామీలను అమలు చేస్తున్నామని, అయితే వాస్తవాలు తెలియని వైసీపీ నేతలు ప్రభుత్వంపై బురదజల్లే ప్రయత్నాలు చేయడం సిగ్గు చేటని విమర్శించారు. రాష్ట్ర అభివృద్ధి కోసం సీఎం చంద్రబాబు నాయుడు నిరంతర కృషి చేయడంతోపాటు, అవసరమైన నిధులు కేటాయిస్తూ ఒంగోలు నగర అభివృద్ధి కోసం మరింత శ్రద్ధ చూపుతున్నారని పేర్కొన్నారు. నగర ప్రజల తాగునీటి కష్టాలు తీర్చడం కోసం అమృత్-2 పథకం కింద రూ. 424.42 కోట్లు నిధులు మంజూరు అయ్యాయని తెలిపారు. ప్రతి చివరి ఇంటికీ తాగునీరు అందించడమే లక్ష్యంగా పని చేస్తున్నట్లు చెప్పారు. అలాగే నగర సుందరీకరణ, డ్రైన్‌ల నిర్మాణం, సీసీ రోడ్‌లు, రహదారుల విస్తరణ పనులు వేగంగా జరుగుతున్నాయని దామచర్ల వివరించారు. కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ వేమూరి బుజ్జి, కార్పొరేటర్ ఆదిపూడి గిరిజా శాండిల్య, దాయనేని ధర్మ, కమిషనర్ కె.వెంకటేశ్వరరావు, ఎంఈ ఐసయ్య, నాయకులు పాల్గొన్నారు.

కూటమి ప్రభుత్వంతోనే రాష్ట్ర అభివృద్ధి సాధ్యం

● ఎమ్మెల్యే బీఎన్


మహిళతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే విజయ్‌కుమార్

సంతనూతలపాడు, జూలై 17(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర అభివృద్ధి కూటమి ప్రభుత్వంతోనే సాధ్యమని, ప్రజా సంక్షేమమే లక్ష్యంగా అడుగులు పడుతున్నాయని ఎమ్మెల్యే బీఎన్.విజయ్‌కుమార్ పేర్కొన్నారు. మండలంలోని బి.మాచవరం గ్రామంలో గురువారం సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమంలో భాగంగా ఎమ్మెల్యే ఇంటింటికి తిరిగి కరపత్రాలను అందజేశారు. సంక్షేమ పథకాలు అందుతున్నాయా లేదా అని అడిగి తెలుసుకున్నారు. గ్రామంలో సమస్యలను తెలుసుకుని వాటి పరిష్కారానికి అధికారులకు పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు మద్దినేని హరిబాబు, నాయకులు బీవై.ప్రసాద్, ఎస్.రామారావు ఆర్.అంకారావు, సుబ్బారావు, చెన్నారావు, చంద్రశేఖర్, వీరయ్య, రవి, శ్రీనివాసరావు, వెంకటస్వామి తదితరులు పాల్గొన్నారు.

యాప్‌లో నమోదు చేయాలి

సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమంలో భాగంగా ఇంటింటికి వెళ్లి కూటమి ప్రభుత్వం అందించిన సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించి మై టీడీపీ యాప్‌లో వివరాలను నమోదు చేయాలని ఎమ్మెల్యే బీఎస్.విజయ్‌కుమార్ కోరారు. గురువారం ఒంగోలులోని ఎమ్మెల్యే బీఎన్ కార్యాలయంలో పార్టీ మండల అధ్యక్షులు, సెక్రటరీలు, క్లస్టర్ ఇన్‌చార్జ్‌లు, క్లస్టర్ కో కన్వీనర్‌లతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో నియోజకవర్గ పరిశీలకులు చౌట శ్రీనివాసులు, రాష్ట్ర సెక్రటరీ స్వాములు పాల్గొన్నారు.

మర్రిచెట్లపాలెం రహదారి జలమయం

● అవస్థలు పడుతున్న వాహనదారులు


చెరువును తలపిస్తున్న కర్నూలురోడ్డు

చీమకుర్తి, జూలై17(ఆంధ్రజ్యోతి) : చీమకుర్తి మండల పరిధిలో గురువారం సాయంత్రం చిన్నపాటి వర్షం కురిసింది. దీంతో మర్రిచెట్లపాలెంలోని కర్నూల్‌రోడ్ చెరువును తలపిస్తూ వాహనదారుల రాకపోకలకు తీవ్ర అసౌకర్యం కలిగించింది. బూదవాడ నుంచి మర్రిచెట్లపాలెం వరకూ కర్నూల్‌రోడ్ గుంతలమయమై వర్షపు నీరు నిలిచిపోయి వాహనదారులను ఇక్కట్లకు గురిచేస్తున్నది. ఇప్పటికైనా అధికార యంత్రాంగం దృష్టిసారించి మర్రిచెట్లపాలెం ప్రాంతం నుంచి వెళ్తున్న రాష్ట్ర రహదారి కర్నూల్‌రోడ్‌కు మరమ్మతులు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

ప్రజాసంక్షేమానికి కట్టుబడి ఉన్నాం

హామీలన్నీ సీఎం చంద్రబాబు అమలు చేస్తారు .. ● ఇంటింటికీ టీడీపీ కార్యక్రమంలో మారిటైం బోర్డు చైర్మన్ దామచర్ల సత్య


ప్రభుత్వ పథకాల గురించి వివరిస్తున్న చైర్మన్ దామచర్ల సత్య

పొన్నలూరు, జూలై 17 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ప్రజాసంక్షేమ పాలన అందిస్తోందని, ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలన్నీ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు తప్పక అమలుచేస్తారని రాష్ట్ర మారిటైంబోర్డు చైర్మన్ దామచర్ల సత్య అన్నారు. సుపరిపాలన తొలిఅడుగు ఇంటింటికీ టీడీపీ కార్యక్రమంలో భాగంగా మండలంలోని ముప్పాళ్ల, రాజోలుపాడు, కె.అగ్రహారం గ్రామాల్లో సత్య గురువారం పర్యటించారు. ఇంటింటికీ తిరుగుతూ ప్రభుత్వ పథకాల గురించి వివరిస్తూ కరపత్రాలు పంచారు. సత్య మాట్లాడుతూ ప్రభుత్వం ఏర్పాటైన తొలి ఏడాదిలోనే పింఛన్ల పెంపు, ఏడాదికి మూడు ఉచిత గ్యాస్ సిలిండర్లు, తల్లికి వందనం పథకాలను అమలుచేసి మాట నిలబెట్టుకున్నామని తెలిపారు. త్వరలో మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం కూడా కల్పించబోతున్నట్టు చెప్పారు. రాష్ట్రం ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్నప్పటికీ, ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలన్నీ నెరవేర్చడం ఖాయమన్నారు. జగన్ హయాంలో కంపెనీలను బెదిరించి పంపించివేస్తే, చంద్రబాబు రాగానే అనేక కొత్త కంపెనీలు పెద్దసంఖ్యలో పెట్టుబడులు పెట్టేందుకు ముందుకు వస్తున్నాయని సత్య తెలిపారు. అంతకుముందు ముత్తరాసుపాలెంవద్ద మండలపార్టీ నేతలు సత్యకు ఘనస్వాగతం పలికారు. అనంతరం నవముఖ ఆంజనేయస్వామి దేవస్థానంలో సత్య ప్రత్యేక పూజలు చేశారు. ముప్పాళ్లలోని శ్రీ వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయంలోనూ పూజాకార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమాల్లో మండలపార్టీ అధ్యక్షుడు అనుమోలు సాంబశివరావు, మాజీ ఎంపీపీ కొండ్రగుంట శ్రీనివాసరావు, నాయకులు మండవ ప్రసాదు, కర్నా కోటిరెడ్డి, గుమ్మళ్ల వెంకట్రావు పాల్గొన్నారు.

సిండికేట్ రైతు సేవా సహకార సంఘం బాధ్యతల స్వీకరణ

● చైర్మన్ విజయమ్మకు సత్కారం


చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరిస్తున్న కూకట్ల విజయమ్మ, డైరెక్టర్లు

సంతనూతలపాడు, జూలై 17(ఆంధ్రజ్యోతి): సంతనూతలపాడులో సిండికేట్ రైతు సేవాసహకార సంఘం చైర్మన్‌గా కూకట్ల విజయమ్మ గురువారం బాధ్యతలు స్వీకరించారు. అదేవిధంగా సొసైటీ డైరెక్టర్లుగా మల్లవరపు రామక్రిష్ణారెడ్డి, పెరుగు రాము, ఎం.శంకరప్రసాద్ బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా చైర్మన్ విజయమ్మ మాట్లాడుతూ సొసైటీ అభివృద్ధికి కృషి చేస్తామని తెలిపారు. ఎమ్మెల్యే బీఎన్.విజయ్‌కుమార్‌కు ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలియజేశారు. అనంతరం చైర్మన్ విజయమ్మను టీడీపీ నేతలు ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు మద్దినేని హరిబాబు, కూకట్ల శరత్‌బాబు, రావులపల్లి వెంకటసురేష్‌బాబు, అబ్బూరి శ్రీనివాసరావు, ముప్పరాజు శ్రీను, తన్నీరు శ్రీను, బి.శంకర్, ఎస్.హరినాథ్, మార్కెట్ కమిటీ డైరెక్టర్ కె.శ్రీలత, సీహెచ్.శ్రీను, ఎ.రవి, అవినాష్, మీరయ్య, పద్మ, మాధవి, ఝాన్సీ, సుబ్బారావు, శ్రీను పాల్గొన్నారు.

- మార్కెట్ కమిటీ డైరెక్టర్లుగా ఎన్నికైన కె.శ్రీలత, పఠాన్‌మునీర్‌పర్వీన్‌లు గురువారం ఒంగోలులో ఎమ్మెల్యే బీఎన్.విజయ్‌కుమార్‌ను కలిసి ఘనంగా సత్కరించారు.

మంగమూరు సొసైటీ చైర్మన్‌గా నారాయణరావు

మంగమూరు సొసైటీ చైర్మన్‌గా నల్లూరి నారాయణరావు, డైరెక్టర్లుగా కె.గోపి, ఎస్‌కే.మస్తాన్ సాహెబ్‌లు గురువారం బాధ్యతలు స్వీకరించారు. కార్యక్రమంలో టీడీపీ మండల వర్కింగ్ ప్రెసిడెంట్ అబ్బూరి శ్రీనివాసరావు, నీటి సంఘం అధ్యక్షులు నల్లూరి క్రిష్ణారావు, అబ్బూరి శ్రీను, సొసైటీ సెక్రటరీ నల్లూరి ఏసుబాబు తదితరులు పాల్గొన్నారు.

నిరుద్యోగభృతిని వెంటనే అమలు చేయాలి

ఒంగోలు కలెక్టరేట్, జూలై 17 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల సమయంలో నిరుద్యోగ యువతకు ఇచ్చిన హామీ మేరకు రూ.3వేలు నిరుద్యోగ భృతి చెల్లించాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గసభ్యుడు గుజ్జుల ఈశ్వరయ్య డిమాండ్ చేశారు. స్థానిక మల్లయ్యలింగం భవన్‌లో గురువారం ఏఐవైఎఫ్ సమావేశానికి రాష్ట్ర అధ్యక్షుడు యుగంధర్ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ఈశ్వరయ్య మాట్లాడుతూ అధికారంలోకి రాక ముందు ఇచ్చిన అన్ని రకాల హామీలను అమలు చేసి మాట నిలబెట్టుకోవాలని చెప్పారు. నిరుద్యోగులకు ఉపాధి, ఉద్యోగ అవకాశాలు కల్పించాలన్నారు. ఒంగోలులో వచ్చేనెల 23న జరిగే శ్రమజీవుల శంఖారావం సభను విజయవంతం చేయాలని కోరారు. ఏఐవైఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పరుచూరి రాజేంద్రబాబు, రాష్ట్ర అధ్యక్షుడు యుగంధర్, ఆర్గనైజింగ్ సెక్రటరి గుండాల సంతోష్‌కుమార్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం సచివాలయ ఉద్యోగుల ద్వారా స్కిల్ సెన్సెక్స్ సర్వే చేశారని, వాటి ఆధారంగా యువతకు ఉపాధి కల్పించాలని కోరారు. కార్యక్రమంలో పోతుల ప్రభాకర్, వై.బాబి, నాగరాముడు, కె.శ్రీనివాసులు, షేక్ సుభాని, కత్తి రవి తదితరులు పాల్గొన్నారు.

కుష్టు వ్యాధిపై అవగాహన కలిగి ఉండాలి

నాగులుప్పలపాడు, జూలై 17 (ఆంధ్రజ్యోతి): కుష్టు వ్యాధిపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని జిల్లా కుష్టువ్యాధి నిర్మూలన అధికారి బెజవాడ శ్రీవాణి పేర్కొన్నారు. కుష్టు, క్షయ వ్యాధిగ్రస్తులను గుర్తించేందుకు గురువారం ఉప్పుగుండూరులో ఇంటింటి సర్వే, అవగాహన ర్యాలీని నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీవాణి మట్లాడుతూ చర్మంపై స్పర్శలేని మచ్చలు, చర్మం జిడ్డుగా ఉబ్బెత్తుగా బత్తాయి తొక్కలు మాదిరిగా మారడం, చెవులు, వీపు, ఎదపై నొప్పిలేని బొడిపలు రావడం, కనుబొమ్మలపై వెంట్రుకలు రాలిపోవడం, ముక్కుదిబ్బడ, ముక్కులో నుంచి రక్తం కారడం, అలాగే కాళ్లు చేతులు తిమ్మిర్లు, చేతి కాలి వేళ్లు వంకర్లు తిరగడం వంటి లక్షణాలు కుష్టు వ్యాధిగా తెలిపారు. ఎండీటీ చికిత్స ద్వారా ఈ వ్యాధి పూర్తిగా నయమవుతుందని చెప్పారు. అనుమానితులు స్థానిక వైద్యశాలలో పరీక్షలు చేయించుకోవాలని, మందులు ఉచితంగా అందిస్తారని తెలిపారు. అలాగే ఛాతీలో నొప్పి, తెమడతో కూడిన దగ్గు, తెమడలో రక్తం రావడం, రాత్రిపూట చెమటలు పట్టడం, ఆరోగ్యంలో మార్పులు క్షయ లక్షణాలని, వైద్యసిబ్బంది ఇంటికి వచ్చి చికిత్స అందిస్తారని పేర్కొన్నారు. కార్యక్రమంలో నోడల్ అధికారి శౌరయ్య పాల్గొన్నారు.

ఎలక్ట్రీషియన్ అనుమానాస్పద మృతి

ఒంగోలు క్రైం, జూలై17(ఆంధ్రజ్యోతి): ఎలక్ట్రీషియన్ పనులు చేసే షేక్ అబ్దుల్ ఖాదర్ (34) అనుమానాస్పద రీతిలో మృతి చెందాడు. ఈ సంఘటన ఒంగోలులోని గోపీకృష్ణ థియేటర్ నుంచి శ్రీనివాస హాలుకు వెళ్లే దారిలో గల కట్టెల అడితి వద్ద జరిగింది. అబ్దుల్‌ఖాదర్ మురుగు కాలువలో పడి ఉన్నాడు. బలరాంకాలనీకి చెందిన క్యాటరింగ్ పనులు చేసే హర్షిత్‌కుమర్ గుర్తించి స్థానికుల సహాయంతో ఆయనను కాలువలో నుంచి బయిటకు తీసి 108 వాహనం ద్వారా రిమ్స్‌కు తరలించారు. అయితే అబ్దుల్‌ఖాదర్ అప్పటికే మృతి చెందినట్లు డాక్టర్లు చెప్పారు. కనిగిరి చెందిన అబ్దుల్‌ఖాదర్ ఒంగోలులోని గాంధీనగర్‌లో నివాసం ఉంటూ ఎలక్ట్రీషియన్, పెయింట్ పనులు చేసుకుంటూ జీవిస్తున్నాడు. బుధవారం రాత్రి మద్య మత్తులో మురుగు కాలువలో పడి మృతి చెందినట్లు పోలీసులు ప్రాథమికంగా అంచనాకు వచ్చారు. పోస్టుమార్టం నివేదిక వచ్చిన తరువాత మృతికి గల కారణం తెలుస్తుందని టూటౌన్ సీఐ మేడా శ్రీనివాసరావు తెలిపారు. కేసు దర్యాప్తు చేస్తున్నామని ఆయన పేర్కొన్నారు.

హంసా క్వారీలో కార్మికుడి ఆత్మహత్యాయత్నం

చీమకుర్తి, జూలై17(ఆంధ్రజ్యోతి) : రామతీర్థం సమీపంలో ఉన్న హంసా గ్రానైట్ క్వారీలో కార్మికుడు సుబ్రహ్మణ్యం గురువారం ఆత్మహత్యాయత్నం చేశాడు. క్వారీ యజమాన్యం నాలుగు నెలలు నుంచి జీతాలు చెల్లించకపోవటంతో కార్మికసంఘ నాయకులు క్వారీ యాజమాన్య ప్రతినిధులతో చర్చలు నిర్వహిస్తున్న సమయంలో అక్కడే ఉన్న సుబ్రహ్మణ్యం ఒక్కసారిగా పెట్రోల్ పోసుకొని నిప్పంటించుకున్నాడు. మరో కార్మికుడు ఉరి వేసుకొనే ప్రయత్నం చేసినట్లు ప్రత్యక్షసాక్షులు సమాచారం మేరకు తెలుస్తున్నది. క్షతగాత్రుడుని తొలుత ఒంగోలులో ఓ ప్రైవేటు ఆసుపత్రికి తదుపరి పరిస్థితి విషమించటంతో మెరుగైన వైద్యం కోసం నెల్లూరుకు తరలించినట్లు సమాచారం. ఈ సంఘటనపై తమకు ఎటువంటి ఫిర్యాదు అందలేదని సీఐ సుబ్బారావు తెలిపారు.

చీమకుర్తిలో ఎక్సైజ్ ఆకస్మిక తనిఖీలు


తనిఖీలను నిర్వహిస్తున్న ఉన్నతాధికారులు

చీమకుర్తి, జూలై 17 (ఆంధ్రజ్యోతి): చీమకుర్తి పట్టణంలో బుధవారం అర్ధరాత్రి ఎక్సైజ్‌శాఖకు చెందిన ఉన్నతాధికారులు ఆకస్మిక తనీఖీలు నిర్వహించారు. ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ నాగరాజు ఆధ్వర్యంలో నిర్వహించిన దాడుల్లో నిర్ణీత సమయాన్ని మించి మద్యం విక్రయాలు చేస్తున్నారా అనే కోణంలో ఐదు వైన్స్‌షాపులు, ఒక బార్ అండ్ రెస్టారెంట్‌లో తనిఖీలు జరిపారు. స్టాక్‌ను పరిశీలించారు. కార్యక్రమంలో సూపరింటెండెంట్ ఆయేషా, అసిస్టెంట్ సూపరింటెండెంట్ వెంకట్, సీఐ సుకన్య, సిబ్బంది పాల్గొన్నారు.

కళావేదిక నిర్మాణం కోసం భూమిపూజ


శంకుస్థాపన చేస్తున్న శ్రీనివాసరావు

కొత్తపట్నం, జూలై 17(ఆంధ్రజ్యోతి): ఈతముక్కలలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో కళావేదిక నిర్మించేందుకు గ్రామానికి చెందిన కుంభా శ్రీనివాసరావు ముందుకు వచ్చారు. రూ.5 లక్షలతో తన తల్లిదండ్రుల పేరుతో పాఠశాలలో కళావేదిక నిర్మించేందుకు గురువారం భూమిపూజ చేశారు. పాఠశాలలో వందల సంఖ్యలో విద్యార్థులు చదువకుంటున్నారు. ఉదయాన్నే ప్రార్థన, ప్రత్యేక సమయాల్లో సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించేందుకు వారు ఇబ్బందిపడుతున్నారు. ఈ విషయాన్ని హెచ్ఎం చెంచుపున్నయ్య, ఉపాధ్యాయులు ఈ విషయాన్ని కుంభా శ్రీనివాసరావు దృష్టికి తీసుకుపోగా కళావేదిక నిర్మాణం కోసం ఆయన అంగీకరించారు. కళావేదిక నిర్మాణ పనులను ఆగస్టు 15వ తేదీ నాటికి పూర్తి చేయిస్తానని శ్రీనివాసరావు హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

యాదవ్ రెజిమెంట్‌ను అమలు చేయాలి


బైక్ ర్యాలీ నిర్వహిస్తున్న నాయకులు

ఒంగోలు కలెక్టరేట్, జూలై 17 (ఆంధ్రజ్యోతి): భారత సైన్యంలో అహీర్ రెజిమెంట్(యాదవ రెజిమెంట్)ను పునరుద్ధరించాలని పలువురు డిమాండ్ చేశారు. గురువారం ఒంగోలు సమీపంలోని పెళ్ళూరులోని గంగమ్మ దేవాలయంలో పూజలు నిర్వహించి అనంతరం బైక్ ర్యాలీ నిర్వహించారు. అఖిలభారత యాదవ మహాసభ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో రాష్ట్ర అధ్యక్షులు మహేశ్వరి, బొట్లా రామారావు, జిల్లా అధ్యక్షుడు బొట్లా సుబ్బారావు, జోన్ అధ్యక్షురాలు నాగమల్లేశ్వరి, కె.కోటి, కె.వెంకటేశ్వర్లు, శంకర్, ఎం.రాజు, పెద్దన్న, మస్తాన్‌రావు, నాగేశ్వరరావు, దత్తాత్రేయ, వెంకటశేషయ్య, రాజ్యలక్ష్మి పాల్గొన్నారు.

డెంగ్యూపై అప్రమత్తంగా ఉండాలి

నాగులుప్పలపాడు, జూలై 17 (ఆంధ్రజ్యోతి): దోమల ద్వారా సక్రమించే డెంగ్యూపై ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని పోతవరం ప్రభుత్వ వైద్యశాల ఫార్మాసిస్ట్ ఎంపీ.రత్నకుమార్ సూచించారు. గురువారం పోతవరంలో జడ్పీ హైస్కూలు విద్యార్థులతో ఆయన గ్రామంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా రత్నకుమార్ మట్లాడుతూ పరిసరాల పరిశుభ్రతతో దోమల వృద్ధిని నివారించవచ్చని తెలిపారు. ఎడిస్‌ఈజిప్ట్ దోమకాటు వల్ల డెంగ్యూ సోకుతుందని, అందువల్ల ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని చెప్పారు. దోమకాట గురికాకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో హెచ్ఎం రమేష్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పురుగుమందుల దుకాణాల తనిఖీలు


తనిఖీలు చేస్తున్న విజిలెన్స్ అధికారులు

ఒంగోలు(రూరల్), జూలై17(ఆంధ్రజ్యోతి): ఒంగోలు మండలంలోని పలు ఎరువులు, పురుగుమందుల దుకాణాలను గురువారం విజిలెన్స్ అధికారులు తనిఖీలు నిర్వహించారు. బాలాజీ ఏజెన్సీస్ దుకాణంలో అమ్మకాల్లో తేడాలను గుర్తించారు. శాంతి సీడ్స్‌లో కూడా విత్తనాలు అమ్మకాలను నిలుపుదల చేశారు. కార్యక్రమంలో ఏడీఏ శ్రీనివాసరావు, విజిలెన్స్ సీఐ సుభాని, ఏవో కె.రమేష్‌బాబు, టెక్నికల్ ఏవో పి.వేణు పాల్గొన్నారు

క్విస్‌లో అవగాహన సదస్సు



మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ హనుమంతరావు

ఒంగోలు విద్య, జూలై 17 (ఆంధ్రజ్యోతి) : ఒంగోలులోని క్విస్ ఇంజనీరింగ్ కళాశాలలో లేటరల్ ఎంట్రీ ద్వారా ఇంజనీరింగ్‌లో చేరిన విద్యార్థులకు గురువారం అవగాహన సదస్సు నిర్వహించారు. పాలిటెక్నిక్ చదివి నేరుగా ఇంజనీరింగ్ ద్వితీయ సంవత్సరంలో ప్రవేశించిన విద్యార్థులకు ఘనంగా స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ వైవీ.హనుమంతరావు మాట్లాడుతూ విద్యార్థులు క్విస్ ఇంజనీరింగ్ కళాశాలను ఎంపిక చేసుకోవడం సరైన నిర్ణయమన్నారు. కళాశాలలో నిర్వహించే ప్రత్యేక తరగతులు, వివిధ కోర్సులు, సౌకర్యాలను సద్వినియోగం చేసుకుని జీవితరంలో ఉన్నతస్థాయికి చేరుకోవాలని కోరారు. కొత్తగా వచ్చిన విద్యార్థులకు క్విస్ విద్యాసంస్థల అధినేత డాక్టర్ నిడమానూరి సూర్యకళ్యాణ్ చక్రవర్తి, ఎగ్జిక్యూటివ్ వైస్‌చైర్మన్ డాక్టర్ శ్రీగాయత్రి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో స్టూడెంట్స్ డీన్ జి.శ్రీనివాసరావు, వెంకటప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న తహసీల్దార్

బీఎల్వోలకు సాంకేతిక పరిజ్ఞానం అవసరం

పెద్దారవీడు, జూలై 17 (ఆంధ్రజ్యోతి) : బీఎల్వోలు ఎన్నికల నిర్వహణ, ఓట్ల నమోదు, తొలగింపు వంటి అంశాలపై సాంకేతిక పరిజ్ఞానం పెంపొందించుకోవాలని తహసీల్దార్ శైలేంద్రకుమార్ అన్నారు. ఎంపీడీవో కార్యాలయంలో గురువారం బీఎల్వోలకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. మాస్టర్ ట్రైనర్ కృష్ణారెడ్డి ఓటర్ల చేర్పులు, తొలగింపులపై బీఎల్వోలకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఎన్నికల డిప్యూటీ తహసీల్దార్ భాస్కర్‌రెడ్డి, డీటీ రామకృష్ణ, 42 మంది బీఎల్వోలు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరా బంద్

గిద్దలూరు టౌన్, జూలై 17 (ఆంధ్రజ్యోతి) : ముండ్లపాడు సబ్‌స్టేషన్ పరిధిలో మరమ్మతుల నిమిత్తం శుక్రవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు ఉండ్లపాడు, తాళ్లపల్లెలో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్టు విద్యుత్ శాఖ అధికారి తెలిపారు.

రూ.75లక్షలతో కాలువల మరమ్మతులు

- మేజర్‌ల కోసం నిధులు మంజూరు
- సాగర్ నీటి సరఫరాకు తొలగిన ఇబ్బందులు



మరమ్మతుల తరువాత ముడివేముల మేజర్ కాలువ

త్రిపురాంతకం, జూలై 17 (ఆంధ్రజ్యోతి) : త్రిపురాంతకం ఎన్నెస్పీ సబ్ డివిజన్ పరిధిలోని మేజర్ కాలువల మరమ్మతులకు నిధులు మంజూరయ్యాయి. కాలువలపై చిల్లచెట్లు పెరిగిపోయి కొన్నిచోట్ల, కాలువల్లో వ్యర్థాలు పేరుకుపోయి పూడిక నిండి మరికొన్నిచోట్ల ఉండగా వాటికి గాను మొత్తం 20 పనులకు 75లక్షల రూపాయలు మంజూరయ్యాయి. చెట్లు తొలగించటం, కాలువల్లోని వ్యర్థాలు తొలగించి నీటి సరఫరాకు ఆటంకం లేకుండా చేసేలా ఈ పనులు చేపడుతున్నారు. ఈ పనులను సాగునీటి సంఘాల అధ్యక్షుడు, ఆయా గ్రామాల్లోని నాయకులు నామినేషన్ పద్ధతిపై చేపట్టి పూర్తి చేస్తున్నారు. సాగర్ నీరు విడుదల సమయానికి కాలువలు పూర్తి స్థాయిలో మరమ్మతులు జరగాల్సి ఉండగా, ఇవి అరకొర నిధులు అంటూ కొందరు పెదవి విరుస్తున్నా చాలా వరకు ఊరట ఇచ్చినట్లేనని ఎక్కువమంది రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. మంజూరైన పనుల వివరాలను పరిశీలిస్తే పుల్లలచెరువు మండల పరిధిలోని నరసాపురం అయ్యవారిపల్లి మేజరుకు రూ.3లక్షల 40వేలు, ఐటివరం సెక్షన్ పరిధిలోని ఉమ్మడివరం మేజరు, మైనరు కాలువలకు రూ.3లక్షలు, ఉమ్మడివరం మేజరు 4.727కి.మీ నుంచి 9.755 వరకు పనులకుగాను రూ.2లక్షల 90వేలు, అన్నసముద్రం మేజర్, మైనరు కోసం 3 లక్షల రూ.10వేలు, ముడివేముల మేజరుకు రూ.2 లక్షల 99వేలు, మిరియంపల్లి మేజర్‌కు రూ.3లక్షల 21వేలు, సోమేపల్లి, విశ్వనాథపురం, వెల్లంపల్లి మేజరుకు రూ.3లక్షల 62వేలు, గొల్లపల్లి, విశ్వనాథపురం, దివిపల్లి మేజర్‌కు రూ.2లక్షల 98వేలు, ఉమ్మడివరం మేజరు 0.000కి.మీ నుంచి 4.727వరకు రూ.3లక్షల 55వేలు మంజూరయ్యాయి. ముడివేముల మేజరుకు రూ.3లక్షల 56వేలు, ముడివేముల 4.391 కి.మీ నుంచి 11.305వరకు పనులకు రూ.3లక్షల 13 వేలు, మిరియంపల్లి మేజరు 0.000కి.మీ నుంచి 8.657 కి.మీ వరకు రూ.3లక్షల 79వేలు, ముడివేముల మేజరు కాలువ బలోపేతం చేయటంకోసం రూ.5లక్షల 10వేలు మంజూరుకాగా పుల్లలచెరువు మండలం ఐటివరం సెక్షన్ నుంచి త్రిపురాంతకం మండలంలోని 164.120 కి.మీ వరకు పలుచోట్ల సాగరు ప్రధాన కాలువ మరమ్మతులకోసం మొత్తం 6 పనులకు రూ.26లక్షల 71వేలతో పనులు చేపడుతున్నారు. త్వరితగతిన ఈ పనులు పూర్తి చేయించేలా చర్యలు తీసుకున్నామని డీఈ విజయలక్ష్మి తెలిపారు.



8వ వార్డులో సీఎంఆర్ఎఫ్ చెక్కులను అందజేస్తున్న ఎమ్మెల్యే సతీమణి వసంతలక్ష్మి

ప్రజల ఆరోగ్యంపై ప్రభుత్వానికి శ్రద్ధ

19 మందికి రూ.11.62లక్షల

సీఎంఆర్ఎఫ్ చెక్కులు అందజేసిన వసంతలక్ష్మి

మార్కాపురం, జూలై 17 (ఆంధ్రజ్యోతి) : ప్రజల ఆరోగ్యంపట్ల ప్రభుత్వం అత్యంత శ్రద్ధ చూపుతుందని ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి సతీమణి వసంతలక్ష్మి అన్నారు. మార్కాపురం పట్టణ, మండల పరిధిలోని 19 మందికి మంజూరైన రూ.11.62 లక్షల ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులను ఇంటింటికీ వెళ్లి ఆమె అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కార్పొరేట్ వైద్యం పొందిన పేదలను ఆదుకోవడంలో ప్రజా ప్రభుత్వం ముందుందని అన్నారు. కార్పొరేట్ వైద్యం పొందిన వాళ్లు సకాలంలో డాక్యుమెంట్లు, బిల్లులతో ఎమ్మెల్యే కార్యాలయంలో సంప్రదించాలన్నారు. పార్టీలతో సంబంధంలేకుండా ఆపదలో ఉన్న ప్రతి ఒక్కరినీ ఆదుకోవడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. మంజూరైన సీఎంఆర్ఎఫ్ చెక్కులను ఇక నుంచి వారి ఇంటికే వెళ్లి అందజేస్తామన్నారు. కార్యక్రమంలో ఆయా వార్డుల కౌన్సిలర్లు, టీడీపీ, జనసేన, బీజేపీ మహిళా విభాగం నాయకురాళ్లు పాల్గొన్నారు.

తాగునీటి ఇబ్బంది తీర్చండి



కమిషనర్‌తో మాట్లాడుతున్న బీజేపీ నాయకులు

మార్కాపురం వన్‌టౌన్, జూలై 17 (ఆంధ్రజ్యోతి) : మున్సిపల్ కార్మికుల సమ్మె దృష్ట్యా పట్టణంలో తాగునీటి సమస్యను తీర్చాలని బీజేపీ నాయకులు పీవీ కృష్ణారావు గురువారం చిన్న మసీద్ వద్ద కమిషనర్‌కు విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా కమిషనర్ నారాయణరావుతో మాట్లాడుతూ.. కార్మికుల సమ్మెతో కొన్ని ప్రాంతాలలో తాగునీటి సరఫరా నిలిచిపోయిందన్నారు. మున్సిపల్ కార్మికుల సమ్మెకు పరిష్కారం చూపాలన్నారు. ప్రజలు కడుతున్న పన్నులతో జీతాలు తీసుకుంటున్న కార్మికులు ప్రజలను ఇబ్బంది పెట్టకుండా నిరసన తెలపాలన్నారు.

చలో విజయవాడకు తరలిన కార్మికులు

కంభం, జూలై 17 (ఆంధ్రజ్యోతి): డిమాండ్ల సాధన కోసం గత 5 రోజులుగా సమ్మెకు దిన మున్సిపల్ ఇంజనీరింగ్, పారిశుధ్య కార్మికులు గురువారం చలో విజయవాడ కార్యక్రమానికి తరలివెళ్లారు. గురువారం విజయవాడలో జరిగిన ధర్నాలో పాల్గొన్నారు. గత సమ్మె కాలం ఒప్పందాలను వెంటనే పరిష్కరించి ప్రస్తుత డిమాండ్లకు జీవోలను ఇవ్వాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ కార్మిక సంఘం ప్రతినిధులు మస్తాన్‌రెడ్డి, మౌళాలి, నాగయ్య, మురళి పాల్గొన్నారు.

ప్రజా సమస్యలపై ఉద్యమం

మార్కాపురం వన్‌టౌన్, జూలై 17 (ఆంధ్రజ్యోతి) : ప్రజా సమస్యలపై ప్రణాళిక రూపొందించి కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఉద్యమం నిర్వహిస్తామని కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి షేక్ సైదా అన్నారు. పూలసుబ్బయ్య భవన్‌లో గురువారం నిర్వహించిన కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీని సంస్థాగతంగా బలోపేతం చేయాలన్నారు. పట్టణ మండల కమిటీలను ఏర్పాటు చేసి తిరిగి కాంగ్రెస్‌ను అధికారంలోకి తీసుకొచ్చేందుకు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

14 గ్రామాల్లో రీ-సర్వే పూర్తి

పొదిలి, జూలై 17 (ఆంధ్రజ్యోతి) : మండలంలో మొత్తం 14 గ్రామల్లో రీ-సర్వే పూర్తి అయినట్లు తహసీల్దార్ కృష్ణారెడ్డి తెలిపారు. రీసర్వే పూర్తి అయిన గ్రామాలు ఏలూరు, నిమ్మవరం, అన్నవరం, రాములవీడు, కుంచేపల్లి, ఈగలపాడు, తుమ్మగుంట, కొండాయపాలెం, డొండ్లేరు, సలకనూతల, మూగచింతల, నందిపాలెం, రామాయణకండ్రిక, అక్కచెరువు, జువ్వలేరు పూర్తి అయ్యాయని చింతగుంపల్లి, లక్ష్మీపురంలో జరుగుతుందన్నారు. వీటి తర్వాత దాసర్లపల్లి జరుగుతుందన్నారు. కనుక రీసర్వేలో ఏదైనా సమస్యలుంటే వెంటనే తహసీల్దార్ కార్యాలయంలో తెలియజేయాలన్నారు.

పోగొట్టుకున్న బ్యాగు బాధితులకు అందజేత

సామాజిక బాధ్యతను చాటుకున్న మున్సిపల్ కౌన్సిలర్ కరిముల్లా

మార్కాపురం, జూన్ 17 (ఆంధ్రజ్యోతి) : ఓ హోటల్‌లో దొరికిన బ్యాగ్‌ను 15వ వార్డు కౌన్సిలర్ డి.కరిముల్లా బాధితులకు అప్పగించి బాధ్యతను చాటుకున్నారు. టౌన్ ఎస్సై ఎం.సైదుబాబు కథనం మేరకు.. పట్టణంలోని కంభం రోడ్డులోగల ఆంజనేయస్వామి గుడి సమీపంలో ఓ హోటల్‌లో బుధవారం రాత్రి 7.00 గంటలకు కౌన్సిలర్ కరిముల్లాకు ఓ బ్యాగు దొరికింది. చుట్టుపక్కల వారిని విచారించినా ఎవరిదీ కాదనే సరికి నేరుగా బ్యాగును టౌన్ పోలీసు స్టేషన్‌కు తీసుకెళ్లారు. అక్కడ ఎస్సై సైదుబాబు బ్యాగులో వెతగ్గా ఆర్మీ ఐడీ కార్డు కనిపించింది. కార్డులోని పేరునుబట్టి విచారించగా కరెంటు ఆఫీసు వెనుకవైపు ప్రాంతానికి చెందిన ఎక్స్ ఆర్మీ ఉద్యోగి షేక్ మహమ్మద్ రఫీదిగా గుర్తించారు. రఫీ భార్యను పోలీసు స్టేషన్‌కు పిలిపించి ఆ బ్యాగును ఎస్సై సైదుబాబు అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎక్కడైనా ఇతరుల వస్తువులు కనిపిస్తే పోలీసు స్టేషన్‌లో అప్పగిస్తే పోయినవారికి చేరుస్తామన్నారు. సామాజిక బాధ్యతతో బ్యాగును బాధితులకు అందజేయించిన కౌన్సిలర్ కరిముల్లాను అభినందించారు.

నిమ్మ తోటను పరిశీలించిన తహసీల్దార్

ఎర్రగొండపాలెం రూరల్, జూలై 17 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని మొగుళ్లపల్లి గ్రామానికి చెందిన చేకూరి సుబ్బారావు అనే రైతు 3 ఎకరాల నిమ్మ తోట గుర్తు తెలియని వ్యక్తుల చేతిలో ఈ నెల 15వ తేదీన నిమ్మ మొక్కలు, డ్రిప్ పరికరాలు కాలిపోయిన విషయం తెల్సిందే. ఉద్యాన, పోలీస్, రెవెన్యూ శాఖలకు రైతు ఫిర్యాదు చేశారు. ఈమేరకు గురువారం తహసీల్దార్ డీ మంజునాథరెడ్డి సిబ్బందితో కాలిపోయిన తోటను పరిశీలించి రైతు నుంచి వివరాలు తెలుసుకున్నారు.



నిమ్మ తోటను పరిశీలిస్తున్న తహసీల్దార్



మధ్యాహ్న భోజనాన్ని రుచి చూస్తున్న ఎంఈవో శ్రీనివాసరావు

మధ్యాహ్న భోజనం పరిశీలన

కంభం, జూలై 17 (ఆంధ్రజ్యోతి) : కంభం పంచాయతీలోని అర్బన్ కాలనీ ఉర్దూ పాఠశాలలో డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజనాన్ని గురువారం ఎంఈవో-2 శ్రీనివాసులు పరిశీలించారు. ఈసందర్భంగా పాఠశాలలో మెనూ ప్రకారం నిర్వహించిన భోజనాలను రుచి చూసి సంతృప్తిని వ్యక్తం చేశారు. పాఠశాలలో పచ్చదనం, పరిశుభ్రత, విద్యార్థుల క్రమశిక్షణ, దుస్తులు, విద్యార్థి పథకంలో భాగంగా విద్యా ఉపకరణాలపై కితాబునిచ్చారు. విద్యార్థి మిత్ర కిట్స్ పంపిణీకి చెందిన బయోమెట్రిక్ అథెంటికేషన్ ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు. కార్యక్రమంలో సీఆర్పీ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

డైరీలను విద్యార్థులు వినియోగించుకోవాలి

రాచర్ల, జూలై 17 (ఆంధ్రజ్యోతి) : దాతలు అందించిన డైరీలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని పాఠశాల ఇన్చార్జి ప్రధానోపాధ్యాయుడు వెంకటరంగయ్య అన్నారు. మండలంలోని జేపీచెరువు జడ్పీహెచ్ స్కూల్‌లో చదువుతున్న 10వ తరగతి విద్యార్థులకు దాతలు డైరీలు బహూకరించగా గురువారం ఆయన అందజేశారు. దాతలు పాఠశాల అభివృద్ధిలో తమకు సహకరించాలని ఆయన కోరారు. కార్యక్రమంలో ఎస్ఎంసీ చైర్మన్ మహబూబ్ బాషా పాఠశాల, సిబ్బంది పాల్గొన్నారు.

చదువుతో పాటు క్రీడల్లో రాణించాలి



విద్యార్థులను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

మార్కాపురం వన్‌టౌన్, జూలై 17 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థులు చదువుతో పాటు క్రీడలపై మక్కువ పెంచుకొని రాణించాలని సాయి బాలాజీ హైస్కూల్ ప్రిన్సిపాల్ సయ్యద్ మస్తాన్ వలి అన్నారు. ఈ స్కూల్‌లో జిల్లా స్థాయి బ్యాడ్మింటన్ పోటీలలో బహుమతులను గెలుచుకున్న విద్యార్థులను గురువారం సన్మానించారు. ఈ సందర్భంగా మస్తాన్ వలి మాట్లాడుతూ.. ఒంగోలులో జరిగిన 52వ ప్రకాశం జిల్లా స్థాయి బ్యాడ్మింటన్‌లో తమ పాఠశాల విద్యార్థులు కేవీ అభిలాష్ అండర్-19 డబుల్స్ విభాగంలో విన్నర్‌గా నిలిచాడని తెలిపారు. డి.త్రిభువనశ్రీ అండర్-17 సింగిల్స్‌లో ద్వితీయ, డబుల్స్ అండర్-19లో విన్నర్‌గా నిలిచి ప్రథమ బహుమతి సాధించిందని తెలిపారు. సయ్యద్ ముస్తాభీం అండర్-17లో తృతీయ బహుమతి గెలుపొందారని తెలిపి ఫిజికల్ డైరెక్టర్లు మస్తాన్ వలి, వెంకటేశ్వర్లును అభినందించారు.

పీ-4 సర్వేపై గ్రామ సభలు నిర్వహించాలి

తర్లుపాడు, జూలై 17 (ఆంధ్రజ్యోతి) : పీ-4 సర్వేపై అన్ని గ్రామాల్లో గ్రామసభలు నిర్వహించాలని ఏవో చంద్రశేఖర్ అధికారులకు సూచించారు. మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులతో ఆయన సమావేశం నిర్వహించారు. మండలంలోని అన్ని గ్రామాల్లో గ్రామసభలు నిర్వహించి నిరుపేదలను దత్తతు తీసుకునే వారిని గుర్తించాలని సూచించారు. రేపు నాగెళ్లముడుపు, 19న తాడివారిపల్లి, తుమ్మలచెరువు, 22న కేతగుడిపి, సీతానాగులవరం, 23న కలుజువ్వలపాడు, పోతలపాడు, 24న గానుగపెంట, 25న తర్లుపాడులలో గ్రామసభలు నిర్వహిస్తున్నట్లు ఇన్‌చార్జి ఎంపీడీవో చంద్రశేఖర్ తెలిపారు. కార్యక్రమంలో మండలంలోని అన్ని పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

కాలువల్లో మురుగు తొలగించాలి



పూడికతీత పనులను పరిశీలిస్తున్న ఈవోఆర్డీ వెంకటేష్

రాచర్ల, జూలై 17 (ఆంధ్రజ్యోతి) : కాలువల్లో నిండిపోయిన మురుగును వెంటనే తొలగించాలని మండల విస్తరణ అధికారి ఐ.వెంకటేష్ అన్నారు. రాచర్లలో పంచాయితీ కార్మికులు మురుగుతీత పనులు చేపట్టగా ఆయన పరిశీలించారు. కాలువల్లోని మురుగును తొలగించి పరిశుభ్రంగా ఉంచాలని, వెంటనే బ్లీచింగ్ చల్లాలన్నారు. ప్రజలు వీధుల్లో చెత్తాచెదారం వేయకుండా చెత్తబండ్లలోనే వేసే విధంగా చూసుకోవాలని సిబ్బందికి సూచించారు. ఈవోఆర్డీ వెంట పంచాయతీ కార్యదర్శి వెంకటేశ్వర నాయక్ ఉన్నారు.

మద్యం తాగి వాహనం నడిపిన వ్యక్తికి జరిమానా

గిద్దలూరు టౌన్, జూలై 17 (ఆంధ్రజ్యోతి) : మద్యం మత్తులో వాహనం నడిపిన వ్యక్తికి గిద్దలూరు కోర్టు రూ.10వేల జరిమానా, 3 రోజులు జైలు శిక్ష, 6 నెలలపాటు లైసెన్సు రద్దు చేస్తూ అడిషనల్ జూనియర్ సివిల్ న్యాయాధికారి భరత్‌చంద్ర తీర్పునిచ్చారు. పోలీసులు డ్రంకెన్ డ్రైవ్ నిర్వహిస్తుండగా మద్యం తాగి వాహనం నడిపిన వ్యక్తిని గుర్తించి కోర్టులో హాజరు పరచగా న్యాయాధికారి భరత్‌చంద్ర ఆ వ్యక్తికి జరిమానా, జైలు శిక్ష విధించారు.

సుపరిపాలనతో గ్రామాలను అభివృద్ధి చేస్తాం



కరపత్రాలను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే అశోక్‌రెడ్డి



24వ బూత్‌లో కరపత్రాలను పంపిణీ చేస్తున్న ఎరిక్షన్‌బాబు

ఎమ్మెల్యే అశోక్ రెడ్డి

రాచర్ల, జూలై 17 (ఆంధ్రజ్యోతి) : సుపరిపాలనతో అన్ని గ్రామాలను అభివృద్ధి చేస్తామని గిద్దలూరు ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి అన్నారు. మండలంలోని కాల్వపల్లి, చిన్నగానిపల్లి గ్రామాల్లో గురువారం ఆయన సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమానికి విచ్చేసిన ఎమ్మెల్యేకు నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, అధికారులు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమాల్లో ఆయన మాట్లాడుతూ సూపర్ సిక్స్ హామీల దిశగా ప్రభుత్వం చిత్తశుద్ధితో ముందుకు వెళుతుందన్నారు. ఇప్పటికే పెన్షన్ల పెంపు, తల్లికి వందనం, ఏడాదికి మూడు సిలిండర్లు అమలు చేశామని, అన్నదాత సుఖీభవ, మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం, ఈ ఏడాదిలోనే ఆడబిడ్డ నిధి కింద 18ఏళ్లు దాటి 60ఏళ్లలోపు మహిళలకు నెలకు రూ.1500, నిరుద్యోగులకు రూ.3వేలు నిరుద్యోగ భృతి ఇవ్వనున్నట్లు చెప్పారు. అధికారం కోల్పోవడంతో జగన్‌రెడ్డికి పిచ్చి పట్టి యాత్ర పేరుతో రోడ్డెక్కి రాద్ధాంతం చేస్తున్నారన్నారు. వైసీపీ పాలనలో ఏమీ చేయలేని వారు. ప్రజా ప్రభుత్వం పనులు చేస్తుంటే బురదజల్లే ప్రయత్నాలు చేస్తున్నారన్నారు. ప్రజలు ఇది గమనించాలన్నారు. ప్రతి గృహానికి వెళ్లి ప్రజల సమస్యలను తెలుసుకున్న ఆయన పరిష్కారం చూపుతామని ప్రజలకు హామీ ఇచ్చారు. కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

రోడ్డుకు రూ.2.80కోట్ల నిధులు మంజూరు

పనులు ప్రారంభించిన ఎరిక్షన్‌బాబు

ఎర్రగొండపాలెం, జూలై 17 (ఆంధ్రజ్యోతి) : ప్రయాణికుల రవాణాకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా రోడ్లను నిర్మిస్తున్నామని టీడీపీ ఇన్‌చార్జి గూడూరి ఎరిక్షన్‌బాబు అన్నారు. రూ.2.80కోట్ల నిధులు మంజూరైన ఎర్రగొండపాలెం-పుల్లలచెరువు ఆర్అండ్‌బీ రోడ్డుకు ఎర్రగొండపాలెంలో 1 కి.మీ వద్ద ఎరిక్షన్‌బాబు భూమి పూజ చేసి, తారు రోడ్డు నిర్మాణ పనులను గురువారం ప్రారంభించారు. గ్రామాలు, పట్టణాల్లో రోడ్లను అభివృద్ధి చేస్తామని చెప్పిన ముఖ్యమంత్రి చంద్రబాబు ఏడాదిలోనే నిధులు మంజూరు చేయించి రోడ్లను నిర్మిస్తున్నారన్నారు. కార్యక్రమంలో టీడీపీ మండలాధ్యక్షుడు చేకూరి సుబ్బారావు, పుల్లలచెరువు మండల అధ్యక్షుడు పయ్యావుల ప్రసాద్, టీడీపీ ముఖ్యనాయకులు శనగా నారాయణరెడ్డి, చిట్యాల వెంగళరెడ్డి, సుబ్బారావు, సుబ్రమణ్యం, సత్యనారాయణగౌడ్, మంత్రునాయక్, మహేష్, షేక్ మస్తాన్ వలి ఆర్అండ్‌బీ ఇంజనీర్‌లు పాల్గొన్నారు.

టీడీపీతోనే సంక్షేమ ఫలాలు

టీడీపీ పాలనలోనే అన్ని వర్గాలలో పేదలకు సంక్షేమ ఫలాలు అందుతాయని ఎరిక్షన్‌బాబు అన్నారు. 24 బూత్ చైతన్యనగర్‌లో సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమంలో భాగంగా ఆయన ఇంటింటికీ వెళ్లి కరపత్రాలను పంపిణీ చేశారు.

కష్టపడి పనిచేసి ప్రభుత్వానికి మంచి పేరు తేవాలి

- నూతనంగా నియమితులైన మార్కెట్ యార్డ్ చైర్మన్లు, డైరెక్టర్లకు అశోక్‌రెడ్డి సూచన
- నియామక పత్రాలు అందించిన ఎమ్మెల్యే




ఎమ్మెల్యే అశోక్‌రెడ్డిని సన్మానిస్తున్న గిద్దలూరు, కంభం మార్కెట్ యార్డ్ చైర్మన్లు, డైరెక్టర్లు

గిద్దలూరు టౌన్, జూలై 17 (ఆంధ్రజ్యోతి) : మార్కెట్‌యార్డు చైర్మన్లుగా, డైరెక్టర్లుగా నియమితులైన ప్రతి ఒక్కరూ ప్రజలకు బాధ్యులుగా ఉంటూ కష్టపడి పని చేసి ప్రభుత్వానికి మంచి పేరు తేవాలని ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి సూచించారు. ఇటీవల గిద్దలూరు, కంభం మార్కెట్‌యార్డు చైర్మన్‌లు, వైస్‌చైర్మన్లు, డైరెక్టర్లుగా నియమితులైన వారికి ఎమ్మెల్యే అశోక్‌రెడ్డి గురువారం నియామకపత్రాలను అందించి వారికి శుభాకాంక్షలు తెలిపారు. ఈసందర్భంగా అశోక్‌రెడ్డి మాట్లాడుతూ ఆయా పరిధిలోని పాలకవర్గాలు రైతుల, పశుపోషకుల సమస్యలను తెలుసుకుంటూ వారికి అండగా ఉండాలని తెలిపారు. ప్రభుత్వం చేసే మంచిని అందించే సంక్షేమ అభివృద్ధి పథకాలను ప్రజలకు తెలియచేస్తూ ప్రజాసమస్యలను కూడా ఎప్పటికప్పుడూ పరిష్కరించి ప్రజల మన్ననలు పొందాలన్నారు. గిద్దలూరు మార్కెట్‌యార్డు చైర్మన్‌గా బైలడుగు బాలయ్యయాదవ్, కంభం మార్కెట్‌యార్డు చైర్మన్‌గా పూనూరు భూపాల్‌రెడ్డి, గిద్దలూరు, కంభం వైస్‌చైర్మన్లుగా గోడి ఓబులరెడ్డి, తోట మహాలక్ష్మి, ఆయా డైరెక్టర్లు ఎమ్మెల్యే అశోక్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలుపుతూ పూలమాల, శాలువలతో సన్మానించారు. ప్రభుత్వానికి, పార్టీకి మంచి పేరు తెస్తామని, నిరంతరం రైతులకు తోడుగా ఉంటామని వారు పేర్కొన్నారు. కార్యక్రమంలో జడ్పీటీసీ సభ్యుడు బుడత మధుసూదన్, నాయకులు పాల్గొన్నారు.

ఫసల్ బీమా పథకాన్ని వినియోగించుకోవాలి

గిద్దలూరు, జూలై 17 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పొదలకొండపల్లి, నరవ గ్రామాలలో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. వ్యవసాయాధికారి ఎం.విజయభాస్కర్‌రెడ్డి రైతులను ఉద్దేశించి మాట్లాడుతూ ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన పథకం కింద రైతులు వారు సాగు చేసుకున్న పంటకు రైతు వాటా ప్రీమియం చెల్లించాలని కోరారు. వరి పంటకు మినహా మిగతా పంటలకు నెలాఖరులోగా ప్రీమియం చెల్లించాలని, వరిపంటకు మాత్రం ఆగస్టు 15వ తేదీ వరకు సమయం ఉందని పేర్కొన్నారు. కౌలు రైతులకు పంట సాగు హక్కు పత్రాలు ఇస్తున్న దృష్ట్యా కౌలు రౌతులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని సూచించారు. భూసార పరీక్షలు - ఉపయోగాలు, పచ్చిరొట్ట పైర్ల పెంపకం - ఉపయోగాల గురించి రైతులకు వివరించారు. కార్యక్రమంలో పొదలకొండపల్లి సర్పంచ్ రాజగోపాల్, గ్రామవ్యవసాయ సహాయకులు కల్యాణి, శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.

సొసైటీ బ్యాంక్ చైర్మన్‌గా బాలీశ్వరయ్య బాధ్యతల స్వీకరణ



బాధ్యతలు స్వీకరిస్తున్న బాలీశ్వరయ్య

గిద్దలూరు టౌన్, జూలై 17 (ఆంధ్రజ్యోతి): సొసైటీ బ్యాంక్ చైర్మన్‌గా ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి సూచన మేరకు నియమితులైన టీడీపీ నాయకులు దుత్తా బాలీశ్వరయ్య గురువారం బాధ్యతలు స్వీకరించారు. త్రీమేన్ కమిటీ సభ్యులు బద్రి గోపాల్‌రెడ్డి, చల్లగాళ్ళ ఆనందరావు బాధ్యతలు స్వీకరించారు. అనంతరం బాలీశ్వరయ్య ఎమ్మెల్యే అశోక్‌రెడ్డిని కలి సి కృతజ్ఞతలు తెలుపుతూ పూలమాలు, శాలువలతో సన్మానించారు. అ నంతరం ఎమ్మెల్యే అశోక్‌రెడ్డికి నోటుపుస్తకాలు, పెన్నులు, పెన్సిళ్ళు, బాక్స్‌లను అందచేశారు. ఈసందర్భంగా బాలీశ్వరయ్యను ఎమ్మెల్యే అశోక్‌రెడ్డి అభినందించి శుభాకాంక్షలు తెలిపారు.

సొసైటీ అధ్యక్షుడిగా బట్టు ప్రమాణం

పెద్దదోర్నాల : ప్రాథమిక వ్యవసాయ సహకార సొసైటీ అధ్యక్షుడిగా బట్టు సుధాకర్‌రెడ్డి గురువారం ప్రమాణ స్వీకారం చేశారు. అదేవిధంగా సోమేపల్లి శేఖర్, సొసైటీ సభ్యుడిగా ప్రమాణ స్వీకారం చేశారు. ఈ క్రమంలో సీఈవో గురవారెడ్డి, సిబ్బంది కాశీమణి, టీడీపీ నాయకులు షేక్ మాబు, దొడ్డా శేషాద్రి, చంటి, చల్లా వెంకటేశ్వర్లు, జంగిలి పిచ్చయ్య, బీజేపీ మాజీ మండలాధ్యక్షుడు గండి వీరారెడ్డి బట్టు విద్యా సంస్థల అదినేత బట్టు రమణారెడ్డి పాల్గొని వారిని సన్మానించారు.

పురమిత్ర యాప్‌ను సద్వినియోగం చేసుకోవాలి

కనిగిరి, జూలై 17(ఆంధ్రజ్యోతి): పురమిత్ర యాప్‌ను ప్రతిఒక్కరూ తమ సెల్‌ఫోన్‌లో పొందుపరచు కుని సద్వినియోగం చేసుకోవాలని మున్సిపల్ కమిషనర్ కృష్ణమోహన్‌రెడ్డి అన్నారు. స్థానిక ఎంఎఎస్‌ఎం కళాశాలలో గురువారం విద్యార్థులకు పురమిత్ర యాప్‌పై అవగాహన కల్పించారు. ఈసందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ పురమిత్ర యాప్ ద్వారా 150 రకాల పౌర సేవలు పొందవచ్చునని చెప్పారు. ఇంటి పన్ను, నీటి పన్ను, ట్రేడ్ లైసెన్స్ వంటి సేవలు పొంది విలువైన సమయాన్ని ఆదా చేసుకోవచ్చునని చెప్పారు. విద్యార్థులు తమ కుటుంబసభ్యులతో పాటు సహచరులకు, స్నేహితులకు అవగాహన కల్పించాలని కోరారు. కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ ఏలూరి నరేంద్ర, ప్రిన్సిపాల్ ముజీబ్ తదితరులు పాల్గొన్నారు.

జాబ్ మేళాలో పలువురు ఎంపిక

దొనకొండ, జూలై 17(ఆంధ్రజ్యోతి): గౌతమీ విద్యా సంస్థల అధినేత గుండారెడ్డి నేతృత్వంలో దర్శిలో 30 ప్రముఖ కంపెనీల ప్రతినిధులతో నిర్వహించిన మేగా జాబ్‌మేళాలో దొనకొండకు చెందిన ఆరుగురు ఎయిర్‌పోర్టులో టెక్నీషియన్స్‌గా ఎంపికయ్యారు. దొనకొండ గౌతమీ డిగ్రీ కాలేజీలో డిగ్రీ పూర్తిచేసిన కె .రేవంత్, పి.ఇస్సాక్, వై.నతన్, ఎం.ఉదయ్‌కిరణ్, జి.నర్సింహరాజు, ఎస్.సువర్ణలు జాబ్ మేళాలో ఎంపికయ్యారు. జీఎంఆర్ ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్టు వారు నిర్వహించిన ఇంటర్వ్యూల్లో టెక్నీషియన్స్‌గా ఎంపికయ్యారు. వీరికి నెలకు రూ.25వేలు వేతనం ఉంటుందని కాలేజీ అడ్మిన్ ఎఫ్రాయిమ్(నాని) పేర్కొన్నారు. వీరిని చైర్మన్ గుండారెడ్డి, డైరెక్టర్ నాగేంద్రబాబు, ప్రిన్సిపాల్ యు.రవి, ప్లేస్‌మెంట్ అధికారి డి.రాజశేఖర్‌రెడ్డి అభినందించారు.

ప్రజలపై విద్యుత్ భారాలు మోపొద్దు!

ముండ్లమూరు, జూలై 17(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో విద్యుత్ స్మార్ట్ మీటర్లు పెట్టి ప్రజలపై భారాలు మోపటం అన్యాయమని సీపీఎం జిల్లా కార్యవర్గసభ్యుడు కంకణాల ఆంజనేయులు అన్నారు. గురువారం ముండ్లమూరులో పంటా ఏడుకొండలు అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వం తగిన విధంగా స్పందించక పోతే పోరాటం ఉధృతం చేస్తామన్నారు. సమావేశంలో సీపీఎం నాయకులు వెల్లంపల్లి ఆంజనేయులు, గాలి వెంకటేశ్వర్లు, బి.రాజారమేష్ పాల్గొన్నారు.

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలి

పామూరు, జూలై 17(ఆంధ్రజ్యోతి): దోమ కాటుతో అనేక వ్యాధులు వస్తాయని డాక్టర్ రవళి ప్రియాంక తెలిపారు. స్థానిక కేజీబీవీ పాఠశాలలో జాతీయ డెంగ్యూ మాసోత్సవం సందర్భంగా గురువారం సబ్‌యూనిట్ అధికారి రామాంజనేయులు అధ్యక్షతన అవగాహన కార్యక్రమం నిర్వహించారు. డాక్టర్ రవళి మాట్లాడుతూ ఇంటి పరిసరాలలో నీటి నిల్వలు ఉన్నట్లయితే దోమలు వ్యాప్తి చెందుతాయన్నారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకున్నట్లయితే వ్యాధులు దరిచేరవన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ కటకం సజన, తదితరులు పాల్గొన్నారు. అనంతరం గ్రామంలో ర్యాలీ నిర్వహించారు.

భక్తిశ్రద్ధలతో ఆరాధన వేడుకలు

సీఎస్‌పురం(పామూరు), జూలై 17(ఆంధ్రజ్యోతి): సీఎస్‌పురం మండలంలోని మిట్టపాలెం శ్రీ నారాయణస్వామి దేవస్థాన ఆరాధన వేడుకలను గురువారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామివారి మూల విరాట్‌కు అభిషేకాలు, హోమాలు తదితర కార్యక్రమాలు నిర్వహించారు. దేవస్థాన మాజీ చైర్మన్ స్వర్గీయ కొమ్మినేని ఆదినారాయణ కుటుంబసభ్యులు స్వామివార్లకు మహానైవేద్యం సమర్పించారు. దేవస్థానం ఆధ్వర్యంలో భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. రాత్రి గ్రామోత్సవం నిర్వహించారు. కార్యక్రమాల్లో వ్యవస్థాపక ధర్మకర్త కొమ్మినేని చిన్న ఆదినారాయణ, ఈవో నరసింహబాబు, తదితరులు పాల్గొన్నారు.

ఎయిడెడ్ ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించాలి

వెలిగండ్ల, జూలై 17(ఆంధ్రజ్యోతి): ఎయిడెడ్ పాఠశాలల్లో కారుణ్య నియామకాలు చేపట్టాలని, ఉపాధ్యాయులకు హెల్త్ కార్డులు ఇవ్వాలని ఏపీటీఎఫ్ జిల్లా కార్యదర్శి షేక్ నాయబ్ రసూల్ డిమాండ్ చేశారు. గురువారం వెలిగండ్ల మండలంలో ఆంధ్రప్రదేశ్ టీచర్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో సభ్యత్వ నమోదు కార్యక్రమం చేపట్టారు. కార్యక్రమంలో ఆసంఘం మండల అధ్యక్షుడు ఎస్.రమేష్, ప్రధాన కార్యదర్శి షేక్ హుస్సేన్, తదితరులు పాల్గొన్నారు.

గృహహింస కేసు నమోదు

వెలిగండ్ల, జూలై 17(ఆంధ్రజ్యోతి): నలుగురిపై గృహహింస కేసు నమోదైన ఘటన వెలిగండ్లలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. వెలిగండ్ల గ్రామానికి చెందిన ఓ యువతిని రంగారెడ్డి జిల్లా నార్సింగి పట్టణానికి చెందిన వస్త్రాల వ్యాపారి చిట్టి వెంకటనారయణ కుమారుడు చిట్టి వెంకట మురళీకృష్ణతో 2023లో వివాహమైంది. వివాహం జరిగిన వారం నుంచి అదనపు కట్నం కావలంటూ భర్త, అత్తామామ, ఆడపడుచు చిత్రహింసలకు గురిచేస్తున్నారని యువతి ఫిర్యాదులో పేర్కొంది. భర్త మురళీకృష్ణ, అత్తామామ వెంకటనారయణ, రమణమ్మ, ఆడపడుచు సురేఖపై గృహహింస కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ కృష్ణపావని తెలిపారు.

ప్రజాసంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

» మంత్రి ఆనం రాంనారాయణరెడ్డి



లబ్ధిదారులకు సీఎంఆర్‌ఎఫ్ చెక్కులు పంపిణీ చేసి మాట్లాడుతున్న మంత్రి ఆనం, పక్కన ఎమ్మెల్యే ఉగ్ర

కనిగిరి, జూలై 17(ఆంధ్రజ్యోతి): ప్రజాసంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని రాష్ట్ర దేవదాయ శాఖమంత్రి ఆనం రాంనారాయణరెడ్డి అన్నారు. గురువారం కనిగిరిలో పలు అభివృద్ధి కార్యక్రమాలను మంత్రి ప్రారంభించారు. తొలుత స్థానిక అమరావతి గ్రౌండ్స్‌లో ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్రనరసింహారెడ్డితో కలసి సీఎంఆర్‌ఎఫ్ కింద 38 మంది లబ్ధిదారులకు రూ24.26లక్షల చెక్కులు పంపిణీ చేశారు.

అనంతరం పట్టణంలోని 16, 17 వార్డుల్లో ఏడాది సుపరిపాలన కార్యక్రమం సందర్భంగా సుగుణావతమ్మ సెంటర్, నగరికంటి బసవయ్య సెంటర్‌లోని వివిధ వ్యాపారవర్గాలతో మంత్రి ఆనం రాంనారాయణరెడ్డి మాట్లాడారు. ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను వివరించారు. ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా అమలుచేస్తున్న ఘనత చంద్రబాబుదేనని అన్నారు. అధికారం కోల్పోయిన వైసీపీ నేతలు రాష్ట్రంలో అరాచకాలను సృష్టించి పబ్బం గడుపుకోవాలని చూస్తున్నారన్నారు. వాటిని ప్రజలు త్రిప్పి కొట్టాలని పిలుపునిచ్చారు.

కార్యక్రమంలో ఆర్డీవో కేశవర్ధన్‌రెడ్డి, డీఎస్పీ సాయి ఈశ్వర్ యశ్వంత్, తహసీ ల్దార్ రవిశంకర్, మున్సిపల్ కమిషనర్ కృష్ణమోహన్ రెడ్డి, టీడీపీ మండల కన్వీనర్ పిచ్చాల శ్రీనివాసు లురెడ్డి, పట్టణా ధ్యక్షుడు తమ్మినేని శ్రీనివాసులురెడ్డి, హెచ్‌ఎంపాడు అధ్యక్షుడు సానికొమ్ము తిరుపతిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

దేవాలయ షాపింగ్ కాంప్లెక్స్‌కు శంకుస్థాపన

నగరికంటి బసవయ్య సెంటర్ వద్ద ఉన్న విజయ మార్తేండేశ్వరస్వామి దేవస్థానానికి సంబంధించిన స్థలంలో షాపింగ్ కాంప్లెక్స్‌కు గురువారం మంత్రి ఆనం రామనారాయణరెడ్డి ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్రతో కలసి శంకుస్థాపన చేశారు. వేద పండితులు పూర్ణకుంభంతో మంత్రికి స్వాగతం పలికారు. తొలుత మార్తేండేశ్వరస్వామి విగ్రహానికి పూజలు చేశారు. ఈసందర్భంగా దేవాలయ ఈవో శ్రీగిరిరాజు మంత్రి ఆనం, ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్రను సత్కరించారు. కార్యక్రమంలో పర్యవేక్షకులు మారుతి, కోటా సురేష్, వీఆర్ మనోహరరావు, దేవస్థాన మాజీ అధ్యక్షుడు గోంట్ల మల్లికార్జున తదితరులు పాల్గొన్నారు. అనంతరం పట్టణ సమీపంలోని గార్లపేట రోడ్డులో మోడల్ స్కూల్‌కు వెళ్లేందుకు కోటి రూపాయలతో చేపడుతున్న రోడ్డుకు ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్రనరసింహారెడ్డితో కలసి మంత్రి శంకుస్థాపన చేసి శిలాఫలకాన్ని ఆవిష్కరించారు.

పామూరులో సన్మానం

పామూరు, జూలై 17 (ఆంధ్రజ్యోతి): కనిగిరి పర్యటన ముగించుకొని నెల్లూరు వెళుతున్న మంత్రి ఆనం రాంనారాయణరెడ్డిని, ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్ర నరసింహారెడ్డిని గురువారం పామూరులో గజమాలతో సత్కరించారు. సత్కరించినవారిలో టీడీపీ మండల అధ్యక్షుడు పువ్వాడి వెంకటేశ్వర్లు, ఆకుపాటి వెంకటేష్, ఉప్పలపాటి హరిబాబు, అడుసుమల్లి ప్రభాకర్‌చౌదరి, తదితరులు ఉన్నారు. ఈసందర్భంగా దేవస్థా భూములు అన్యాక్రాంతం కాకుండా చర్యలు తీసుకోవాలని బీజేపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ కేవీ రమణయ్య మంత్రికి వినతిపత్రం అందజేశారు. కాగా, ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడి నెల్లూరులో వైద్యం అనంతరం ఇంటివద్ద విశ్రాంతి తీసుకొంటున్న టీడీపీ పట్టణ ఉపాధ్యక్షుడు ఇర్రి కోటిరెడ్డిని ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్ర పరామర్శించారు.

యథేచ్ఛగా కుంటభూమి ఆక్రమణ

» పొలాలకు వెళ్లేందుకు రోడ్డు నిర్మాణం

» చోద్యం చూస్తున్న అధికారులు



దర్శి-పొదిలి మార్గంలో కుంట పోరంబోకు భూమిని ఆక్రమించి వేస్తున్న రోడ్డు

దర్శి, జూలై 17(ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వ అధికారంలోకి వచ్చిన తర్వాత కూడా ప్రభుత్వ భూము తలు, స్థలాల ఆక్రమణలపర్వం కొనసాగుతూనే ఉంది. కొంతమంది అక్రమార్కులు ప్రభుత్వ స్థలాలను కబ్జా చేస్తూనే ఉన్నారు. ప్రభుత్వ భూములను సంరక్షించాల్సిన అధికారులు చోద్యం చూస్తున్నారు. తాజాగా దర్శి-పొదిలి రోడ్డులోని కుంట భూమిని కొంతమంది ఆక్రమించి ఎగువన ఉన్న తమ పొలాలకు రోడ్డు వేసుకుంటున్నారు. కుంట భూమిలో ఎక్స్‌కవేటర్లు, టిప్పర్లతో నిర్మాణ పనులు చేస్తున్నారు.

ఈ కుంట భూమి వివాదం ఎంతోకాలంగా కొనసాగుతోంది. గతంలో కొంతమంది ఎస్టీలు తాము సాగు చేసుకుంటున్నామని, ఆతర్వాత తమ వారసుల ద్వారా తమకే చెందుతుందని మరికొందరు వాదలాడుకుంటూ రెండేళ్ల క్రితం గోడవపడ్డారు. దర్శి-పొదిలి రోడ్డు ఆనుకొని ఉన్న ఈ కుంట భూమికి విలువ పెరగటంతో తాజాగా మరికొంతమంది అక్రమార్కులకు ఈ భూమిపై కన్ను పడింది. దర్శి రెవెన్యూలోని 1071 సర్వే నెంబర్‌లో 6.5 ఎకరాల కుంటభూమి ఉంది. ప్రస్తుతం అక్కడ ఎకరం భూమి కోటి రూపాయల విలువ ఉంది. ఇప్పటికే కొంత భూమిని కొందరు ఆక్రమణదారులు స్వాహా చేసి వాడుకుంటున్నారు. ఇటీవల కాలంలో కొంతమంది కుంట కట్టను కూడా తొలగించి ఆక్రమించుకునే ప్రయత్నం చేశారు. ఆసమయంలో ఆంధ్రజ్యోతి వరుస కథనాలు ప్రచురించటంతో ఆక్రమణ పర్వం ఆగింది. తాజాగా కొంతమంది ఆక్రమణ దారులు కుంటభూమిని ఆక్రమించి రోడ్డు వేస్తున్నారు. ఈ విషయంపై తహసీల్దార్ ఎం.శ్రావణ్‌కుమార్‌ను ఆంధ్రజ్యోతి వివరణ కోరగా ప్రభుత్వ భూములను ఆక్రమణలకు గురికాకుండా పరిరక్షిస్తామన్నారు. వెంటనే కుంట భూమిలో రోడ్డు నిర్మాణాన్ని నిలిపి వేయిస్తామన్నారు.

ప్రజాసమస్యల పరిష్కారమే లక్ష్యం

» టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి

» తొమ్మిది పంచాయతీలకు ట్రాక్టర్లు, ఏడుగురికి సీఎం సహాయ నిధి చెక్కుల పంపిణీ



ప్రజాదర్బార్‌లో అర్జీలు స్వీకరిస్తున్న డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి

ముండ్లమూరు, జూలై 17 (ఆంధ్రజ్యోతి): ప్రజాసమస్యల పరిష్కారమే ప్రభుత్వ లక్ష్యమని టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి అన్నారు. గురు వారం తహసీల్దార్ కార్యాలయం ఆవరణలో జరిగిన ప్రజాదర్బార్‌లో ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ అర్జీలను తక్షణమే పరిష్కరించాలని ఆయా శాఖలకు సూచించారు. ఒకే సమస్యపై కార్యాలయాల చుట్టూ పదేపదే తిప్పుకోవద్దన్నారు. మండల స్థాయిలో పరిష్కారం కాని సమస్యను తమ దృష్టికి తెచ్చినట్లయితే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు కృషి చేస్తానన్నారు.

ప్రధానంగా రెవెన్యూపరమైన సమస్యలతో పాటు విద్యుత్, హౌసింగ్ సమస్యలు ఎక్కువగా ప్రజల నుంచి అర్జీలు వచ్చినట్టు డాక్టర్ లక్ష్మి తెలిపారు. ఈ సమస్యలను నిర్ణీత గడువులో పరిష్కరించాలన్నారు. ప్రజా దర్బార్ ప్రధాన ముఖ్య ఉద్దేశం కూడా గ్రామాల్లో ప్రజలకు ఉన్న సమస్యలను ప్రధానంగా పరిష్కరిస్తారన్న నమ్మకం కలిగించటం కోసం వారు పడుతున్న ఇబ్బందులు తెలుసుకోవటం కోసమే ఇలాంటి దర్బార్‌లు నిర్వహించటం జరుగుతుందన్నారు. ఆయా శాఖల వారీగా అర్జీలు స్వీకరించి ఆయా అధికారులతో సమీక్ష నిర్వహించారు.

స్వచ్ఛాంధ్ర, స్వచ్ఛ భారత్ కార్యక్రమంలో భాగంగా ముండ్లమూరు, పసుపుగల్లు, పెద ఉల్లగల్లు, కెల్లంపల్లి, మారెళ్ళ, నాయుడుపాలెం, ఉమామహేశ్వర అగ్రహారం, ఈదర, వేముల గ్రామ పంచాయతీలకు ట్రాక్టర్లను అందజేశారు. మరో మూడు గ్రామాలకు డ్రోన్‌లు అందజేశారు. వ్యవసాయ శాఖ ద్వారా రైతులకు కందులు అందజేశారు. ఉపాధి హామీ కార్యాలయం ఎదుట మొక్కలు నాటారు.

కార్యక్రమంలో టీడీపీ నియోజకవర్గ నాయకుడు డాక్టర్ లలిత్‌సాగర్, తహసీల్దార్ ఎల్.లక్ష్మీనారాయణ, దర్శి మార్కెట్ యార్డు చైర్మన్ దారం నాగవేణి సుబ్బా రావు, టీడీపీ మండల అధ్యక్షుడు కూరపాటి శ్రీనివాస రావు, మార్కెట్ యార్డు వైస్‌చైర్మన్ కోడెగ మస్తాన్ రావు, సర్పంచ్‌లు ఒద్దిపోగు ఆదిలక్ష్మి, కూరపాటి నారాయణ స్వామి, సొసైటీ అధ్యక్షులు శ్రీనివాసరెడ్డి, గుంటుపల్లి రంగనాయకులు, తదితరులు పాల్గొన్నారు.

ఇంటింటికి సంక్షేమ ఫలాలు

ముండ్లమూరు, జూలై 17 (ఆంధ్రజ్యోతి): ప్రతి ఇంటికి సంక్షేమ, అభివృద్ధి ఫలాలు అందించటమే ప్రభుత్వ ధ్యేయమని టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి అన్నారు. గురువారం సాయం త్రం మండలంలోని వేముల, కమ్మవారిపాలెం, రాజగోపాల్‌రెడ్డి నగర్ గ్రామాల్లో జరిగిన సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. ఇంటింటికి తిరిగి ఏడాది కాలంలో పేదలకు అందించిన సంక్షేమ ఫలాలు, అభివృద్ధి ఫలాలకు సంబంధించిన కరపత్రాలను అందజేశారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ రానున్న నాలుగు సంవత్సరాల్లో గ్రామాలకు అత్యధిక నిధులు కేటాయించి మౌలికవసతులు సమకూర్చుస్తా మన్నారు.

కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ దారం నాగవేణి సుబ్బారావు, డాక్టర్ కడియాల లలిత్‌సాగర్, టీడీపీ మండల అధ్యక్షుడు కూరపాటి శ్రీనివాసరావు, సర్పంచ్ గజ్జల ఆదెమ్మ తదితరులు పాల్గొన్నారు.

అసౌకర్యాల్లో గురుకులం

» దుర్గంధంతో విద్యార్థుల అవస్థలు

» అస్తవ్యస్తంగా డ్రైనేజీ

» అరకొరగా నీరు

» పట్టించుకోని అధికారులు



కురిచేడులోని గురుకుల పాఠశాల

కురిచేడు, జూలై 17(ఆంధ్రజ్యోతి): కురిచేడులోని సాంఘిక సంక్షేమ శాఖ గురుకుల పాఠశాల అసౌకర్యాల్లో కొట్టుమిట్టాడుతున్నది. విద్యార్థులకు కనీస సౌకర్యాలు కూడా లేకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అపరిశుభ్రమైన టాయిలెట్లు, పూర్తిగా రాని నీటితో పడరాని పాట్లు పడుతున్నారు. డ్రైనేజి పొంగి పొర్లుతుండటంతో విద్యార్థులు ముక్కు మూసుకుని బయటకు వెళ్ళేలా చేస్తున్నది. భవన నిర్మాణ లోపాలు వారిని సమస్యలకు గురి చేస్తున్నాయి.

సాంఘిక సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో కురిచేడులో అంబేడ్కర్ గురుకుల పాఠశాలను ఏర్పాటుచేశారు. 5వ తరగతి నుంచి ఇంటర్మీడియట్ వరకు విద్యాభ్యాసం జరిగేలా నిర్మాణం జరిపారు. ప్రస్తుతం 5 నుంచి 10 తరగతి వరకు 460 మంది విద్యార్థులు ఉన్నారు. వారందరికి సరిపడా నీటి వసతి లేదు. రెండు బోర్ల ద్వారా పూర్తి స్థాయి నీరు రావడం లేదు. ఓవర్ హెడ్ ట్యాంకు నుంచి ఏర్పాటుచేసిన పైప్ లైన్ నాసిరకంగా ఉండటంతో నిత్యం మరమ్మతులకు గురవుతుంది. నీటి పంపిణీ సక్రమంగా జరుగడం లేదు. టాయిలెట్ల నుంచి వచ్చే వ్యర్థాలు, విద్యార్థులు స్నానాలు చేసిన నీరు ఒకే పైప్ ద్వారా భూమిలోకి పంపేలా ఏర్పాట్లు చేశారు. 460 మంది స్నానాలు చేసి, బట్టలు ఉతికిన నీరు మొత్తం భూమిలోకి ఇంకాలంటే సాధ్యమయ్యే అవకాశం ఉందా? ఆ నీటిని బయట కాలువలోకి పంపేలా ఏర్పాట్లు చేయకుండా వాటిని కూడా టాయిలెట్ వ్యర్థాలతో కలిపి భూమిలోని గుంతలలోకి వెళ్ళే ఏర్పాటుచేశారు. అవి నిండి టాయిలెట్ల నుంచి వ్యర్థాలు బయటకు వస్తున్నాయి. దీంతో విద్యార్థులు వాటిని వినియోగించుకోలేకపోతున్నారు. ఆమార్గంలో గదుల్లోకి వెళ్ళాలంటే వాంతులు వచ్చే పరిస్థితి నెలకొంది. గత సోమవారం రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖామంత్రి ఆ టాయిలెట్లు చూసి సిబ్బందిని మందలించాడు. టాయిలెట్లలోకి సరిపడా నీరు కూడా రావడం లేదని విద్యార్థులు మంత్రి ముందు వాపోయారు. రోజుకు ఒక్కసారే స్నానాలు చేస్తున్నట్లు చాలామంది చెప్పారు. దీంతో మంత్రి సిబ్బందిపై సీరియస్ అయ్యారు.



నీరు రాని బోరు

దీనికితోడు పాఠశాలలో 5 నుంచి 7వ తరగతి వరకు బోధించే హిందీ ఉపాధ్యాయుడు, 8 నుంచి 10వ తరగతి వరకు బోధించే తెలుగు ఉపాధ్యాయుల కొరత ఉంది. ఇప్పటివరకు ఆయా సబ్జెక్టులకు ఉపాధ్యాయులను నియమించకపోవడంతో విద్యార్థులకు పాఠాలు జరగడంలేదు. ఇన్ని సమస్యలతో కరిచేడు గురుకుల పాఠశాల విద్యార్థులు అవస్థలు పడుతున్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి విద్యార్థుల సమస్యలను పరిష్కరించాలని తల్లిదండ్రులు కోరుతున్నారు.



దర్శి పట్టణ వ్యూ

అమృత్ పథకం అమలుకు శ్రీకారం

» రూ.130.60 కోట్ల పనులకు టెండర్లు

దర్శి, జూలై 17(ఆంధ్రజ్యోతి): దర్శి మున్సిపాలిటీ ప్రజలు ఎంతోకాలంగా ఎదురుచూస్తున్న అమృత్ పథకం అమలుకు ఎట్టకేలకు అధికారులు శ్రీకారం చుట్టారు. కొద్దిరోజుల క్రితం రూ.130.60 కోట్ల పనులకు టెండర్లు పిలిచారు. టెండర్లు ఖరారైన తర్వాత పనులు ప్రారంభించే అవకాశం ఉంది. గతంలో వైసీపీ ప్రభుత్వ హయాంలో అమృత్ పథకానికి రూ.121 కోట్లు మంజూరైన విషయం తెలిసిందే. వైసీపీ పాలకులు ఈ పథకం అమలు గురించి పట్టించుకోపోవటంతో మూడేళ్ళ కాలం వృథా అయింది.

టీడీపీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత పాత టెండర్లు రద్దు చేశారు. కొత్త అంచనాలతో రూ.130.60 కోట్ల పనులకు టెండర్లు పిలిచారు. ఈ టెండర్లు రీజనల్ స్థాయిలో పిలిచారు. చిత్తూరు, నెల్లూరు, ప్రకాశం జిల్లాకు సంబంధించిన పట్టణాల్లో అమృత్ పథకం ద్వారా విడుదలైన నిధుల పనులు నిర్వహణకు మొత్తం కలిపి ఒకే టెండర్లు పిలిచినట్లు మున్సిపల్ ఈఈ శ్రీనివాస సంజీవ్ తెలిపారు. ఈనెల 30న టెండర్లు ఓపన్ చేస్తారు. దాఖలైన టెండర్లు పరిశీలించి నిబంధనలకు అనుగుణంగా ఉన్న వాటిని ప్రభుత్వానికి నివేదిస్తారు. మంత్రివర్గం సమీక్షించి టెండర్లు ఖరారు చేస్తుందని ఆయన వివరించారు.

ఈ పథకం అమల్లోకి వస్తే దర్శి మున్సిపాలిటీలోని 40 వేల మందిని స్వచ్ఛమైన మంచినీరు అందించే అవకాశం ఉంటుంది. సాగర్ కాలువ నుంచి గ్రావిటీ ద్వారా దర్శి మున్సిపాలిటీని ఆనుకొని ఉన్న ముండ్లమూరు మండలం పులిపాడు చెరువుకు నీరు నింపుతారు. అక్కడ నుంచి పైప్‌లైన్ ద్వారా కొళాయిలకు నీరు సరఫరా చేస్తారు. ఇంటింటికి కొళాయిలు ఏర్పాటుచేసి మున్సిపాలిటీ ద్వారా అందరికీ మంచినీరు అందిస్తారు. రోజుకు 13 మిలియన్ లీటర్లనీరు సరఫరా చేసే సామర్థ్యం కల్గి ఉండేలా పథకాన్ని రూపొందించారు. పెరుగుతున్న జనాభాను దృష్టిలో ఉంచుకొని 30 సంవత్సరాల కొరకు పెరిగిన జనాభాకు సరిపోయేలా ఈపథకాన్ని అమలు చేస్తారు. ఎంతోకాలంగా అమలుకు నోచుకోని అమృత్ పథకం టెండర్లు పిలవటంతో దర్శి పట్టణ ప్రజలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

మధ్యాహ్న భోజనం రుచికరంగా ఉండాలి

దొనకొండ, జూలై 17(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకునే విద్యార్థులకు ప్రభుత్వం డొక్కా సీతమ్మ పేరుతో అందించే మధ్యాహ్న భోజనం నాణ్యత, రుచికరంగా విద్యార్థుల ఆకలి తీర్చేలా ఉండాలని ఎంఈవో సాంబశివరావు స్పష్టం చేశారు. దొనకొండ బ్రహ్మారావుపేటలోని మోడల్ ప్రైమరీ పాఠశాలలో గురువారం మధ్యాహ్న భోజనంను పరిశీలించారు. సన్నబియ్యంతో వండే అన్నం ఏవిధంగా ఉందని, కూరలు రుచికరంగా ఉన్నాయా, తగినంత అన్నం పెడుతున్నారా అని విద్యార్థులను ప్రశ్నించారు. వారి సమాధానం తెలుసుకొని సంతృప్తి వ్యక్తం చేశారు. పాఠశాలలో మొత్తం వంద మంది విద్యార్థులకు గాను వంద మంది క్రమశిక్షణతో కూర్చొని తృప్తిగా భోజనం చేస్తుండటం గుర్తించారు. రికార్డులు నిర్వాహణ, పరిసరాల పరిశుభ్రతను తనిఖీ చేసి పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు లక్ష్మీభాయి పనితీరును అభినందించారు.

ఉపాధ్యాయులను నియమించాలి

పామూరు, జూలై 17(ఆంధ్రజ్యోతి): మండలంలోని కంభాలదిన్నె గ్రామంలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయులు లేక విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని టీడీపీ గ్రామ అధ్యక్షుడు మన్నం రమణయ్య అన్నారు. వెంటనే ఉపాధ్యాయులను నియమించాలని ఎంఈవోలకు వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ పాఠశాలలో 45 మంది విద్యార్థులు ఉన్నారన్నారు. కౌన్సెలింగ్‌లో ఉపాధ్యాయులు బదలీకాగా, వారి స్థానంలో ఎవరూ రాలేదన్నారు. ఇందుకుసంబంధించి ఎంపీడీవో ఎల్.బ్రహ్మయ్యకు బుధవారం మోపాడు ప్రాజెక్టు సూపర్‌చైర్మన్ చుంచుకొండయ్య ఫిర్యాదు చేశారు. అధికారుల ఆదేశాల మేరకు ఎంఈవోలు కె.కరుణకుమారి, కోటిరెడ్డిలు గురువారం పాఠశాలలను సందర్శించారు. విద్యాశాఖ జిల్లా ఉనతాధికారుల దృష్టికి తీసుకెళ్లి సమస్యను పరిష్కరిస్తామన్నారు.

ఈవోపీఆర్డీగా వేణుగోపాల్‌రెడ్డి బాధ్యతల స్వీకరణ

పీసీపల్లి, జూలై 17(ఆంధ్రజ్యోతి): పీసీపల్లి ఈవోపీఆర్డీగా వేణుగోపాల్ రెడ్డి గురువారం బాధ్యతలు చేపట్టారు. మద్దిపాడు మండల పరిషత్ కార్యాలయంలో పనిచేస్తూ పదోన్నతిపై పీసీపల్లి ఈవోపీఆర్డీగా నియమితులయ్యారు.

మోకాళ్లపై కార్మికుల నిరసన



మోకాళ్లపై కూర్చొని నిరసన తెలుపుతున్న పారిశుధ్య కార్మికులు


కనిగిరి, జూలై 17(ఆంధ్రజ్యోతి): తమ సమస్యలను పరిష్కరించాలంటూ పారిశుధ్య కార్మికులు చేపట్టిన సమ్మెలో భాగంగా గురువారం మోకాళ్లపై కూర్చొని నిరసన వ్యక్తం చేశారు. ఈసందర్భంగా సీఐటీయూ జిల్లా నాయకుడే పీసీ కేశవరావు మాట్లాడుతూ తమ సమస్యల పరిష్కారం కోసం కార్మికులు సమ్మె చేస్తుండగా ప్రభుత్వాలకు చీమ కుట్టినట్లయినా లేదన్నారు. మున్సిపాల్టీలో ఉన్న జనాభాకు తగ్గట్టుగా అదనపు సిబ్బందిని నియమించకుండా ఉన్న సిబ్బందితో వెట్టి చాకిరి చేయిస్తున్నారని ఆరోపించారు. పారిశుధ్య సిబ్బందికి పనిముట్లు ఇవ్వకుండా ఇబ్బందులకు గురి చేస్తున్నారన్నారు. విధి నిర్వహణలో ఉన్న కార్మికులు చనిపోతే వారి కుటుంబసభ్యులకు ఉపాధి కల్పించాలన్నారు. పీఎఫ్ సమస్యను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నాయకులు చార్లెస్, లక్ష్మయ్య, ప్రసాద్, నరేంద్ర తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఐదుగురికి గాయాలు

ముండ్లమూరు, జూలై 17 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పసుపుగల్లులోని ఠాగూర్ విద్యానికేతన్ ఎదురుగా గురువారం రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొట్టడంతో ఐదుగురికి గాయాలయ్యాయి. నాగులప్పలపాడు మండలం రాపర్ల గ్రామానికి చెందిన ఏకసిరి దుర్గయ్య తన మనుమరాలు వెంకటేశ్వరి, పల్నాడు జిల్లా నూజెండ్ల మండలం జేసీ నగర్ గ్రామానికి చెందిన లక్ష్మయ్య ద్విచక్ర వాహనం పై వినుకొండ వైపు వెళ్తున్నారు. ఈసమయంలో మండలంలోని కమ్మవారిపాలెం గ్రామానికి చెందిన నాగినేని శ్రీను తన భార్య సుబ్బాయమ్మతో తిమ్మాయపాలెం వెళుతున్నారు. లక్ష్మయ్య వాహనం ఎదురుగా వచ్చి శ్రీను వాహనాన్ని ఢీకొట్టింది. దీంతో రెండు వాహనాలపై ప్రయాణిస్తున్న ఐదుగురికి గాయాలయ్యాయి.

టీడీపీలో 20 కుటుంబాలు చేరిక

ముండ్లమూరు, జూలై 17 (ఆంధ్రజ్యోతి): ముండ్లమూరు పంచాయతీ పరిధిలోని వేంపాడు కాలనీకి చెందిన గోపనబోయిన వెంకటరావు, వారి బంధువులు గురువారం టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ గొట్టిపాటి లక్ష్మి, లలిత్‌సాగర్ దంపతుల సమక్షంలో పార్టీలో చేరారు. వీరికి లక్ష్మి టీడీపీ కండువాలు వేసి ఆహ్వానించారు. అలాగే, మండలంలోని వేముల పంచాయతీ పరిధిలోని రాజగోపాలరెడ్డినగర్ గ్రామానికి చెందిన యాతం సురేష్, మరో పది కుటుంబాలు టీడీపీలో చేరారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు కూరపాటి శ్రీనివాసరావు, మాజీ అధ్యక్షుడు సోమేపల్లి శ్రీనివాసరావు, సర్పంచ్ గజ్జల ఆదెమ్మ, సుబ్బారెడ్డి, రామారావు, తదితరులు పాల్గొన్నారు.



వసతి.. దయనీయం

సంక్షేమం సమస్యల మయం

- అరకొర వసతులతో విద్యార్థుల ఇక్కట్లు
- ఉమ్మడి గుంటూరు జిల్లాలో అద్దె భవనాల్లోనే సగం హాస్టళ్లు
- ప్రభుత్వ వసతిగృహాల్లోని సమస్యలపై హైకోర్టు ఆగ్రహం

ఇదేమి వసతి..

హాస్టళ్లలో విద్యార్థులకు శుభ్రమైన తాగునీరు, పౌష్టికాహారం అందడం లేదు. బెడ్లు, బెడ్ షీట్లు, దిండ్లు కూడా లేవు. విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా మరుగుదొడ్లు, బాత్ రూమ్‌లు లేవు. చాలాచోట్ల హాస్టల్ భవనాలు శిథిలావస్థలో ఉన్నాయి. ప్రభుత్వ వసతి గృహాల్లో కంటే పిల్లలు తల్లిదండ్రులు వద్ద ఉండడమే మేలు.

-హైకోర్టు ధర్మాసనం

చీరాల, జూలై 17 (ఆంధ్రజ్యోతి): తల్లిదండ్రులకు దూరంగా ఉంటూ చదువు కుంటున్న విద్యార్థులకు సంరక్షణతో కూడిన ఆశ్రయం ఇవ్వాల్సిన సంక్షేమ వసతిగృహాలు దా రుణంగా ఉంటున్నాయి. కనీస సౌకర్యాలు లేని శిథిల భవనాల్లో.. అపరిశుభ్ర వాతావరణంలో విద్యార్థులు వసతి పొందాల్సి వస్తోంది. గుంటూరు, పల్నాడు, బాపట్ల జిల్లాల పరిధిలోని జిల్లా కేంద్రాలతో పాటు నియోజకవర్గ, మండల కేంద్రాల్లో ఉన్న హాస్టళ్లు సమస్యల వలయంలో ఉన్నాయి. హైకోర్టు ధర్మాసనం ఆదేశాలతో జిల్లా న్యాయసేవాధికార సంస్థలు పలు హాస్టళ్లను సందర్శించి అక్కడ నెలకొన్న సమస్యలు, విద్యార్థుల అవస్థలపై నివేదిక సమర్పించాయి. ఈ పరిస్థితుల్లో హాస్టళ్లలో నెలకొన్న సమస్యలు, విద్యార్థుల అవస్థలు తీర్చడంపై పాలకులు దృష్టి సారించాలని విద్యార్థుల తల్లిదండ్రులు డిమాండ్ చేస్తున్నారు. ప్రభుత్వం ఏటా రూ.కోట్లు వెచ్చిస్తున్నా సంక్షేమ వసతిగృహాల్లో పరిస్థితుల్లో మార్పు రావడం లేదు. ఎస్సీ, ఎస్టీ, బీసీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఉమ్మడి గుంటూరు జిల్లాలో దాదాపు 70కి పైగా హాస్టళ్లలో పదివేల మందికి పైగా విద్యార్థులు వసతి పొందుతూ చదువుకుంటున్నారు. అయితే వీటిలో సగం అద్దె భవనాల్లోనే ఉన్నాయి. గుంటూరు సహా తెనాలి, వినుకొండ, బాపట్ల, మంగళగిరి, మాచర్ల, సత్తెనపల్లి (మిగతా 6లో)



గుంటూరులో ఏఎల్ బీఈడీ కళాశాల ఆవరణలో అద్దె భవనంలో నిర్వహిస్తున్న హాస్టల్

ఫిష్ ఆంధ్రా.. షాపులేవీ!

- జిల్లాలో 103 యూనిట్లు మంజూరు
- పట్టుమని పది కూడా మనుగడలో లేని వైనం
- వైసీపీ నేతల అనుచరగణం జేబుల్లోకి సబ్సిడీ సొమ్ము
- క్షేత్రస్థాయి విచారణ చేపట్టాలనే డిమాండ్లు
- విస్తుపోయేలా మత్స్యశాఖ పనితీరు

స్థానికంగా ఉండే నిరుద్యోగ యువతకు పెద్ద ఎత్తున ఉపాధి కల్పన....మత్స్య ఉత్పత్తుల వినియోగం పెంచడం...తద్వారా ఎగుమతులపై ఆధారపడకుండా స్థానికంగానే డిమాండ్ సృష్టించడం.... ఇలా ఒకటేమిటి ఫిష్ ఆంధ్రా పథకం పేరిట గత ప్రభుత్వం చేసిన ప్రచారార్భాటం ఇది. కానీ ఆచరణలో జరిగింది వేరు. లబ్ధిదారుల ఎంపిక మొదలు రాయితీ డబ్బుల వరకు అన్నింటిలో వైసీపీ నేతలే చెప్పినట్లే నడిచింది తప్పితే పారదర్శకత అన్నమాటకు తావే లేకుండా ఫిష్ ఆంధ్రా పథకాన్ని ఓ ప్రహసనంలా మార్చేసింది.

పెద్దఎత్తున రొయ్యల వినియోగమంటూ గత ప్రభుత్వం గొప్పలు

(బాపట్ల, ఆంధ్రజ్యోతి)

బాపట్ల దాదాపు 72 కిలోమీటర్ల మేర తీర ప్రాంతం ఉన్న జిల్లా ఇది, ఇక్కడ చేపలు, రొయ్యల వినియోగం ఎక్కడికక్కడ స్థానింగా పెద్దఎత్తున విక్రయాలు జరుగుతూనే ఉంటాయి. ఈ ప్రాంతంలో పనిగట్టుకుని చేపలు, రొయ్యల వాడకంపై ప్రభుత్వాలు పెద్ద ఎత్తున ఖర్చు చేయాల్సిన అవసరం లేదు. ఈ స్పృహ కూడా లేకుండా గత ప్రభుత్వం ఈ పథకం పేరిట చేసిన ఆర్భాటం అంతా ఇంతాకాదు. నిజంగా ఈ రంగంలో ఉన్నవారికి న్యాయం చేయాలనే చిత్తశుద్ధి గత పాలకులకు ఉంటే సరైన వేదిక లేకుండా విక్రయాలు జరిపి పొట్టపోసుకునే వారు వేలల్లో ఉన్నారు. వీరిలో మత్స్యకారులే కాదు అన్ని సామాజిక వర్గాలు ఉన్నాయి. అప్పుడు ప్రతిపక్షంలో ఉన్న టీడీపీ కూడా ఇదే విషయాన్ని పాలకులకు సూచించింది. కానీ ఇవేవీ చెవికెక్కించుకోక పోగా నేలవిడిచి సాము చేసిన చందాన ఫిష్ ఆంధ్రా మాల్‌ల పేరిట ఓ ప్రహసనానికే అప్పటి ప్రభుత్వం తెరలేపింది. అధికారుల పాత్రను నామమాత్రం చేస్తూ లబ్ధిదారుల ఎంపికను తూతూ మంత్రంగా చేపట్టి 40 శాతం వచ్చే రాయితీ సొమ్మును ఎంచక్కా వైసీపీ నేతలే స్వాహా చేశారని అప్పట్లోనే పెద్దఎత్తున విమర్శలు వచ్చాయి. ఇక మాల్‌లు మొదలుకుని ఫిష్ పోస్టర్లకు వైసీపీ రంగులు వేసి ప్రచారం చేపట్టడం మరో ఎత్తు. మూడు కేటగిరీల్లో 103 షాపులను జిల్లాలో ఏర్పాటు చేసినట్లు గత పాలకులు ఊదరగొట్టడమే కాదు, హంగు, ఆర్భాటాలతో ప్రారంభోత్సవాలు చేశారు. సీన్ కట్ చేస్తే రొయ్యల వినియోగం గతం కన్నా పెరిగిందీ లేదు, ఉపాధి కల్పనా ఎండమావే, పట్టుమని పదిషాపులు కూడా ఇప్పుడు జిల్లాలో మనుగడ లేవు. రాయితీ సొమ్ము స్వాహా చేసిన నేతల అనుచరగణం దిలాసాగా ఉంటే, కోట్ల రూపాయలు ప్రభుత్వ సొమ్ము దుర్వినియోగం పాలైంది. గత ఏలుబడిలో ఇంత పెద్ద ఎత్తున జరిగిన కార్యక్రమానికి సంబంధించి మత్స్యశాఖ దగ్గర కనీసం ఏ ప్రాంతంలో ఎన్ని షాపులు ఏర్పాటు చేశారు? లబ్ధిదారులెవరూ అనే సమాచారం లేకపోవడం జరిగిన గోల్‌మాల్‌లో అప్పటి యంత్రాంగం పాత్రపైనా అనుమానాలు రేకెత్తించేలా ఉన్నాయి. ఈ ప్రభుత్వం కొలువుదీరిన కొత్తల్లో ఫిష్ ఆంధ్రా అక్రమాలపై విజిలెన్స్ విచారణ చేపడతామని ప్రకటించింది. ఇంతవరకు అతీగతీ లేదు. ఇప్పటికైనా ఆ పథకంలో జరిగిన అవకతవకలపై పూర్తిస్థాయిలో విచారణ చేపడితే వైసీపీ నేతల స్వాహాకార్యాలు వెలుగు చూసే అవకాశం (మిగతా 6లో)



బాపట్ల పట్టణంలో ఏర్పాటు చేసిన ఓ ఫిష్ ఆంధ్రా షాపు పరిస్థితి ఇదీ

టౌన్‌హాలుది ఘన చరిత్ర

ఆర్డీవో గ్లోరియా

బాపట్ల, జూలై 17 (ఆంధ్రజ్యోతి): ఎన్నో సాహిత్య, సాంస్కృతిక కార్యక్రమాలకు బాపట్లటౌన్ హాలు పట్టుగొమ్మగా నిలిచిందని ఆర్డీవో గ్లోరియా పేర్కొన్నారు. 120 వసంతాల టౌన్‌హాలు వార్షికోత్సవం గురువారం ఫోరం ఫర్ బెటర్ బాపట్ల ఆధ్వర్యంలో నిర్వహించారు. ఫోరం కార్యదర్శి డాక్టర్ పీ సీ.సాయిబాబు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి ఆర్డీవో ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. తెలుగుతల్లి విగ్రహానికి పుష్పాంజలి ఘటించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, జాతీయ నాయకుల ప్రసంగాలకు సాక్షీభూతంగా నిలిచిందన్నారు. ఇది ఎందరో కవులు, కళాకారులకు ఆలంబనంగా నిలిచిందన్నారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ మహిళా డిగ్రీకళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ ఎవి.రమణారావు, రచయిత మల్లికార్జున, విశ్రాంత ప్రిన్సిపాల్ కృష్ణంరాజు, అధ్యాపకులు డాక్టర్ అబ్దుల్ కలాం, రత్నేశ్వరరావు, మల్లేశ్వరి, సుశీలావతి, వెంకటలక్ష్మమ్మ, పద్మజ, విద్యార్థులు,న్యూస్ పేపర్‌క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.



తెలుగుతల్లి విగ్రహానికి పుష్పాంజలి ఘటించి మాట్లాడుతున్న ఆర్డీవో గ్లోరియా

జాతీయ రహదారికి ఆమోదం

- తోకపల్లి నుంచి పందిళ్లపల్లి వరకు నిర్మాణం
- మంత్రి గొట్టిపాటి ప్రతిపాదన.. సీఎం అనుమతి

అద్దంకి, జూలై 17 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి ప్రకాశం జిల్లాలో పశ్చిమ, తూర్పు ప్రాంతాలను కలుపుతూ జాతీయ రహదారి నిర్మాణానికి రాష్ట్ర ప్రభుత్వం ఆమోదం తెలిపింది. పెద్దారవీడు మండలం తోకపల్లి నుంచి దొనకొండ, దర్శి, అద్దంకి, చందలూరు, ఇంకొల్లు, కడవకుదురు, మోటుపల్లి మీదగా పందిళ్లపల్లి వరకు సుమారు 130.345 కి.మీ దూరం జాతీయ రహదారి నిర్మాణానికి మంత్రి గొట్టిపాటి రవికుమార్ ప్రతిపాదన చేశారు. దీనిని ముఖ్యమంత్రి చంద్రబాబు దృష్టికి గొట్టిపాటి తీసుకువెళ్లగా అంగీకరించారు. ఈ ప్రతిపాదనను రాష్ట్ర ప్రభుత్వం కేంద్ర ప్రభుత్వానికి పంపినట్లు గొట్టిపాటి తెలిపారు. పెద్దారవీడు మండలం కుంట వద్ద రెండు జాతీయ రహదారుల నుంచి ప్రారంభమై పురాతన విమానాశ్రయం దొనకొండ, అతి పురాతన బౌద్ధ స్థూపం ఉన్న చందవరం, చీరాల ప్రాంతాల్ని కలుపుతూ ఒంగోలు-దిగమర్రు జాతీయ రహదారిలో కలిసేలా జాతీయ రహదారి నిర్మాణానికి ప్రతిపాదనలు పంపినట్లు తెలుస్తోంది. కుంట వద్ద ఉన్న రెండు జాతీయ రహదారులు, అద్దంకి సమీపంలోని నామ్ రోడ్డు, విజయవాడ-బెంగళూరు గ్రీన్ ఫీల్డ్ రోడ్డు, పాత మద్రాస్ రోడ్డు, ఒంగోలు-దిగమర్రు రోడ్డులను అనుసంధానం చేసేలా కొత్తగా ఏర్పాటు చేసే జాతీయ రహదారి ఉండనున్నది. దొనకొండ, దర్శి, అద్దంకి, చందలూరు, కొనికి,ఇంకొల్లు, కడవకుదురు ప్రాంతాల్లోని ఆర్అండ్‌బీ రోడ్లను విస్తరిస్తూ జాతీయ రహదారి నిర్మాణం చేసేలా ప్రతిపాదనలు చేశారు. అదే సమయంలో దర్శి, అద్దంకిల్లో బైపాస్ రోడ్లు కూడా ఏర్పాటు కు అవకాశం ఉంది. జాతీయ రహదారి పట్టాలెక్కితే చీరాల, అద్దంకి, దర్శి ప్రాంతాల నుంచి శ్రీశైలం, కర్నూలు వెళ్లేందుకు దగ్గరి మార్గంగా ఏర్పడుతుంది.



దర్శి- అద్దంకి ఆర్అండ్ బీ రోడ్డు ఉమ్మడి ప్రకాశంలో పశ్చిమ, తూర్పు ప్రాంతాలను కలుపుతూ జాతీయ రహదారి

బగళాముఖి అమ్మవారి హుండీ ఆదాయం రూ.6.09 లక్షలు



హుండీ లెక్కిస్తున్న అధికారులు, పండితులు

పిట్టలవానిపాలెం, జూలై 17 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చందోలు గ్రామంలో వేంచేసియున్న శ్రీబగళాముఖి అమ్మవారి దేవస్థానంలోని హుండీలను తెరిచి భక్తులు సమర్పించిన కానుకలను గురువారం అధికారులు, అర్చకులు, భక్తుల సమక్షంలో లెక్కించారు. ఆలయంలో ఐదు హుండీలకు సంబంధించి 6 లక్షల 9వేల 886 రూపాయలు ఆదాయం లభించినట్లు త్రిముఖదేవాలయాల కార్యనిర్వాహణాధికారి నరసింహమూర్తి తెలిపారు. దేవదాయశాఖ ఇన్‌స్పెక్టర్ ఎం.గోపి పర్యవేక్షణలో హుండీల లెక్కింపు జరిగింది. ఈ కార్యక్రమంలో చందోలు ఎస్ఐ ఎం.వెంకటశివకుమార్, హెడ్‌కానిస్టేబుల్ శివశంకరరావు, శ్రీనివాసరావు, ఆలయ సిబ్బంది కె.శ్రీనివాసరావు, నాగుల శ్రీనివాసరావు, రేపల్లె, చందోలు, భనవారిపాలెం గ్రామాల నుంచి వచ్చిన భక్తులు పాల్గొన్నారు.

బాపట్ల మున్సిపల్ హైస్కూల్ ముస్తాబు



డైనింగ్ హాలు

- ప్రారంభానికి సిద్ధమైన భవన సముదాయం
- నెరవేరిన మెగా పీటీఎంలో సీఎం చంద్రబాబు హామీ
- మాట నిలబెట్టుకున్నాం.. మంచి ఫలితాలు సాధించాలని లోకేశ్ ట్వీట్



తరగతి గది



ముఖ్యమంత్రి చొరవతో ప్రారంభానికి సిద్ధమైన హైస్కూల్ భవనం

బాపట్ల, జూలై 17 (ఆంధ్రజ్యోతి): గత ఏడాది మెగా పేరెంట్ అండ్ టీచర్స్ సమావేశంలో ముఖ్యమంత్రి చంద్రబాబు విద్యార్థులకు ఇచ్చిన హామీ మేరకు బాపట్ల మున్సిపల్ హైస్కూల్‌ను సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దారు. హైస్కూల్ లోని భవన నిర్మాణ పనులను గత టీడీపీ ప్రభుత్వంలో చేపట్టారని వైసీపీ హయాంలో ఐదేళ్లు నిర్లక్ష్యం చేశారు. గత ఏడాది డిసెంబరు 7న బాపట్ల మున్సిపల్ హైస్కూల్‌లో జరిగిన పీటీఎం కార్యక్రమంలో పాల్గొన్న ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రి లోకేశ్‌ల దృష్టికి ఈ విషయాన్ని విద్యార్థుల తల్లిదండ్రులు తీసుకెళ్లారు. పాత భవనంలోనే గదుల్లో విద్యార్థులు ఇబ్బంది పడుతున్నారని చెప్పారు. దీంతో పనులు నిలిచిన భవన సముదాయాన్ని ముఖ్యమంత్రి పరిశీలించి పూర్తి చేయడానికి రూ.కోటి 49 లక్షలు మంజూరు చేశారు. దీంతో తరగతి గదులు, ల్యాబ్, డైనింగ్ హాలు వంటి వసతులతో హైస్కూల్ భవనాన్ని ఏడాదిలోనే సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దారు. రంగులతో ముస్తాబు చేసిన భవనం అందర్నీ ఆకట్టుకుంటున్నది. త్వరలో దీనిని ప్రారంభించి విద్యార్థులకు అంకితం చేయనున్నారు. దీనిపై మంత్రి నారా లోకేశ్ ఎక్స్ వేదికగా స్పందిస్తూ.. మేమిచ్చిన మాట నిలబెట్టుకున్నాం.. మంచి ఫలితాలు సాధించి బాపట్ల మున్సిపల్ హైస్కూల్ పేరు నిలబెట్టాలని విద్యార్థులు, ఉపాధ్యాయులను కోరుతూ ట్వీట్ చేశారు.

ప్రథమ చికిత్స మాత్రమే చేయాలి

ఆర్ఎంపీలతో డీఎంహెచ్‌వో విజయమ్మ

బాపట్ల, జూలై 17 (ఆంధ్రజ్యోతి): రోగులు, అనారోగ్య పీడితులకు ఆర్ఎంపీలు కేవలం ప్రథమ చికిత్స మాత్రమే చేయాలని డీఎంహెచ్‌వో డాక్టర్ విజయమ్మ తెలిపారు. బాపట్ల ఎన్జీవో హోమ్‌లో గురువారం ఆర్ఎంపీలతో జరిగిన సమావేశంలో ఆమె ప్రసంగించారు. ఆర్ఎంపీలు రోగులకు ఇంజక్షన్లు చేయరాదని, సెలైన్లు పెట్టరాదని, ఇతర వైద్యం చేయరాదన్నారు. ఆరోగ్య సమస్యలతో వచ్చిన వారికి కేవలం ప్రథమ చికిత్స మాత్రమే చేసి, వారిని సమీపంలోని ఆరోగ్య కేంద్రాలకు పంపించాలన్నారు. పరిధిని అతిక్రమించి వైద్యం చేస్తే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సమావేశంలో జిల్లా కోఆర్డినేటర్ డాక్టర్ ప్రవీణ్ పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో విజయమ్మ

సింగిల్‌యూజ్ ప్లాస్టిక్ నిషేధం

జిల్లాలో 19 నుంచి అమలు : కలెక్టర్

బాపట్ల, జూలై 17 (ఆంధ్రజ్యోతి): ప్లాస్టిక్ రహిత జిల్లాగా బాపట్లను మార్చాలనే లక్ష్యంతో ఈనెల 19 నుంచి సింగిల్‌యూజ్ ప్లాస్టిక్ నిషేధిస్తున్నట్లు కలెక్టర్ వెంకట మురళి తెలిపారు. ఈవిషయమై గురువారం ఆయన మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా సింగిల్‌యూజ్ ప్లాస్టిక్‌ను పూర్తిగా నిషేధిస్తున్నట్లు స్పష్టం చేశారు.దీనిపై ప్రజలలో అవగాహన కల్పించేందుకు, ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించేందుకు విస్తృత ప్రణాళికలు రూపొందించినట్లు తెలిపారు. దీనిపై డంపింగ్‌యార్డులో భారీ అవగాహన సదస్సు, ప్రతిజ్ఞ కార్యక్రమాన్ని 19వ తేదీన నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో 2వేల మంది పాల్గొంటారన్నారు.

తీరంలో భారీ వర్షం




నిజాంపట్నంరోడ్డు పల్లపట్ల సమీపంలో జలమయమైన రహదారులు

రేపల్లె, జూలై 17 (ఆంధ్రజ్యోతి): తీరప్రాంతంలోని రేపల్లె నియోజకవర్గంలో గురువారం మధ్యాహ్నం భారీ వర్షం కురిసింది. లోతట్టు ప్రాంతాలతో పాటు పలు రహదారులు జలమయమయ్యాయి. ప్రయాణికుల రాకపోకలకు తీవ్ర ఆటంకం కలిగింది. రేపల్లె, నగరం, నిజాంపట్నం, చెరుకుపల్లి మండలాల్లో రూ.8 వేలతో వెదలో వరి నాటిన రైతులు ఈ వర్షంతో ఊపిరి పీల్చుకున్నారు. మొలకలు రావని భయాందోళన చెందుతున్న రైతులకు ఉపశమనం కలిగేలా వర్షం పడింది. ఈ వర్షంతో మొలకలు వస్తాయంటూ రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ఆక్వా విస్తీర్ణం పెంపునకు ఆమోదం

జిల్లా స్థాయి కమిటీ సమావేశంలో కలెక్టర్

బాపట్ల, జూలై 17 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో స్థిరమైన ఆక్వాకల్చర్‌ను ప్రోత్సహించటానికి, విస్తీర్ణం పెంచటానికి ఆమోదం తెలుపుతున్నట్లు కలెక్టర్ జె.వెంకటమురళి ప్రకటించారు. ఈ విషయమై గురువారం కలెక్టర్ కార్యాలయంలో జిల్లా స్థాయి కమిటీ సమావేశం నిర్వహించారు. సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ ఆక్వా ఉత్పత్తుల సాగు పెంచటానికి అవసరమైన భూమిని గుర్తించాలని అధికారులకు సూచించారు. జిల్లాలో ప్రస్తుతం 17,603.80 ఎకరాల విస్తీర్ణంలో ఆక్వాకల్చర్ సాగు జరుగుతుందని మత్స్యశాఖాధికారులు కలెక్టర్‌కు వివరించారు. జిల్లాలో మరో 3067.16 ఎకరాలలో ఆక్వాకల్చర్ విస్తరింప చేయటానికి అనుకూలంగా ఉందని, అదేవిధంగా భవిష్యత్తు తరాలలో ఆక్వాకల్చర్‌ను విస్తరింప చేయటానికి 3,361.14 ఎకరాల భూమి అనువుగా ఉందని మత్స్యశాఖాధికారులు కలెక్టర్‌కు వివరించారు. జిల్లాలో ఆక్వా సాగు విస్తరిసే, విదేశీ మారక ద్రవ్యం పెరుగుతుందని, తద్వారా జిల్లా జీడీపీ రేటు పెరుగుతుందని, రైతులకు జీవనోపాధి అవకాశాలు మెరుగుపడుతాయని కలెక్టర్ తెలిపారు. ఆక్వాజోన్ విస్తీర్ణతకు సంబంధించి జిల్లా స్థాయి కమిటీ సభ్యులు తయారు చేసిన ప్రతిపాదనలను కలెక్టర్ ఆమోదించారు. సమావేశంలో మత్స్యశాఖ సంయుక్త సంచాలకులు శ్రీనివాసనాయక్, ఉపసంచాలకులు గాలిదేముడు, చీరాల సహాయసంచాలకులు కృష్ణ కిషోర్, నిజాంపట్నం సహాయ సంచాలకులు సైదానాయక్, ఎఫ్‌డీవో కిషోర్‌రెడ్డి, జాతీయ మత్స్యకార సంఘం రాష్ట్రఅధ్యక్షుడు డాక్టర్ అనంత నగేష్‌బాబు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ వెంకటమురళి



పరిచయ వేదికలో మాట్లాడుతున్న ప్రతినిధులు

విద్యార్థులకు చక్కని బోధన

చీరాల, జూలై 17 (ఆంధ్రజ్యోతి) : సుదీర్ఘ అనుభవం గల అధ్యాపకులతో విద్యార్థులకు చక్కని బోధన అందిస్తున్నట్లు చీరాల సెయింట్ ఆన్స్ కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ సెక్రటరీ వనమా రామకృష్ణారావు, కరస్పాండెంట్ శ్రీమంతుల లక్ష్మణరావు పేర్కొన్నారు. గురువారం కళాశాలలో పాలిటెక్నిక్ మొదటి సంవత్సరం విద్యార్థులకు పరిచయ కార్యక్రమం నిర్వహించారు. అలాగే కళాశాలలో ఏపీ ఎస్ఎస్‌డీసీ వారి ఆధునిక సీమెన్స్ ల్యాబ్‌లో మిషన్లు శిక్షణకు అందుబాటులో ఉన్నట్లు వివరించారు. విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ జగదీష్, పాలిటెక్నిక్ డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ విజయభాస్కరరెడ్డి, డాక్టర్ సుబ్బారావు, విద్యార్థులు పాల్గొన్నారు.


చందలూరు సరిహద్దు డొంకలో పంట పొలాల నీటి ప్రవాహానికి అడ్డుగా వేసిన మట్టి కువ్వలను ఎక్స్‌కవేటర్‌తో తొలగిస్తున్న అధికారులు

అడ్డువేసిన మట్టికువ్వల తొలగింపు

పంగులూరు, జూలై 17(ఆంధ్రజ్యోతి):మండలంలోని చందలూరు గ్రామ సరిహద్దు డొంకలో ఎగువ పొలాల నుంచి వచ్చే వర్షపు నీరు ముందుకు వెళ్లకుండా అడ్డుగా వేసిన మట్టికువ్వలను అధికారులు గురువారం ఎక్స్‌కవేటర్‌తో తొలగించారు. చందలూరు గ్రామ సర్వేనెంబరు 819 సరిహద్దు డొంక కాగా ఇంకొల్లు మండలం కొణికి గ్రామానికి చెందిన కొందరు రైతులు ఎగువ పొలాల నుంచి పారుదల అయ్యే వర్షపు నీటికి అడ్డుగా మట్టి కువ్వలు తోలారు. ఈ విషయమై ఇరు గ్రామాల మధ్య తలెత్తిన సమస్య పరిష్కారం కోసం చీరాల ఆర్డీవో గత కొద్దిరోజుల క్రితం విచారణ చేపట్టారు. ఆసమస్య పరిష్కారంలో భాగంగా మండల తహసీల్దార్ సింగారావు, రేణంగివరం ఎస్ఐ వినోద్‌బాబు గురువారం ఎక్స్‌కవేటర్‌తో నీటి పారుదలకు అడ్డుగా ఉన్న మట్టి కువ్వలను గురువారం తొలగించారు. కార్యక్రమంలో రెవెన్యూ. పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

బదిలీ అయిన ఉపాధ్యాయునికి సత్కారం

ఎనిమిదేళ్లపాటు విద్యార్థులకు ఉత్తమ బోధన చేసి బదిలీ అయిన తోట శ్రీహరిబాబును కోటపాడు ఉన్నత పాఠశాల ఉపాధ్యాయ బృందం గురువారం ఘనంగా సత్కరించింది. గత ఎనిమిదేళ్లలో శ్రీహరిబాబు అందించిన సేవలను కొనియాడారు. పాఠశాల హెచ్‌ఎం వేణుబాబు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.


భద్రయ్య మృతదేహానికి నివాళులర్పిస్తున్న టీడీపీ నేతలు

భద్రయ్య మృతి టీడీపీకి తీరని లోటు

చినగంజాం, జూలై 17(ఆంధ్రజ్యోతి) : మండలంలోని మోటుపల్లి గ్రామ పంచాయతీ పరిధిలోని రుద్రమాంబపురం గ్రామానికి చెందిన టీడీపీ సీనియర్ నాయకుడు కొండూరు భద్రయ్య(55) గుండెపోటుతో గురువారం మృతి చెందాడు. భద్రయ్య మృతి పట్ల పర్చూరు శాసనసభ్యుడు ఏలూరి సాంబశివరావు దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఆయన మృతి పార్టీకి, కుటుంబసభ్యులకు తీరని లోటుని అన్నారు. మండల టీడీపీ నాయకులు అబ్దుల్‌కలాంఅజాద్, మోటుమర్రి రామసుబ్బారావు, కొక్కిలిగడ్డ రామాంజనేయులు, మోటుపల్లి గ్రామ టీడీపీ అధ్యక్షుడు సింగోతు శ్రీనులు భద్రయ్య పార్థీవదేహాన్ని సందర్శించి, పూలమాలలు వేసి నివాళులర్పించారు. కుటుంబసభ్యులను పరామర్శించి, సానుభూతి తెలియజేశారు.


వినతిపత్రం అందజేస్తున్న బీజేపీ నాయకులు

కొనుగోళ్లు వేగవంతం చేయాలని వినతి

ఇంకొల్లు,జూలై 17,(ఆంధ్రజ్యోతి): పొగాకు రైతుల సమస్యలను పరిష్కరించాలని బీజేపీ నాయకులు మార్క్‌ఫెడ్ డీఎం కరుణశ్రీకి వినతి పత్రం అందజేసారు.ప్రభుత్వం కొనుగోలు చేస్తున్న నల్లబర్లీ పొగాకు కొనుగోళ్లు వేగవంతం చేయాలని లేకుంటే రైతులు ఇబ్బందులు పడాల్సివస్తుందని వినతిపత్రంలో పేర్కొన్నారు.పొగాకు రైతులు ఆందోళన చెందనవసరం లేదని చివరి ఆకువరకు పొగాకు కొనుగోలు చేస్తామని డీఎం హామీ ఇచ్చారు. వినతి పత్రం అందజేసిన వారిలో బీజేపీ జిల్లా మాజీ ప్రధాన కార్యదర్శి జీవీఎల్ మోహన్‌గౌడ్,ఇంకొల్లు మండల నాయకులు కృష్ణయ్య,వెంకటేశ్వరరావు ఉన్నారు.

సూపర్ సిక్స్‌తో మభ్య పెట్టారు

- వైసీపీ ఇన్‌చార్జి వెంకటేష్

వేటపాలెం(చీరాల), జూలై 17 (ఆంధ్రజ్యోతి) : సూపర్ సిక్స్ పథకాల అమలులో రాష్ట్ర ప్రభుత్వం విఫలమైందని నియోజకవర్గ వైసీపీ ఇన్‌చార్జీ కరణం వెంకటేష్ అన్నారు. వేటపాలెం మండల పరిధిలోని రామన్నపేట పంచాయతీ పరిధిలో గురువారం బాబు ష్యూరిటీ - మోసం గ్యారంటీ కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా వెంకటేష్ మాట్లాడుతూ తల్లికి వందనంలో కొర్రీలు పెట్టి కడుపు కోత మిగిల్చారని చెప్పారు. ఈ కార్యక్రమంలో వైసీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న కరణం వెంకటేష్

ఫలించిన ఎమ్మెల్యే వ్యూహం

- చీరాల మున్సిపల్ చైర్మన్, వైస్ చైర్మన్ ఎంపిక
- అన్ని సామాజిక వర్గాలకు న్యాయం

చీరాల, జూలై 17 (ఆంధ్రజ్యోతి) : ఎట్టకేలకు చీరాల మున్సిపల్‌పై టీడీపీ జెండా ఎగిరింది. అవిశ్వాసం అంశం తెరపైకి వచ్చి, అప్పటి చైర్మన్ జంజనం శ్రీనివాసరావును తొలగించడం నుంచి నూతన చైర్మన్, వైస్ చైర్మన్‌ల ఎంపికల వరకు ప్రజల్లో, రాజకీయ విశ్లేషకుల్లో ఎమ్మెల్యే కొండయ్యపై భిన్న స్వరాలు వినిపించాయి. ఈక్రమంలో ప్రత్యర్థులు సైతం కొండయ్య వ్యూహాన్ని దెబ్బతీసేందుకు ఒకింత గట్టిగానే ప్రయత్నాలు సాగించారు. అయితే మొదటి సారి ఎమ్మెల్యే ఎక్కడా కూడా రాజీ పడకుండా కొండయ్య వ్యూహాన్ని రచించారు. ఎత్తుకు పైఎత్తులు వేస్తూ పురపాలక సంఘంపై విజయ బావుటా ఎగుర వేశారు.

అడుగడుగునా ఆటంకాలు...చిక్కు ప్రశ్నలు

అయితే అవిశ్వాసం అంశం వెలుగులోకి రావడంతో అప్పటి చైర్మన్ జంజనం నేరుగా పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు ఆధ్వర్యంలో పార్టీ తీర్థం పుచ్చుకున్నారు. దీంతో స్థానిక శాసనసభ్యుడి ప్రమేయం లేకుండా ఈ వ్యవహారం జరగదని భావించిన ఎమ్మెల్యే వర్గానికి చెందిన కౌన్సిలర్‌లు ఆయనపై అలక బూనారు. కొద్ది రోజులు పార్టీ కార్యక్రమాలకు సైతం దూరంగా ఉన్నారు. ఈక్రమంలో దాదాపుగా ఎమ్మెల్యే తడబడతారని గట్టిగానే వాదనలు వినిపించాయి. అయితే ఏమాత్రం పార్టీ పాలసీని అతిక్రమించకుండా, దుష్ప్రచారాలకు చెక్ పెడుతూ తిరిగి అందరిని ఏకతాటిపైకి తెచ్చారు. ఇదిలా ఉంటే అవిశ్వాసం తెలిపిన వారిలో నలుగురు ఆశావహులు వేర్వేరు సామాజిక వర్గాలు కావడంతో కొత్తగా తెరపైకి ఓసామాజిక వర్గం సమస్య గట్టిగా వినిపించింది. దీంతో చాలావరకు అధిష్ఠానం సైతం ఈ విషయంలో జోక్యం చేసుకుని రోజులు తరబడి చర్చలు సాగించాల్సి వచ్చింది.

తడబడినా నిలబడ్డారు...

ఈక్రమంలో పలుమార్లు చర్చలు అనంతరం బీసీ సామాజిక వర్గానికి చెందిన చైర్మన్‌ను పదవి నుంచి తొలగించారు. తిరిగి బీసీ వర్గానికి చెందిన మించాల సాంబశివరావుకు చైర్మన్ పదవిని కట్టబెట్టారు. అలాగే గతంలో ఎస్సీ సామాజిక వర్గానికి చెందిన వైస్ చైర్మన్‌ను అవిశ్వాసంలో తొలగించగా, అదే సమయంలో ఓసీ సామాజిక వర్గానికి చెందిన మరో మహిళ వైస్ చైర్మన్ పదవికి రాజీనామా ప్రకటించారు. అయితే దీనిపై ఎలక్షన్ కమిషన్ ఆమోదం తెలపాల్సి ఉంది. ఈక్రమంలో ఖాళీ అయిన వైస్ చైర్మన్‌ల సామాజిక వర్గాల ప్రాతిపదికన చైర్మన్ పదవిని ఆశించి భంగపడ్డ 18వ వార్డు కౌన్సిలర్ పొత్తూరి సుబ్బయ్యను వైస్‌చైర్మను చేశారు.


నూతనంగా ఎంపికయిన చైర్మన్, వైస్ చైర్మన్‌లతో ఎమ్మెల్యే కొండయ్య, మహేంద్రనాథ్

దీంతో ప్రిసైడింగ్ అధికారులు నియామక పత్రాన్ని అందజేసి, ప్రమాణ స్వీకారం చేయించారు. అలాగే ఎస్సీ సామాజిక వర్గం వైస్‌చైర్మన్‌గా త్వరలో అదే సామాజిక వర్గానికి న్యాయం చేయనున్నట్లు ఎమ్మెల్యే స్పష్టం చేశారు. ఈక్రమంలో గతకొన్ని నెలలుగా ట్విస్ట్‌ల మీద ట్విస్టులతో సాగిన మున్సిపల్ అంశంకు ఎట్టకేలకు తెరపడింది. అలాగే పరిపాలనను దృష్టిలో ఉంచుకోవడంతో పాటు అన్ని సామాజిక వర్గాలకు ప్రాధాన్యం కల్పించడంతో మొదట్లో కొంత తడబడినా నిలబడటంపై ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

వసతి.. దయనీయం

(5వ పేజీ తరువాయి)

నరసరావుపేట తదితర ప్రాంతాల్లో కళాశాల, పాఠశాల స్థాయి హాస్టళ్లు అద్దెభవనాల్లోనే ఉన్నాయి. అసిస్టెంట్ వెల్ఫేర్ ఆఫీసర్లు ఉన్నా హాస్టళ్ల పర్యవేక్షణ సక్రమంగా సాగడం లేదు. కొంతమంది వార్డెన్లు వెల్ఫేర్ ఆఫీసర్లను మేనేజ్ చేసి విధులకు డుమ్మా కొడుతున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. ఫలితంగా విద్యార్థుల సంక్షేమం గాలిలో దీపం అన్న చందంగా మారింది. అద్దె భవనాల్లో విద్యార్థులకు సరిపడినన్ని మరుగుదొడ్లు, స్నానపు గదులు లేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మరోవైపు వారికి ఇవ్వాల్సిన దుప్పట్లు కూడా సకాలంలో అందడం లేదు. ఏటా చలికాలంలో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

వైద్య పరీక్షలు మరిచారు..

హాస్టళ్లలో వసతి పొందే విద్యార్థులకు కనీసం మూడు నెలలకు ఒకసారి వైద్య పరీక్షలు నిర్వహించాలి. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల ద్వారా నిర్వహించాల్సిన వైద్య పరీక్షలు గత కొన్నేళ్లలో జరిగిన దాఖలాలు లేవు. ఫలితంగా విద్యార్థులు చర్మ సంబంధ వ్యాధులతో ఇబ్బందులు పడుతున్నారు. కొన్నిసార్లు కలుషిత నీరు ఆహారం తీసుకుని విద్యార్థులు ఆస్పత్రుల పాలవుతున్నా పట్టించుకోవడం లేదు.

కాస్మెటిక్ చార్జీల కోసం ఎదురుచూపు

హాస్టళ్లలో విద్యార్థులకు ప్రభుత్వం మూడు నెలలకు ఒకసారి కాస్మోటిక్ చార్జీలు చెల్లించాలి. అయితే ఇవి సక్రమంగా అందడం లేదు. కొంతంగా సబ్బులు నూనెలు తదితర వస్తువులు సొంత డబ్బులతోనే కొనుగోలు చేసుకుంటున్నారు.

తూతు మంత్రంగా మెనూ

విద్యార్థులకు నిర్దేశించిన మెనూ సక్రమంగా అమలు చేయడం లేదు. ఫలితంగా విద్యార్థులకు పౌష్టికాహారం అందని ద్రాక్షలాగా మారింది. గుంటూరులోని కొన్ని హాస్టళ్ల విద్యార్థులు సమీపంలోని అన్న క్యాంటీన్లలో భోజనం చేస్తున్నారంటే పరిస్థితి అర్థం చేసుకోవచ్చు. మరికొందరు రైస్ కుక్కర్లను ఇళ్ల నుంచి తెచ్చుకొని హాస్టల్ గదుల్లోనే వంట చేసుకుంటున్నారు. ఇదంతా ఉన్నత స్థాయిలో అధికారులకు తెలిసిన చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారని ఆరోపణలు ఉన్నాయి.

ఫిష్ ఆంధ్రా...షాపులేవీ!

(5వ పేజీ తరువాయి)

ఉందనే అభిప్రాయం సర్వత్రా వ్యక్తమవుతోంది

జిల్లాలో 103 యూనిట్లు...

ఫిష్ ఆంధ్రా మాల్స్‌ను మూడు కేటగిరీల్లో గత ప్రభుత్వం ఎంపిక చేసింది. ఇందులో ఒక్కోటి పది లక్షల విలువ కలిగిన యూనిట్లు 7 ప్రారంభించారు. ఇందులో జనరల్-5, ఎస్సీ-2 కేటాయించారు. ఇందులో జనరల్ కేటగిరీకి 40 శాతం సబ్సిడీ కాగా ఎస్సీలకు 60 శాతం రాయితీ అందించారు. ఒక్కో యూనిట్ రూ.1.75లక్ష విలువ కలిగినవి 93 ప్రారంభించగా జనరల్–56, ఎస్సీ–18, ఎస్టీలకు 19 కేటాయించారు. అదే విధంగా ఫిష్ వాల్యూ యాడెడ్ ఎంటర్‌ప్రైజెస్ కింద 50 లక్షల విలువ కలిగిన యూనిట్లను మూడు మంజూరు చేశారు. అన్నింటిల్లో కూడా జనరల్‌కు 40 శాతం, ఎస్సీ, ఎస్టీలకు 60 శాతం రాయితీని ప్రభుత్వం అందించింది. దాదాపు రూ. 1.50 కోట్ల ప్రభుత్వ సొమ్ము రాయితీల రూపంలో అందింది. మత్స్యశాఖ దగ్గర ఈ సమాచారం తప్ప ఏ ప్రాంతంలో వీటిని ఏర్పాటు చేశారు, కేటగిరీల వారీగా లబ్ధిదారుల వివరాలు లాంటివి ఏవీ అందుబాటులో లేకపోవడం మరింత విడ్డూరంగా ఉంది

దాదాపు అన్నీ మూతే...

ఇంత పెద్ద ఎత్తున ఏర్పాటు చేసిన ఫిష్ ఆంధ్రా షాపులు జిల్లాలో ఇప్పుడు ఎక్కడ ఉన్నాయని వెతుక్కోవాల్సిన పరిస్థితి ఉంది. దాదాపు 75 శాతం మూతపడగా, మరికొన్నింటిని వేరే అవసరాలకు వినియోగించుకుంటూ బోర్డు మాత్రం అదే కొనసాగిస్తున్నారు. ఇప్పటికైనా ఆ పథకం అమలు తీరు తెన్నులపై లోతుగా విచారణ చేపడితే ప్రభుత్వ సొమ్మును అర్హత లేని వాళ్లు ఎంత దోచుకున్నారో బహిర్గతమయ్యే అవకాశాలు ఉన్నాయి.

ప్రజా సంక్షేమమే చంద్రబాబు లక్ష్యం

చినగంజాం, జూలై 17(ఆంధ్రజ్యోతి) : రాష్ట్రాభివృద్ధి, ప్రజా సంక్షేమమే రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు లక్ష్యమని టీడీపీ జిల్లా వాణిజ్య విభాగం ఉపాధ్యక్షుడు మోటుమర్రి రామసుబ్బారావు, మండల ప్రధాన కార్యదర్శి సయ్యద్ అబ్దుల్‌కలాంఅజాద్‌లు అన్నారు. చినగంజాం గ్రామంలో గురువారం రాత్రి సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమాన్ని టీడీపీ నేతలు నిర్వహించారు. ఇంటింటికీ తిరిగి సంక్షేమ పథకాల కరపత్రాలను పంపిణీ చేశారు. టీడీపీ నాయకులు టి.జయరావు, సందు శ్రీనివాసరావు, భయ్యా సతీష్‌కుమార్, ధర్మవరపు ఏసునారాయణ తదితరులు పాల్గొన్నారు.


సంక్షేమ పథకాల కరపత్రాలను అందజేస్తున్న టీడీపీ నేతలు

హెపటైటిస్ బీ,సీ నిర్ధారణ పరీక్షలు

చినగంజాం, జూలై 17(ఆంధ్రజ్యోతి) : చినగంజాం మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల ఆవరణలో చీరాల మహిళా మండలి ఆధ్వర్యంలో హై రిస్క్ కలిగిన వ్యక్తులకు హెపటైటిస్ బీ, సీ నిర్ధారణ పరీక్షలు నిర్వహించినట్లు ప్రాజెక్టు మేనేజర్ కే.వెంకటరావు గురువారం తెలిపారు. ఈ సందర్భంగా ప్రాజెక్ట్ డైరెక్టర్ శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ హెపటైటిస్ పరీక్షల్లో నెగటివ్‌గా తేలినవారికి హెపటైటిస్ బీ వాక్సిన్ ఇవ్వనున్నట్లు తెలిపారు. హెచ్ఐవీతో పాటు ఇతర వైరస్ వ్యాధులను ఆరికట్టేందుకు ఈ చర్యలు ఉపయుక్తంగా ఉంటాయని తెలిపారు. 48 మందికి హెపటైటిస్ వాక్సిన్ ఇచ్చినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో చీరాల మహిళా మండలి ప్రతినిధులు సీయోనుకుమారి, జ్యోతి, సంధ్యారాణి, దానమ్మ, దివ్యభాను, విజయ్, శిరీష, శ్రీగీతలు పాల్గొన్నారు.


హెపటైటిస్ బీ వాక్సిన్ వేస్తున్న చీరాల మహిళా మండలి సభ్యులు

అద్దంకి ఎస్సై బాధ్యతల స్వీకరణ

అద్దంకి,జూలై17(ఆంధ్రజ్యోతి): అద్దంకి టౌన్ ఎస్సైగా నరసింహ గురువారం బాధ్యతలు చేపట్టారు. అద్దంకి టౌన్ పోలీస్ స్టేషన్‌లో గతంలో ఉన్న ఇద్దరు ఎస్సైలు బదిలీ కావటంతో ఎస్సై పోస్టులు కొంత కాలంగా ఖాళీగా ఉన్నాయి. ఈ నేపథ్యంలో గతంలో మాచర్ల టౌన్, రూరల్ పోలీస్ స్టేషన్ లలో ఎస్సైగా పని చేసిన నరసింహను అద్దంకి స్టేషన్‌లో ఎస్సైగా నియమించారు. సీఐ సుబ్బరాజును కలిసి గురువారం విధులలో చేరారు.


సీఐ సుబ్బరాజుకు నిమ్మకాయ అందజేస్తున్న ఎస్ఐ నరసింహ

ప్రతి ఒక్కరూ చట్టాలపై అవగాహన కలిగి ఉండాలి

అద్దంకిటౌన్, జూలై 17(ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరూ చట్టాలపై అవగాహన కలిగి ఉండి వాటి ప్రకారం నడుచుకోవాలని న్యాయవాది చిన్ని మురళీకృష్ణ అన్నారు. గురువారం ఇంటర్‌నేషనల్ లా డే సందర్భంగా రోటరీ క్లబ్ ఆఫ్ శింగరకొండ ఆధ్వర్యంలో రోటరీ కార్యాలయంలో చట్టాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షుడు బీవీపూర్ణచంద్రరావు, కార్యదర్శి ఏ. హరిప్రసాద్, ట్రెజరర్ గురుశేఖర్, వీరయ్య తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించే వరకు సమ్మె

అద్దంకిటౌన్, జూలై 17(ఆంధ్రజ్యోతి): మున్సిపల్ ఇంజనీరింగ్ కార్మికుల సమస్యలను ప్రభుత్వం పరిష్కరించే వరకు సమ్మెను విరమించబోమని అద్దంకి మున్సిపల్ ఇంజనీరింగ్ విభాగం అధ్యక్ష, కార్యదర్శులు జాను, యు. సామ్యూలులు అన్నారు. గురువారం గుంటూరులోని వడ్డేశ్వరంలో ఉన్న సీఅండ్‌డీఎంఏ ఆఫీస్ వద్ద ఏపీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో చేపట్టిన ధర్నాకి అద్దంకి మున్సిపల్ ఇంజనీరింగ్ విభాగం కార్మికులు ప్రత్యేక వాహనంలో తరలివెళ్లారు. మార్కు, జాషువా, రమేష్, మారుతి తదితరులు తరలివెళ్లారు.

64 మంది గ్రామ సచివాలయ సిబ్బంది బదిలీ

అద్దంకిటౌన్, జూలై 17(ఆంధ్రజ్యోతి): అద్దంకి మండలంలోని గ్రామ సచివాలయాలల్లో పని చేస్తున్న 64 మంది సిబ్బంది బదిలీ అయ్యారని ఎంపీడీవో బత్తిన సింగయ్య గురువారం తెలిపారు. బదిలీ అయిన వారిని విధుల నుంచి రిలీవ్ చేశామని ఆయన తెలిపారు.

ఎలక్ట్రీషియన్ అనుమానాస్పద మృతి

ఒంగోలు క్రైం, జూలై17(ఆంధ్రజ్యోతి): ఎలక్ట్రీషియన్ పనులు చేసే షేక్ అబ్దుల్ ఖాదర్ (34) అనుమానాస్పద రీతిలో మృతి చెందాడు. ఈ సంఘటన ఒంగోలులోని గోపీకృష్ణ థియేటర్ నుంచి శ్రీనివాస హాలుకు వెళ్లే దారిలో గల కట్టెల అడితి వద్ద జరిగింది. అబ్దుల్‌ఖాదర్ మురుగు కాలువలో పడి ఉన్నాడు. బలరాంకాలనీకి చెందిన క్యాటరింగ్ పనులు చేసే హర్షిత్‌కుమార్ గుర్తించి స్థానికుల సహాయంతో ఆయనను కాలువలో నుంచి బయిటకు తీసి 108 వాహనం ద్వారా రిమ్స్‌కు తరలించారు. అయితే అబ్దుల్‌ఖాదర్ అప్పటికే మృతి చెందిన ట్లు డాక్టర్లు చెప్పారు. కనిగిరి చెందిన అబ్దుల్‌ఖాదర్ ఒంగోలులోని గాంధీనగర్ లో నివాసం ఉంటూ ఎలక్ట్రీషియన్, పెయింట్ పనులు చేసుకుంటూ జీవిస్తున్నాడు. బుధవారం రాత్రి మద్య మత్తులో మురుగు కాలువలో పడి మృతి చెందినట్లు పోలీసులు ప్రాథమికంగా అంచనాకు వచ్చారు.

నిరుద్యోగభృతిని వెంటనే అమలు చేయాలి

ఒంగోలు కలెక్టరేట్, జూలై 17 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల సమయంలో నిరుద్యోగ యువతకు ఇచ్చిన హామీ మేరకు రూ.3వేలు నిరుద్యోగ భృతి చెల్లించాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గసభ్యుడు గుజ్జుల ఈశ్వరయ్య డిమాండ్ చేశారు. స్థానిక మల్లయ్యలింగం భవన్‌లో గురువారం ఏఐవైఎఫ్ సమావేశానికి రాష్ట్ర అధ్యక్షుడు యుగంధర్ అధ్యక్షత వహించి మాట్లాడుతూ నిరుద్యోగులకు ఉపాధి, ఉద్యోగ అవకాశాలు కల్పించాలన్నారు.


ఆధారాలు సేకరిస్తున్న క్లూస్ టీం

చీరాల పట్టణంలో చోరీ

- రూ. 5 లక్షల విలువచేసే బంగారు ఆభరణాలు, గ్యాస్ సిలిండర్‌ల అపహరణ
- క్లూస్ టీం ఆధారంగా వివరాలు సేకరిస్తున్న పోలీసులు

చీరాల, జూలై 17 (ఆంధ్రజ్యోతి) : కొద్ది రోజులుగా ఇంట్లో ఎవ్వరూ లేకపోవడం గమనించిన దుండగులు తాళాలు పగులకొట్టి బంగారు ఆభరణాలు, వస్తువులు అపహరించారు. అందిన వివరాల ప్రకారం పట్టణంలోని బాలికల ఉన్నత పాఠశాల సమీపంలో పల్లపోతు సాయిసుబ్రహ్మణ్యం ముందు వైపు కళ్లజోళ్ల దుకాణం నిర్వహిస్తూ వెనుక భాగం ఇంట్లో నివాసం ఉంటున్నారు. అయితే 15 రోజులుగా ఒంగోలులోని కుమారుని వద్దకు వెళ్లారు. దీంతో ఇంట్లో, దుకాణంలో ఎవరూ లేకపోవడం గమనించిన దుండగులు అర్ధరాత్రి షాపు, ఇల్లు తాళాలు పగులకొట్టి సుమారు 5 సవర్ల బంగారు ఆభరణాలు, రూ.40 వేల నగదు, 2 గ్యాస్ సిలిండర్‌లు, మరికొన్ని వస్తువులు అపహరించారు. ఉదయం ఇరుగు పొరుగు వారు గుర్తించి సమాచారం అందించడంతో హుటాహుటిన ఇంటికి చేరుకుని దొంగతనం జరిగినట్లు తెలుసుకున్నారు. వన్‌టౌన్ పోలీసులు సమాచారం అందించడంతో కేసు నమోదు చేసుకుని క్లూస్ టీం ద్వారా ఆధారాలు సేకరిస్తున్నారు.

పిడుగుపాటుకు మహిళ మృతి

సంతమాగులూరు జూలై 17 (ఆంధ్రజ్యోతి) : సంతమాగులూరు మండలం ఏల్చూరు గ్రామంలో పిడుగుపాటుకు గేదెలు కాస్తున్న మహిళ మృతి చెందగా, మరొకరికి గాయాలయ్యాయి.ఈ ఘటన గురువారం చోటుచేసుకుంది. స్థానికుల వివరాల మేరకు గ్రామంలోని సజ్జాపురం రోడ్డులో గేదెలు మేపుతున్న వారిపై పిడుగు పడింది. ఈ ఘటనలో అబ్బులగిరి పద్మ (47) అక్కడికక్కడే మృతి చెందింది. అదే గ్రామానికి చెందిన గేదెల కాపరి ఓరుగంటి సుబ్బారెడ్డికి గాయాలయ్యాయి. గాయపడిన వ్యక్తిని మెరుగైన వైద్యం నిమిత్తం నరసరావుపేట ఆసుపత్రికి తరలించారు. పద్మకి భర్త ఇద్దరు కుమారులు ఉన్నారు. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం నరసరావుపేటకు తరలించారు.


పిడుగుపాటుకు గురై మృతిచెందిన అబ్బలగిరి పద్మ

చికిత్స పొందుతూ వృద్ధురాలి మృతి

బల్లికురవ, జూలై 17 (ఆంధ్రజ్యోతి) : బైకుపై నుంచి జారి పడి వైద్యశాలలో చికిత్స పొందుతూ వృద్ధురాలు గుంటకల గోవిందమ్మ(56) గురువారం ఉదయం మృతి చెందింది. ఎస్ఐ వై. నాగరాజు కథనం ప్రకారం వినుకొండ మండలం నాగులవరంకు చెందిన గుంటకల గోవిందమ్మ మంగళవారం తన కుమారుని బైకుపై మార్టూరు వెళుతుండగా చెన్నుపల్లి గ్రామానికి వచ్చే సరికి ఆమెకు బీపీ పెరిగి బైకుపై నుంచి కింద పడి పోయింది. తీవ్ర గాయాలు అయిన వృద్ధురాలిని 108లో ముందుగా గుంటుపల్లి ప్రభుత్వ వైద్యశాలకు అనంతరం మెరుగైన వైద్యం కోసం గుంటూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. అక్కడ చికిత్స పొందుతు గురువారం మృతి చెందింది. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.


సాధునగర్ వద్ద రోడ్డు మార్జిన్‌లో బోల్తా పడ్డ కారు


గాయపడ్డ ఆంజనేయులు

లారీని ఓవర్‌టేక్ చేస్తూ
అదుపు తప్పి కారు బోల్తా

- బేల్దారి మేస్త్రి, కుటుంబసభ్యులకు గాయాలు

అద్దంకి,జూలై17(ఆంధ్రజ్యోతి): లారీని అధిగమించే క్రమంలో కారు అదుపు తప్పి రోడ్డు మార్జిన్‌లో బోల్తాపడింది. ఈ ప్రమాదంలో బేల్దారి మేస్త్రి ఆంజనేయులుతో పాటు కుటుంబసభ్యులు గాయపడ్డారు. పోలీసుల కథనం మేరకు మద్దిపాడు మండలం తెల్లబాడుకు చెందిన చీకటి ఆంజనేయులు హైదరాబాద్‌లో బేల్దారి మేస్త్రిగా ఉంటూ కూలీలతో పనులు చేయిస్తున్నారు. స్వగ్రామమైన తెల్లబాడు నుంచి గురువారం ఉదయం బయలుదేరి కూలీలు పనికి వెళ్లే సమయానికి హైదరాబాద్ చేరుకోవాలన్న ఉద్దేశంతో వెళ్తూ అద్దంకి మండలం సాధునగర్ వద్ద నామ్ రోడ్డులో ముందు వెళ్తున్న లారీని ఎడమ వైపు క్రాస్ చేస్తూ లారీ తగలటంతో కారు అదుపు తప్పి రోడ్డు మార్జిన్‌లో బోల్తా పడింది. బెలూన్‌లు తెరుచు కోవటంతో పెద్ద ప్రమాదం తప్పింది. ఈ ప్రమాదంలో ఆంజనేయులు, భార్య వనజ, కుమారుడు నిఖిల్, కుమార్తె దివ్యలకు గాయాలు అయ్యాయి. 108 వాహనంలో క్షతగాత్రులను అద్దంకి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. సంఘటనా స్థలాన్ని ఏఎస్సై వెంకటేశ్వర్లు పరిశీలించారు.

ఇంకొల్లు పోస్టాఫీసు అడ్రస్ మార్పు

ఇంకొల్లు,జూలై 17,(ఆంధ్రజ్యోతి) :ఇంకొల్లులోని పర్చూరు రోడ్డులో ప్రస్తుతం కొనసాగుతున్న పోస్టాఫీసును హనుమోజిపాలెం రోడ్డులోని హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకు సమీపంలోకి మార్చినట్లు సబ్‌పోస్ట్ మాస్టర్ జి.భార్గవ్‌కిరణ్ తెలిపారు.ఈ నెల 19 వతేదీ నుంచి 21 వరకు ఆఫీసును మార్చుతున్నందున ఎటువంటి లావాదేవీలు జరగవని, 22వ తేదీ నుంచి నూతనంగా మార్చిన కార్యాలయంలో విధులు నిర్వర్తిస్తామని తెలిపారు. వినియోగదారులు ఈ మార్పును గమనించాలని కోరారు.

పునరావాస కాలనీలలో పుట్టెడు సమస్యలు

- ఆలయాల నిర్మాణం పూర్తయ్యేదెప్పుడో..
- కొలిక్కిరాని శ్మశానాలకు స్థలం కేటాయింపు
- ఇబ్బందులు పడుతున్న ప్రజలు

అద్దంకి,జూలై17(ఆంధ్రజ్యోతి): గుండ్లకమ్మ రిజర్వాయర్ ముంపు గ్రామాల పునరావాస కాలనీలలో కనీస వసతుల మాట అటుంచి తప్పని సరిగా అవసరమైన దేవాలయాల నిర్మాణం, శ్మశానాలకు స్థలాల కేటాయింపు ఇంకా కొలిక్కిరాలేదు. సుమారు రెండు దశాబ్దాల క్రితం గుండ్లకమ్మ రిజర్వాయర్ నిర్మాణం ప్రారంభం కాగా, ఆయా గ్రామాలకు పునరావాస కాలనీలు కేటాయించారు. అయితే పునరావాస కాలనీలలో వసతుల కల్పనపై ప్రభుత్వాలు దృష్టి సారించలేదు. టీడీపీ ప్రభుత్వంలో కొంత మేర పనులు జరగగా, గత వైసీపీ ప్రభుత్వం పూర్తిగా నిర్లక్ష్యం చేసిందన్న విమర్శలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత ముంపు గ్రామాలు, పునరావాస కాలనీల ప్రజలలో ఆశలు ఒకింత చిగురించాయి. అయితే ఏడాది సమయం గడిచినా అసంపూర్తి పనులు పూర్తి చేయటంలో వేగం కనిపించక పోవటంతో కొంత నిరుత్సాహానికి గురవుతున్నారు. ప్రధానంగా సుమారు 15 సంవత్సరాల క్రితం వేణుగోపాలపురం పునరావాస కాలనీకి వెళ్లిన పాత కొటికలపూడి గ్రామస్థులు సుమారు 4 కి.మీ దూరంలో ఉన్న శ్మశాన వాటికనే వినియోగించుకోవాల్సి వస్తోంది. దీంతో మృతదేహాలను ఆటోలలో తీసుకువెళ్లాల్సి రావటం తో 3 వేల నుంచి 5 వేల రూపాయలు చెల్లించాల్సి రావటం భారంగా మారింది. ధేనువకొండ గ్రామస్థులకు నాలుగు చోట్ల పునరావాస కాలనీలు ఏర్పాటు చేయగా బలరామకృష్ణాపురంలో మాత్రమే శ్మశాన స్థలం కేటాయింపు జరిగింది. వేలమూరిపాడు సమీపంలోని పునరావాస కాలనీలో ఉండే కుటుంబాలు తమ కుటుంబసభ్యులలో ఎవరైనా మృతి చెందితే వేలమూరిపాడు శ్మశానానికి తీసుకు వెళ్ళాల్సి రావటంతో తరచూ వివాదాలు కొనసాగుతూనే ఉన్నాయి. ఇక దక్షిణ ధేనువకొండ, మేదరమెట్ల వద్ద కేటాయించిన పునరావాస కాలనీలకు ఇంకా ప్రజలు వెళ్లలేదు. మణికేశ్వరం, తిమ్మారెడ్డిపాలెంల పునరావాస కాలనీలలో మౌలిక వసతుల కల్పన జరగకపోవటంతో ఇంకా ప్రజలు పునరావాస కాలనీలకు వెళ్లలేదు. శ్మశాన స్థలాల కేటాయింపు కూడా జరగలేదు. దశాబ్దంన్నర క్రితం పునరావాస కాలనీలకు వచ్చిన వేణుగోపాలపురంలో వేణుగోపాలస్వామి, ఆంజనేయస్వామి దేవాలయాల నిర్మాణ పనులు పూర్తి కాక పోవటంతో బాలాలయం లోనే దశాబ్దాల తరబడి పూజలు నిర్వహిస్తున్నారు. ధేనువకొండ పునరావాస కాలనీలోని కాశీవిశ్వేశరస్వామి, వీరభద్ర స్వామి తదితర దేవాలయాల నిర్మాణం ఇంకా పూర్తి కాలేదు. తిమ్మారెడ్డిపాలెం, మణికేశ్వరం పునరావాస కాలనీలలో కూడా దేవాలయాల నిర్మాణ పనులు పూర్తి కాలేదు. ఇలా అన్ని సమస్యలతో పునరావాస కాలనీల ప్రజలు కాలం వెళ్లదీస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు, ప్రజా ప్రతినిధులు ప్రత్యేక దృష్టి సారించి సమస్యలు పరిష్కరించాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.


వేణుగోపాలపురం లో పూర్తి కాని వేణుగోపాలస్వామి, ఆంజనేయస్వామి దేవాలయాలు


తిమ్మారెడ్డిపాలెం పునరావాస కాలనీలో నిర్మాణంలో ఉన్న దేవాలయం

అవీ.. ఇవీ


ప్రమాణస్వీకార సభలో మాట్లాడుతున్న డాక్టర్ హృదయనాథ్

సొసైటీకి పూర్వవైభవం తీసుకురండి

మేదరమెట్ల, జూలై 17(ఆంధ్రజ్యోతి): రావినూతల సొసైటీకి పూర్వ వైభవం తీసుకురావాలని డాక్టర్ ఈదుపుగంటి హృదయనాథ్ అన్నారు. గురువారం రావినూతల సొసైటీ త్రిసభ్య కమిటీ ప్రమాణస్వీకార కార్యక్రమానికి హృదయనాథ్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ కార్యక్రమానికి జిల్లా క్రికెట్ అసోసియేషన్ కార్యదర్శి కారుసాల నాగేశ్వరరావు(బాబు) అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ గతంలో సొసైటీ ఎన్నో వ్యాపారాలు చేసి సభ్యులకు లాభాలు పంచిందన్నారు. వ్యవసాయ అభివృద్ధికి అవసరం అయిన ఎరువులను సకాలంలో అందించిన ఘనత సొసైటీదన్నారు. రైతులకు అవసరమైన పంట రుణాలను అందించడంలో సొసైటీ ముందుందన్నారు. చైర్మన్‌గా పుట్టా వెంకట్రావు, సభ్యులుగా చేబ్రోలు నాగేశ్వరరావు, నాదెండ్ల తిరుపతిరావులు ప్రమాణస్వీకారం చేశారు. ఈ కార్యక్రమంలో అనుబ్రోలు కస్తూరి, కారుసాల గురుబాబు, మోపర్తి వెంకట్రావు, మోపర్తి లక్ష్మీనారాయణ తదితరులు హాజరయ్యారు.


నల్లబర్లీ పొగాకు బేళ్ల జాబితాను పరిశీలిస్తున్న తహసీల్దార్ సింగారావు

నల్లబర్లీ కొనుగోలు కేంద్రం తనిఖీ

పంగులూరు, జూలై 17(ఆంధ్రజ్యోతి):రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన నల్లబర్లీ కొనుగోలు కేంద్రాలలో పొగాకు కొనుగోళ్లు పారదర్శకంగా జరిగేలా చూడాలని మండల తహసీల్దార్ సింగారావు సూచించారు. పంగులూరు మార్కెట్‌యార్డ్‌లో నిర్వహిస్తున్న నల్లబర్లీ పొగాకు కొనుగోళ్లను తహసీల్దార్ గురువారం పరిశీలించారు. గత నెల 30వతేదీ నుంచి బుధవారం వరకు జరిగిన రోజువారీ కొనుగోళ్లను గ్రేడ్‌ల వారీగా పరిశీలించారు. పంగులూరు కొనుగోలు కేంద్రంలో బుధవారం వరకు 2,391 బేళ్లు, (1984.88 క్వింటాళ్ల)ను రైతుల నుంచి కొనుగోలు జరిగిందని పీఏసీఎస్ సీఈవో నాగబోయిన లక్ష్మీదేవి తెలిపారు. హెచ్‌డీఆర్ 435 బేళ్లు(397.72 క్వింటాళ్లు),హెచ్‌డీఎం 961 బేళ్లు (839.65 క్వింటాళ్లు), హెచ్‌డీఎక్స్ 995 బేళ్లు (747.51 క్వింటాళ్లు) కొనుగోలు చేసినట్లు తెలిపారు. కొనుగోళ్లకు అనుమతించిన రైతులు మినహా ఎవరినీ కొనుగోలు కేంద్రంలోకి అనుమతించవద్దని తహసీల్దార్ సంబంధిత అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో బయ్యర్ మారెళ్ల శ్రీధర్‌బాబు, వీఆర్వో చింపారావు, పలువురు రైతులు పాల్గొన్నారు.


శిక్షణ కార్యక్రమంలో మాట్లాడుతున్న తహసీల్దార్ ప్రభాకరరావు

ఓటర్ల జాబితా తయారీలో బూత్ లెవల్ అధికారుల పాత్ర కీలకం

చినగంజాం, జూలై 17(ఆంధ్రజ్యోతి) : ఓటర్ల జాబితా తయారీలో బూత్ లెవల్ అధికారుల పాత్ర చాలా కీలకమని తహసీల్దార్ జీవిగుంట ప్రభాకరరావు అన్నారు. మండల ప్రజా పరిషత్ కార్యాలయ సమావేశపు హాల్‌లో మండల పరిధిలోని బూత్ లెవల్ అధికారులకు ఓటర్ల జాబితా చేర్పులు, మార్పులు, సవరణలపై గురువారం నిర్వహించిన ప్రత్యేక శిక్షణలో ఆయన పాల్గొని మాట్లాడారు. అర్హత కలిగిన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు కల్పించాలని బీఎల్వోలకు సూచించారు. బీఎల్వోలు ఓటర్ల జాబితా చేర్పులు, మార్పులు, సవరణలను ఎప్పటికప్పుడు ఎన్నికల కమిషన్ మార్గదర్శకాల ప్రకారం పారదర్శకంగా ఉండాలని అన్నారు. శిక్షకులు ఏఎస్‌వో శ్రీమన్నారాయణ బీఎల్వోలకు పలు అంశాలకు సంబంధించి శిక్షణ అందించారు. శిక్షణ అనంతరం వారికి ఆన్‌లైన్‌లో పరీక్ష నిర్వహించారు. పరీక్షలో ఉత్తీర్ణత సాధించిన వారికి ధ్రువీకరణ పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో ఎన్నికల డిప్యూటీ తహసీల్దార్ ఎం.మాధవీలత, బీఎల్వోలు, ఆపరేటర్లు, ఎన్నికల సిబ్బంది పాల్గొన్నారు.

అసత్య కథనాలపై పొగాకు రైతుల నిరసన

యద్దనపూడి,(మార్టూరు)జూలై17(ఆంధ్రజ్యోతి):పొగాకు రైతుల కోసం మార్క్‌ఫెడ్ ద్వారా కొనుగోలు కేంద్రాలను ఏర్పాటుచేయించిన పర్చూరు ఎమ్మెల్యే ఏలూరి సాంబ శివరావు కృషిని రైతులు అభినందిస్తుంటే దానిని చూసి ఓర్వలేని జగన్ పత్రిక రెండు రోజులు నుంచి అసత్య కథనాలను ప్రచురించడంపై గురువారం యద్దనపూడి మండలంలోని పొగాకు రైతులు ఆగ్రహం వ్యక్తం చేశారు. మండలంలో దాదాపుగా 2 వేల మంది రైతులు పొగాకు పంటను సాగు చేసి లక్షా 15 వేలకు పైగా క్వింటాళ్ల దిగుబడి సాధించారు.అయితే పండించిన పొగాకును అమ్ముకోలేక,కొనే నాథుడే లేక రైతు కుటుంబాలు మానసికంగా కుంగిపోతున్న తరుణంలోఎమ్మెల్యే ఏలూరి పర్చూరు మండలంలోని అడుసుమల్లిలో పొగాకు కొనుగోలు కేంద్రం ఏర్పాటుచేయించారు. కానీ రాజకీయకక్షతో రైతుల మధ్య ఐకమత్యాన్ని దెబ్బతీసే విధంగా, పొగాకు రైతులను అయోమయానికి గురిచేసే విధంగా తప్పుడు కథనాలను ప్రచురించిన జగన్ పత్రికపై రైతులు నిరసన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో నల్లపనేని రంగయ్య చౌదరి, బోయపాటి సాంబ శివరావు, రావిపాటి సీతయ్య, అమ్మినేని వెంకటేశ్వర్లు, గుదే తారక రామారావు తదితరులు పాల్గొన్నారు.


అడుసుమల్లిలో పొగాకు కొనుగోలు కేంద్రంవద్ద నిరసన తెలుపుతున్న యద్దనపూడి మండల పొగాకు రైతులు

చౌకబారు కుట్రలకు పాల్పడితే ఉపేక్షించం

- ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు
- కష్టాల్లో ఉన్న నల్లబర్లీ రైతులను ఆదుకున్న ప్రభుత్వం



పర్చూరు, జూలై 17 (ఆంధ్రజ్యోతి) : జగన్ పత్రిక తప్పుడు వార్తలను ప్రచురించి చౌకబారు కుట్రలకు పాల్పడుతోందని, అలాంటి వారిని ఉపేక్షించేది లేదని పర్చూరు ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పొగాకు రైతులపై ఎందుకీ పగ అనే శీర్షికతో ప్రచురితమైన ఏలూరి స్పందించారు. కష్టాల్లో ఉన్న బర్లీ రైతులకు ప్రభుత్వం అండగా నిలిచి, మార్క్‌ఫెడ్ ద్వారా నల్లబర్లీ పొగాకును కొనుగోలు చేస్తుంటే వారి ఆత్మస్థైర్యం దెబ్బతీసేలా కథనాన్ని రాశారని మండిపడ్డారు. ఇలాంటి తప్పుడు కథనాల వల్ల రైతులు మానసికంగా కుంగిపోతారన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సాహసోపేత నిర్ణయం తీసుకొని బర్లీ చరిత్రలో ఎక్కడా లేని విధంగా ప్రభుత్వం ద్వారా కొనుగోలు చేపట్టారని పేర్కొన్నారు. మూడు నెలల పాటు నిర్విరామంగా కొనుగోలు చేస్తామని వ్యవసాయశాఖ మంత్రి అచ్చెన్నాయుడు ప్రకటించారని గుర్తుచేశారు. రాజకీయ స్వార్థంతో తప్పుడు కథనాలు ప్రచురించటం తగదన్నారు.

జగన్, భారతికి బర్లీ రైతుల బహిరంగ లేఖ


జగన్, భారతికి రైతులు సంతకాలు చేసి రాసిన బహిరంగ లేక

పర్చూరు, జూన్ 17 (ఆంధ్రజ్యోతి) : రైతుల మనో భావాలను దెబ్బతేసే విధంగా జగన్ పత్రిలో ప్రచురితమైన వార్త కథనానికి సంబంధించి వైసీపీ అధినేత జగన్మోహన్ రెడ్డి, సాక్షి దినపత్రిక చైర్ పర్సన్ వైఎస్ భారతికి పర్చూరు నియోజవర్గ బర్లీ రైతులు గురువారం బహిరంగ లేఖ రాశారు. లేఖ సారాంశం ఇలా...వ్యవసాయమే ఆధారంగా జీవనం సాగిస్తున్న కర్షకులం,... మేము పండించిన పంట ఉత్పత్తులకు గిట్టుబాటు ధర లేక ఆందోళనలో మునిగిన తరుణంలో ప్రభుత్వం మా ఇబ్బందులను గుర్తించి, మా కష్టాలను తీర్చేందుకు ప్రత్యక్షంగా మార్క్‌ఫెడ్ ద్వారా పొగాకు కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసి ఆదుకుంది. రాజకీయాలకు, పార్టీలకు అతీతంగా రైతుల వద్ద నుంచి పొగాకును ప్రభుత్వం కొనుగోలు చేస్తున్న తరుణంలో మా ఆత్మస్థైర్యాన్ని దెబ్బతేసే విధంగా మీ పత్రికలో అసత్య వార్తలు రాస్తూ మా మనో ధైర్యాన్ని దెబ్బతీస్తున్నారు అంటూ 50 మంది రైతులు సంతకాలతో కూడిన బహిరంగ లేఖను రాశారు.

ఎరువులు, విత్తనాల షాపులలో తనిఖీలు

అద్దంకిటౌన్, జూలై 17(ఆంధ్రజ్యోతి): అద్దంకిలోని ఎరువులు, పురుగు మందులు, విత్తనాల షాపులలో గురువారం వ్యవసాయశాఖ, విజిలెన్స్ అధికారులు తనిఖీలు నిర్వహించారు. ఆయా షాపులలో ఎరువులు, పురుగుమందులు, విత్తనాలను పరిశీలించడంతో పాటు వాటికి సంబంధించిన బిల్లులు, పుస్తకాలు సక్రమంగా ఉన్నాయా లేదా అని తనిఖీ చేశారు. ఈ సందర్భంగా విజిలెన్స్ ఏడీ ఏ. శ్రీనివాసరావు మాట్లాడుతు వ్యవసాయశాఖ డైరెక్టర్ ఆదేశాల మేరకు జిల్లాలోని అన్ని ఎరువులు, పురుగుమందులు, విత్తనాల షాపులలో తనిఖీలు నిర్వహిస్తున్నామన్నారు. దానిలో భాగంగానే అద్దంకిలోని షాపులను తనిఖీ చేశామని, అన్నీ సక్రమంగా ఉన్నాయని తెలిపారు. ఈ తనిఖీలలో విజిలెన్స్ సీఐ చంద్రశేఖర్, అద్దంకి డివిజన్ ఏడీఏ ఎఫ్రాయిమ్, బాపట్ల టెక్నికల్ ఏవో మోహనరెడ్డిలు ఉన్నారు.


అద్దంకిలోని ఎరువుల దుకాణంలో తనిఖీలు చేస్తున్న విజిలెన్స్ అధికారులు

యూరియా అమ్మకాల నిలిపివేత

వ మా ర్టూ రు, జూలై17(ఆంధ్రజ్యోతి): మండలంలోని కోలలపూడి, మార్టూరు గ్రామాలలోని ఎరువుల దుకాణాలను విజిలెన్స్, వ్యవసాయ శాఖ స్క్వాడ్ అధికారులు గురువారం తనిఖీలు చేశారు.ఈ సందర్భంగా కోలలపూడి గ్రామంలోని వీఎస్ఆర్ సీడ్స్ షాపులో తనిఖీలు చేయగా యూరియా ఎరువుకు సంబంధించి సరైన పత్రాలు లేకపోవడంతో వాటి అమ్మకాలను నిలిపివేయాలని ఆదేశించారు. అదేవిధంగా పోస్టల్ సీడ్స్ షాపులో మూడు మిరప విత్తనాల నమూనాలను సేకరించి వాటిని ల్యాబ్‌కు పంపిస్తున్నామన్నారు. అలాగే మార్టూరులో కోస్టల్ హైబ్రిడ్ సీడ్స్ దుకాణంలో తనిఖీలు చేశారు. ఈ కార్యక్రమంలో కృష్ణాజిల్లా మైలవరం ఏడీఏ శ్రీనివాసరావు, విజిలెన్స్ సీఐ చంద్రశేఖర్, మండల వ్యవసాయఅధికారిణి లావణ్య తదితరులు పాల్గొన్నారు.


కోలలపూడిలోని ఎరువుల షాపులో తనిఖీలు చేస్తున్న విజిలెన్స్ అధికారులు

చినగంజాం ఎంపీడీవోగా విజయ

చినగంజాం, జూలై 17(ఆంధ్రజ్యోతి): మండల పరిషత్ అభివృద్ధి అధికారిణిగా ఎస్.విజయ గురువారం బాధ్యతలు చేపట్టారు. ప్రకాశం జిల్లా దోర్నాల ఎంపీడీవోగా పనిచేస్తూ ఇన్‌చార్జ్ ఎంపీడీవోగా ఇక్కడకు వచ్చారు. పూర్తి అదనపు బాధ్యతలతో ఇక్కడ పనిచేస్తున్న ఇంకొల్లు ఎంపీడీవో జి.శ్రీనివాసరావు స్థానంలో బాధ్యతలు చేపట్టారు. నూతనంగా బాధ్యతలు చేపట్టిన ఇన్‌చార్జ్ ఎంపీడీవో విజయను కార్యాలయ సిబ్బంది, గ్రామ కార్యదర్శులు మర్యాద పూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు.



మొక్కల పెంపకంతో పర్యావరణ పరిరక్షణ

ఇంకొల్లు,జూలై 17,(ఆంధ్రజ్యోతి) : మొక్కలను పెంచడంతో పర్యావరణాన్ని పరిరక్షించుకోవచ్చునని ఇంకొల్లు ఆఫీసర్స్ క్లబ్ అధ్యక్షుడు కరి అమ్మయ్యచౌదరి అన్నారు.గురువారం ఇంకొల్లులోని కొణికి రోడ్డులో 30 కదంబ మొక్కలను నాటారు.ఈ కార్యక్రమంలో ది ఇంకొల్లు ఆఫీసర్స్ క్లబ్ కార్యదర్శి మాగులూరి రవీంద్ర, సభ్యులు కరణం పున్నయ్యచౌదరి,పంగులూరి హనుమయ్యశివయ్య తదితరులు పాల్గొన్నారు.

ఎంపీని కలిసిన మార్కెట్ యార్డు వైస్ చైర్మన్

బల్లికురవ, జూలై 17 (ఆంధ్రజ్యోతి) : సంతమాగులూరు వ్యవసాయ మార్కెట్ యార్డు వైస్ చైర్మన్‌గా బాధ్యతలు తీసుకున్న దేవినేని నరేంద్ర గురువారం బాపట్లలో ఎంపీ తేన్నేటి కృష్ణ ప్రసాద్‌ను కలిశారు. ఈసందర్భంగా వైస్ చైర్మన్‌కు ఎంపీ శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఎంపీకి దేవినేని నరేంద్ర కృతజ్ఞతలు తెలిపారు. మార్కెట్‌యార్డు అభివృద్ధికి చేయూత ఇవ్వాలని విన్నవించారు. అలానే విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ కృషితో ప్రభుత్వం ద్వారా ప్రత్యేక నిధులు మంజురు అయ్యేలా కృషి చేస్తానని వైస్ చైర్మన్ ఈసందర్భంగా ఎంపీకి వివరించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నేతలు వసంత వేణుబాబు, అమరనేని వినోద్ తదితరులు ఉన్నారు.


ఎంపీ కృష్ణప్రసాద్‌ను కలిసి కృతజ్ఞతలు తెలుపుతున్న మార్కెట్ యార్డు వైస్ చైర్మన్ దేవినేని నరేంద్ర

ఘనంగా కారంచేడు మృత వీరుల సంస్మరణ సభ

విజయనగర్‌కాలనీ(చీరాల), జూలై 17 (ఆంధ్రజ్యోతి) : దేశానికి స్వాతంత్ర్యం ఎలాంటిదో దళితులకు కారంచేడు ఉద్యమం అటువంటిదని పలు దళిత, బహుజన, ప్రజా సంఘాల నేతలు పేర్కొన్నారు. గురువారం మండల పరిధిలోని విజయనగర్ కాలనీ రుధిర క్షేత్రం వద్ద కారంచేడు మృత వీరుల 40వ సంస్మరణ సభ ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా పలు సంఘాల నేతలు హాజరయి రుధిర క్షేత్రంలో ఘన నివాళులు అర్పించారు. కార్యక్రమంలో లిడ్‌క్యాప్ చైర్మన్ పిల్లి మాణిక్యరావు, ఆల్ ఇండియా బీఎస్పీ అధ్యక్షురాలు బక్కా పరంజ్యోతి, ఎంఆర్‌పీఎస్ జాతీయ అధ్యక్షులు మున్నంగి నాగరాజు, బీఎస్పీ మాజీ ఎమ్మెల్యే రాజారావు, నాయకులు దుడ్డు భాస్కరరావు, సుబ్బారావు, ప్రసాద్, దేవదానం, ఏసుపాదం, లక్ష్మీ నరసయ్య, బలహీన వర్గాల సమాఖ్య ప్రతినిధి గోసాల ఆశీర్వాదం, మాల మహానాడు ప్రతినిధులు శబ్బూలం రోజన్‌బాబు, రాజారావు పాల్గొన్నారు.


అమరవీరులకు నివాళులు అర్పిస్తున్న పలు సంఘాల నాయకులు

పాత పెన్షన్ కోసం నేడు ధర్నా

నెల్లూరు(విద్య), జూలై 17 (ఆంధ్రజ్యోతి) : పాత పెన్షన్ పథకం అమలు చేయాలని డిమాండ్ చేస్తూ డీఎస్సీ - 2003 టీచర్స్ ఫోరం పోరాటానికి సన్నద్ధమయ్యింది. శుక్రవారం కలెక్టరేట్ ఎదుట ధర్నాకు పిలుపునిచ్చింది. దీనికి ఉపాధ్యాయ సంఘాలు మద్దతు ప్రకటించాయని ఆ ఫోరం జిల్లా కన్వీనర్లు సుబ్బయ్య, మాన ప్రసాద్ ఓ ప్రకటనలో పేర్కొన్నారు. తాము చేస్తున్న పోరాటానికి ఉపాధ్యాయులు పెద్ద ఎత్తున తరలిరావాలని కోరారు. ఈ ధర్నాకు మద్దతు ప్రకటిస్తున్నట్లు ఆపస్ జిల్లా అధ్యక్షుడు కేకే రాజగోపాలాచారి, ప్రధాన కార్యదర్శి పీ అనిల్‌కుమార్ మరో ప్రకటనలో పేర్కొన్నారు.

> 'మేము చెప్పిన వాళ్లకే ముందుగా ఎరువుల బస్తాలు ఇవ్వాలి. మిగిలినవి కూడా ఎవరికి ఇస్తున్నారో ముందుగా మాకు చెప్పాలి. మాకు తెలియకుండా ప్రతిపక్ష పార్టీ సానుభూతిపరులకు ఒక్క బస్తా ఇచ్చినా పద్ధతిగా ఉండదు. అంతేకాదు.. మాకు తెలియకుండా ఇండెంట్ కూడా పెట్టకూడదు. ఎవరికీ ఇవ్వకూడదు.'
>
> - మండల వ్యవసాయాధికారులు (ఎంఏవో), గ్రామ వ్యవసాయ సహాయకులు (వీఏఏ)లకు అధికార పార్టీ నాయకుల నుంచి వస్తున్న హెచ్చరికలవి.

జిల్లాలో ఇప్పటివరకు అవసరానికి మించి యూరియా పంపిణీ చేశామని వ్యవసాయ శాఖ అధికారులు చెబుతునా సొసైటీలు, రైతు సేవా కేంద్రాలకు రైతుల తాకిడి మాత్రం తగ్గడం లేదు. దీనికి ప్రధాన కారణం రాజకీయ నాయకుల జోక్యమేనన్న విషయం అందరికీ తెలిసిందే. అధికార దర్పం ప్రదర్శించి అవసరానికి మించి కొంత మంది మండల, గ్రామస్థాయి నాయకులు వందల బస్తాలను తరలిస్తున్నారు. దీంతో రైతులకు యూరియా దొరకడం లేదు. కొంతమంది పంటలు సాగు చేయకపోయినా యూరియాను ఇళ్లకు తరలించుకుంటున్నారు. ఇదేమిటని ప్రశ్నించే పరిస్థితి ఎంఏవోలు, వీఏఏలకు లేకుండా పోయింది. దీంతో చేసేదిలేక చిన్న, సన్నకారు రైతులు ప్రైవేటు వ్యాపారులను ఆశ్రయిస్తున్నారు. ఇదే అదునుగా తీసుకుని వ్యాపారులు కూడా అధిక ధరలకు లేదంటే యూరియాతోపాటు డీఏపీ లేదా పురుగు మందులు కొనుగోలు చేయాలనే షరతులు పెడుతున్నారు.

మేం చెప్పినోళ్లకే!





ఆత్మకూరు సిండికేట్ ఫార్మర్స్ సొసైటీ కార్యాలయం వద్ద ఎరువుల కోసం పడిగాపులు కాస్తున్న అన్నదాతలు (ఫైల్)

- వారికిచ్చారో పద్ధతిగా ఉండదు!
- యూరియా పంపిణీలో అధికార పార్టీ నాయకుల తీరిది!
- 2,50,787 ఎకరాల్లో పంటల సాగు.. పంపిణీ చేసింది 40వేల మెట్రిక్ టన్నులు
- అవసరానికి మించి ఇచ్చామంటున్న వ్యవసాయ శాఖ
- యూరియా దొరక్క చిన్న, సన్నకారు రైతుల అవస్థలు
- సమాధానం చెప్పలేక తలలు పట్టుకుంటున్న ఎంఏవోలు, వీఏవోలు

జిల్లాలో సాగునీరు పుష్కలంగా ఉండటంతో ఈ ఖరీఫ్‌లో సాధారణ విస్తీర్ణం కంటే దాదాపు 57వేల ఎకరాలకుపైగా వరిసాగు పెరిగినట్లు లెక్కలు చెబుతున్నాయి. ఇప్పటివరకు 1,55,975 ఎకరాల్లో వరిసాగు అయినట్లు వ్యవసాయ శాఖ అధికారులు చెబుతున్నారు. అలాగే, మరో 94,812 ఎకరాల్లో ఇతర పంటలు సాగవుతున్నాయి. సాగునీరు పుష్కలంగా ఉండడంతో ఈ సీజన్‌లో క్రాప్ హాలిడే ప్రకటించే కొన్ని మండలాల్లో సైతం అన్నదాతలు వరి సాగుకు ముందుకొచ్చారు. మొత్తంగా 2,50,787 ఎకరాల్లో వివిధ పంటలు సాగవుతున్నాయి.

● ఎకరానికి 3 బస్తాలు మాత్రమే

ఎకరాకి 3 బస్తాల యూరియా మాత్రమే వ్యవసాయ శాఖ అందిస్తోంది. ఈ ప్రాతిపదికనే ప్రభుత్వం యూరియా సరఫరా చేస్తోందని వ్యవసాయ శాఖ అధికారులు చెబుతున్నారు. వరినాట్ల తరువాత 12 రోజులకు, 25 రోజులకు, 35 రోజులకు మూడు దఫాలుగా మొత్తం 135 కేజీల యూరియా సిఫార్సు చేస్తారు. ఈ లెక్కన జిల్లాలో సాగవుతున్న 1,55,975 ఎకరాల్లోని వరిసాగుకు 21,056 మెట్రిక్ టన్నుల యూరియా అవసరం. అయితే ఇప్పటివరకు 33,853 మెట్రిక్ టన్నుల యూరియాను పంపిణీ చేసినట్లు వ్యవసాయ శాఖ లెక్కలు చెబుతున్నాయి. కొంతమంది రైతులు ఎకరాకి 5 బస్తాలకు మించి కూడా వినియోగిస్తున్నారు. ఇతర పంటలకు పంపిణీ చేసిన యూరియాతో కలిపి మొత్తం ఇప్పటివరకు దాదాపుగా 40వేల మెట్రిక్ టన్నులు జిల్లావ్యాప్తంగా పంపిణీ చేయడం జరిగింది. ఇందులో సగానికిపైగా యూరియా ఆర్ఎస్కేలు, సొసైటీల ద్వారా రైతులకు అందజేసినట్లు వ్యవసాయశాఖ అధికారులు చెబుతున్నారు.

● యూరియా ఎటుపోతోంది!?

జిల్లావ్యాప్తంగా అవసరానికి మించి యూరియా అందిస్తున్నామని వ్యవసాయశాఖ అధికారులు చెబుతున్నా రైతులు యూరియా కోసం సొసైటీలు, ఆర్ఎస్కేలకు ఎందుకు వస్తున్నారు? రైతులకు అందుబాటులో పెట్టిన యూరియా ఏమైపోతోందని

- మిగతా 7లో..

జిల్లాకు మేలు జరిగేలా

- నేడు జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశం
- మొక్కుబడిగా అజెండా
- సమగ్ర చర్చ అవసరం

జడ్పీ సభ జరిగేనా ?

- గత సభల్లో కనిపించని ముఖ్యులు
- ఈసారైనా సభ్యులంతా హాజరయ్యేనా?

నెల్లూరు (జడ్పీ), జూలై 16(ఆంధ్రజ్యోతి): జిల్లా ప్రజా పరిషత్ సర్వసభ్య సమావేశం శుక్రవారం జరగనుంది. ఈ సమావేశానికి అజెండా ను మొక్కుబడిగా రూపొందించారు. కేవలం పంచాయతీరాజ్, డ్వామా, జిల్లా గ్రామీణాభివృద్ధి, విద్యా, విద్యుత్ శాఖలపై సమీక్ష జరిపేలా అజెండాలో పేర్కొన్నారు. జడ్పీ చైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ అధ్యక్షతన ఈ సమావేశాన్ని ఉదయం 10:30 గంటల నుంచి జడ్పీ కార్యాలయ సమావేశ మందిరంలో నిర్వహించనున్నారు.



నిలిచిన హౌసింగ్ బిల్లులు

జిల్లాలో గృహ నిర్మాణ శాఖకు సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం కొంత వేగవంతం చేసిన పనులకు దాదాపు రూ.4కోట్ల మేర బిల్లులు నిలిచిపోయాయి. కాంట్రాక్టర్లు, లబ్ధిదారులు పనులను అనుకున్నంత స్థాయిలో నిర్వహించడం లేదన్న ఆరోపణలున్నాయి. దీంతో ప్రభుత్వ లక్ష్యానికి అనుగుణంగా వచ్చే ఏడాది మార్చికి గృహనిర్మాణాల ప్రారంభం ప్రశ్నార్థకంగా మారింది. అలాగే డ్వామా ఆధ్వర్యంలో జరుగుతున్న పల్లె పండుగ కార్యక్రమానికి సంబంధించి దాదాపుగా 40శాతం బిల్లులు ఆగాయి. అనేక పనులు పూర్తి కాలేదు. ఆదేశాఖ ఆధ్వర్యంలో ఉద్యాన పంటలు పెద్దఎత్తున సాగుచేసేలా ప్రభుత్వం కసరత్తు చేస్తోంది. ఈ పంటలు నియోజకవర్గాల పరిధిలో ఎక్కువ భాగం ఏర్పాటు చేయాలంటే సభ్యులంతా సమావేశానికి హాజరై చర్చించాల్సిన అవసరం ఉంది. ఇక, విద్యుత్ శాఖ విషయానికి వస్తే పల్లెలకు త్రీఫేస్ కరెంటు ఏర్పాటు చేసే పనులు మూడేళ్లుగా నత్తనడకన సాగుతూనే ఉన్నాయి. మరోవైపు జిల్లా పరిషత్ ఆదాయ వనరులు అంతంత మాత్రంగా ఉంటున్నాయి. అటు ప్రభుత్వంతోపాటు, ఇటు సాధారణ నిధులు సమకూర్చి జడ్పీ ఆర్థికాభివృద్ధికి పాలకులు బాటలు వేయాల్సిన అవసరం ఉంది. అలాగే జిల్లాలో తాగునీటి పథకాల పనులను వేగవంతం చేయాల్సి ఉంది. వీటన్నింటిపై సమగ్ర చర్చ జరిగితేనే జిల్లాకు మేలు జరుగుతుంది. దీనికి పాలకులతోపాటు, ఉన్నతాధికారులంతా సమావేశానికి హాజరు కావడం అవశ్యం.

గత సభలు నీరసంగా...

కొంత కాలంగా జడ్పీ సమావేశాలు మొక్కుబడిగా సాగుతున్నాయి. మార్చి నెలలో బడ్జెట్‌తోపాటు ఇతర అంశాలపై చర్చించేందుకు సమావేశం ఏర్పాటు చేసినప్పటికీ కోరం లేక ఆ సమావేశం వాయిదా పడింది. ఏప్రిల్ 30న అదే సమావేశాన్ని తిరిగి నిర్వహించారు. ఆ సమావేశానికి మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు తదితర ముఖ్యమైన సభ్యులు హాజరుకాలేదు. ఆ సమావేశాన్ని కేవలం బడ్జెట్ ఆమోదానికే సరిపెట్టారు. ఈ నేపథ్యంలో శుక్రవారం జరిగే సమావేశానికైనా సభ్యులందరూ వస్తారా అన్న సందేహాలు వ్యక్తమవుతున్నాయి.

సోమశిలకు పెరిగిన వరద

అనంతసాగరం జూలై 17 (ఆంధ్రజ్యోతి): సోమశిల జలాశయానికి ఎగువ ప్రాంతాల నుంచి వస్తున్న వరద ప్రవాహం పెరిగింది. బుధవారం 2,806 క్యూసెక్కులు రాగా గురువారానికి 3,044 క్యూసెక్కులకు చేరింది. ప్రస్తుతం డ్యాంలో 28 టీఎంసీల నీరు నిల్వ ఉండగా, ఉత్తర కాలువకు 375, దక్షిణ కాలువకు 400, పెన్నాడెల్టాకు 3,750 క్యూసెక్కుల నీటిని సరఫరా చేస్తున్నారు.

కాజ్‌వేకు పెరిగిన అంచనా

- ప్రస్తుతం రూ.93 కోట్లతో ఫేజ్-1 పనులు
- ఫేజ్-2కు మరో రూ.90 కోట్లు అవసరం
- అంచనాలు రూపొందించిన అధికారులు
- అనుమతుల మంజూరుకు ప్రజాప్రతినిధులపైనే భారం

నెల్లూరు, జూలై 17 (ఆంధ్రజ్యోతి) : తీర ప్రాంత మండలాల కనెక్టివిటీలో కీలకమైన ముదివర్తి-ముదివర్తిపాలెం కాజ్ వే నిర్మాణం కీలక దశకు చేరుకుంది. ఇప్పటివరకూ ఫేజ్-1 కింద 40 శాతం వరకూ పనులు పూర్తి కాగా, ఫేజ్-2 పనులకు అనుమతులు తెచ్చుకోవాల్సిన సమయం ఆసన్నమైంది. ముదివర్తి-ముదివర్తిపాలెం మధ్య కాజ్ వే నిర్మాణానికి సుమారు రూ.97 కోట్లు ఖర్చవుతుందని ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపారు. 2021లో ప్రభుత్వం రూ.93 కోట్లకు పరిపాలనా అనుమతులు మంజూరు చేసింది. అయితే సాంకేతిక కారణాలతో ఆ ప్రాంతం నుంచి కింది భాగంలో నిర్మించేందుకు తీర్మానించారు. మొదట 3.5 లక్షల క్యూసెక్కుల డిశ్చార్జికి తగ్గట్లు కాజ్ వేను రూపొందించగా, ఆ తర్వాత 7 లక్షల క్యూసెక్కుల డిశ్చార్జిని కూడా తట్టుకునేలా అంచనాలు వేశారు. 2022లో మిగిలిన పనులకు ఎస్టిమేషన్లు వేయగా రూ.50 కోట్ల వరకూ అవసరమవుతుందని ఇరిగేషన్ ఇంజనీర్లు తేల్చారు. ఈ విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లగా.. ముందు పరిపాలన అనుమతులు ఇచ్చిన రూ.93 కోట్లతో ఫేజ్-1 కింద కాజ్ వే నిర్మాణ పనులు మొదలుపెట్టాలని ఆదేశించింది. దీంతో వెంటనే టెండర్లు పిలిచారు. అయితే ఆ తర్వాత బిల్లుల సమస్యతో చాలా కాలం పనులు సాగలేదు. గతేడాది ప్రభుత్వం మారాక ఈ పనుల్లో వేగం పుంజుకుంది. ఇప్పటి వరకూ సుమారు 40 శాతం మేర పనులు జరిగాయి. అప్‌స్ట్రీమ్ వైపు 200 మీటర్ల వరకూ షీట్ ఫైల్స్‌ను అమర్చగా, డౌన్ స్ట్రీమ్ వైపు 800 మీటర్ల వరకూ షీట్‌ఫైల్స్ ఏర్పాటు పూర్తి చేశారు. ఇటీవల రూ.17.50 కోట్ల బిల్లును ఇరిగేషన్ అధికారులు అప్‌లోడ్ చేశారు. అయితే ఇంకా బిల్లు విడుదల కాలేదు. దీంతో పనులు కొంత నెమ్మదించాయి.

● తీర ప్రాంతాలకు అత్యవసరం

ముదివర్తిపాలెం కాజ్ వే నిర్మాణంలో ఫేజ్-2 కింద మిగిలిన 500 మీటర్ల నిర్మాణానికి అనుమతులు రావాల్సి ఉంది. అలానే అటు వైపు ముదివర్తి, ఇటువైపు ముదివర్తిపాలెం వరకూ అప్రోచ్ రోడ్లు నిర్మించాల్సి ఉంది. ఇందుకు కొంత మేర భూసేకరణ కూడా చేయాల్సి ఉంటుంది. ఇందుకోసం అదనంగా మరో రూ.90 కోట్ల వరకూ అవసరమవుతాయని అధికారులు అంచనా వేశారు. ఈ ప్రతిపాదనలకు సీఈ కూడా ఆమోద ముద్ర వేశారు. కాజ్‌వే నిర్మాణంలో ఫేజ్-2 పనులే కీలకం. ఈ నేపథ్యంలో ఈ పనులకు అనుమతులు సాధించాల్సిన బాధ్యత ప్రజాప్రతినిధులపైనే ఉంది. తీర ప్రాంత ప్రజలకు కాజ్ వే నిర్మాణం ఎంతో అవసరం. ఇందుకూరుపేట, టీపీ గూడూరు, ముత్తుకూరు, విడవలూరు, కొడవలూరు, అల్లూరు మండలాల ప్రజలకు కాజ్ వే ఎంతగానో ఉపయోగపడుతుంది. ప్రస్తుతం నెల్లూరుకు దిగువన పెన్నాకు ఇరువైపులా ఉన్న మండలాల ప్రజలు అటు, ఇటు వెళ్లాలంటే నెల్లూరును చుట్టు తిరిగి వెళ్లాల్సి వస్తోంది. కాజ్ వే నిర్మాణం పూర్తయితే వారందరికీ రవాణా భారం తగ్గుతుంది.



కాజ్ వే నిర్మాణంలో భాగంగా పెన్నా నదిలోకి దించుతున్న షీట్‌ఫైల్స్

అంచనాలు తయారు చేస్తున్నాం

ముదివర్తిపాలెం కాజ్ వే నిర్మాణానికి సంబంధించి కొంత మేర పనులకు మాత్రమే మొదట అనుమతులు వచ్చాయి. వాటినే ఇప్పుడు చేస్తున్నాం. మిగిలిన పనులకు సంబంధించి అంచనాలు రూపొందిస్తున్నాం. ఇటీవల సీఈ కూడా వచ్చి పరిశీలించారు. త్వరలోనే ఈ ప్రతిపాదనలు ప్రభుత్వానికి పంపుతాం.

- దేశానాయక్, ఇరిగేషన్ ఎస్ఈ



వెంగమాంబకు చీర, సారె సమర్పించేందుకు ఊరేగింపుగా వస్తున్న భక్తులు

ఉత్సవం

నర్రవాడలోని వెంగమాంబ పేరంటాలు అమ్మవారి నెల పొంగళ్ల ఉత్సవం గురువారం వేడుకగా జరిగింది. భారీగా తరలివచ్చిన భక్తులు అమ్మవారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. అలాగే సమరసత సేవా ఫౌండేషన్ ఆధ్వర్యంలో మహిళలు చీర, సారె సమర్పించి ప్రత్యేక పూజలు చేశారు.

- వివరాలు 8లో...

పేదల గడప..

పెద్దల చలువ!

- పీ 4 అమలుకు ముమ్మర కసరత్తు
- 1,06,878 బంగారు కుటుంబాల గుర్తింపు
- 837 మంది మార్గదర్శకుల ఎంపిక

నెల్లూరు(హరనాథపురం), జూలై 17 (ఆంధ్రజ్యోతి) : పేదరిక నిర్మూ లనే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం నిర్మాణాత్మక అడుగులు వేస్తోంది. ప్రభుత్వ ప్రైవేటు, ప్రజల భాగస్వామ్యం (పీ4) అనే బృహత్తర కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. నిరుపేద కుటుంబాలను సంపన్నులు దత్తత తీసుకుని వారి ఆర్థికాభివృద్ధికి చేయూత ఇవ్వాల న్నది ఈ పథకం ముఖ్య ఉద్దేశం. ఇళ్ల స్థలాలు ఇవ్వడం, ఇళ్లు నిర్మించడం, పారిశుధ్యం సౌకర్యాలు కల్పించడం, నూరు శాతం కొళాయి కనెక్షన్లు ఇవ్వటం, విద్యుత్ సరఫరా తదితరాలు ఈ కార్యక్రమం ద్వారా అందే లా చూస్తారు. ఈ కార్యక్రమానికి విరాళాలిచ్చే వారిని మార్గదర్శులని, ఆర్థిక బలహీనమైన లబ్ధిదారుల కుటుంబాలను బంగారు కుటుంబాలని పిలుస్తారు. ఎన్నారైలతో పాటు పేదలకు మద్దతుగా నిలిచేందుకు స్వచ్ఛందంగా ఈ కార్యక్రమంలో ఎవరైనా భాగస్వాములు కావచ్చు. జిల్లావ్యాప్తంగా 1,06,878 బంగారు కుటుంబాలను గుర్తించగా, ఈ కుటుంబాలలో 2,84,610 మంది సభ్యులు ఉన్నారు.

● 837 మంది మార్గదర్శులు

ఇప్పటివరకు 837 మార్గదర్శులను జిల్లాలో ఎంపిక చేశారు. ఈ మార్గద ర్శులు 4,609 కుటుంబాలను దత్తత తీసుకున్నారు. మార్గదర్శుల ఎంపికకు గ్రామస్థాయిలో సచివాలయ ఉద్యోగు లతో కమిటీలను ఏర్పాటు చేశారు. జిల్లాస్థాయి, మండల స్థాయి అధికారు లు మార్గదర్శుల ఎంపిక కోసం పని చేస్తున్నారు. ఈ ప్రకియ అంతా ఈ నెల 15వ తేదీ నాటికి పూర్తయ్యింది. జిల్లా ప్రణాళికాధికారి లక్ష్మీనరసింహులు రోజువారీ డేటా తదితరాలు సేకరిస్తున్నారు.

స్వచ్ఛ సర్వేక్షణ్‌లో నెల్లూరుకి రాష్ట్రంలో 4వ స్థానం

● జాతీయ స్థాయిలో 37వ ర్యాంకు

నెల్లూరు (సిటీ), (ఆంధ్రజ్యోతి) : స్వచ్ఛసర్వేక్షణ్‌లో నెల్లూరు నగరానికి రాష్ట్రస్థాయిలో 4వ స్థానం, జాతీయ స్థాయిలో 37వ ర్యాంకు దక్కినట్లు కమిషనర్ నందన్ ఒక ప్రకటనలో తెలిపారు. 2024-25 వార్షిక స్థానాలు, ర్యాంకులు వెల్లడయ్యాయని తెలిపారు. పారిశుధ్యం, ఘన వ్యర్థాలు శాస్త్రీయంగా నిర్వహణ, రీసైక్లింగ్ కేంద్రాలు, ప్రజామరుగుదొడ్లు తదితర అంశాలు ర్యాంకుల సాధనకు కారణాలైనట్లు పేర్కొన్నారు. రాష్ట్ర పురపాలక శాఖ మంత్రి నారాయణ సూచనలతోనే ఈ ర్యాంకులు సాధించడానికి దోహదపడ్డాయన్నారు. అధికారులు, ఉద్యోగులు, కార్మికుల కృషి అభినందనీయమన్నారు.

మార్కెట్ కమిటీలకు అధ్యక్షుల నియామకం

నెల్లూరు, జూలై 17 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలోని వ్యవసాయ మార్కెట్ కమిటీలకు పాలకవర్గాలను ఏర్పాటు చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం గురువారం ఉత్తర్వులు జారీ చేసింది. ఇందులో భాగంగా తొలుత కమిటీల అధ్యక్షులను ప్రకటించింది. ఎంతో కాలంగా ఎదురుచూస్తున్న నామినేటెడ్ పదవులను ప్రకటించడంతో అధి కార పార్టీలో సందడి నెలకొంది. ఆత్మకూరు ఏఎంసీ చౌర్మన్‌గా అరికట్ల జనార్ధన్ నాయుడు, కావలి ఏఎంసీ చైర్మన్‌గా పోతుగంటి అలేఖ్య, నెల్లూరు ఏఎంసీ చైర్మన్‌గా మనుబోలు శ్రీధర్‌రెడ్డి, రాపూరు ఏఎంసీ చైర్మన్‌గా ఆవుల వాణీలను నియమించారు. సర్వేపల్లి ఏఎంసీ చైర్మన్‌గా గాలి రామకృష్ణారెడ్డిని ఇది వరకే నియమించిన విషయం తెలిసిందే.



జిల్లాలో మోస్తరు వర్షం

నెల్లూరు, జూలై 17 (ఆంధ్రజ్యోతి) : బంగాళాఖాతంలో ఏర్పడిన ఉపరితల ఆవర్తనం ప్రభావంతో జిల్లావ్యాప్తంగా గురువారం ఓ మోస్తరు వర్షం కురిసింది. నెల్లూరుతోపాటు చాలా ప్రాం తాల్లో సాయంత్రం గంటపాటు వర్షం కురిసింది. దీంతో వాతావరణం చల్లబడింది. గడిచిన పది రోజులుగా జిల్లాలో ఉష్ణోగ్రతలు పెరిగాయి. బుధవారం నాడు దేశంలోనే అత్యధిక ఉష్ణోగ్రత (40.2 డిగ్రీలు) నెల్లూరులో నమోదవడం గమనార్హం. ఎండ వేడిమికి ఉక్కపోత కూడా ఎక్కువైంది. దీంతో ప్రజలు అల్లాడుతున్నారు. గురువారం మధ్యాహ్నాం వరకు కూడా భానుడు భగ్గుమన్నాడు. అయితే ఒక్కసారిగా వాతావరణంలో మార్పు వచ్చి చినుకులు పడడంతో ప్రజలు ఊపిరి పీల్చుకున్నారు. రానున్న ఒకటి, రెండు రోజులు కూడా ఓ మోస్తరు వర్షం కురిసే అవకాశమున్నట్లు వాతావరణ శాఖ ప్రకటించింది. కాగా గురువారం సాయంత్రం కురిసిన గంట వర్షానికే నెల్లూరు నగరంలో వర్షపు నీరు రోడ్లపై పారింది. దీంతో ట్రాఫిక్ ఇబ్బందులు ఎక్కువయ్యాయి.

చికెన్ ధరలు

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్

	కిలో (రూ.లలో)
బాయిలర్ లైవ్	116
స్కిన్ చికెన్	210
స్కిన్‌లెస్	234
కోడిగుడ్ల ధర (100): 515	

చెత్తసేకరణలో ఉత్తమ అధికారిణిగా సిద్ధేశ్వరి

అల్లూరు, జూలై 17 (ఆంధ్రజ్యోతి) : చెత్తసేకరణలో ఉత్తమ అధికారిణిగా మండలంలోని పురిణి గ్రామ కార్యదర్శి సిద్ధేశ్వరి ఎంపికయ్యారు. ఈ మేరకు గురువారం డీపీవో ఎల్.శ్రీధర్‌రెడ్డి చేతుల మీదుగా ప్రోత్సాహక బహుమతిని ఆమె అందుకున్నారు. పురిణి గ్రామంలో తడిచెత్తను వారానికి రెండు దఫాలుగా సేకరించి వర్మీ కంపోస్టును తయారు చేసి పంచాయతీకి ఆదాయాన్ని చేకూర్చడం తోపాటు పొడిచెత్తను కూడా సక్రమంగా సేకరించి తద్వారా పంచాయతీకి ఆదాయాన్ని రాబట్టారు. ఈ క్రమంలో ప్రజాభిప్రాయం మేరకు నూరుశాతం ప్రశంసలు అందుకోవడంతో ఆమెను ఎంపిక చేసినట్టు ఈవోపీఆర్డీ పెంచల వీరేంద్ర తెలిపారు.



రెండో రోజూ నీటి సరఫరా నిలిపివేత

లింగసముద్రం, జూలై 17 (ఆంధ్రజ్యోతి): రాళ్లపాడు-రోళ్లపాడు మంచినీటి పథకం నుంచి రెండోరోజూ గురువారం కూడా అధికారులు మంచినీటి సరఫరాను నిలిపి వేశారు.బుధవారం ఈ పథకానికి చెందిన నీటి ట్రీట్‌మెంటు ప్లాంటును అధికారులు శుభ్రం చేయిస్తున్నారు. రెండోరోజూ కూడా ఈ పనులు కొనసాగాయి.అయితే మధ్యాహ్నం వరకు ప్లాంటును శుభ్రం చేసిన తరువాత ఈ ప్లాంటు నుంచి దుర్వాసన రాకుండా నీటితో మళ్లీ శుభ్రం చేస్తున్నట్టు ఏఈ సీహెచ్ రాజశేఖర్ చెప్పారు.శుక్రవారం ఉదయం నుంచి నీటి సరఫరాను పునరుద్ధరిస్తామని ఆయన తెలిపారు.

164 పొగాకు బేళ్ల తిరస్కరణ

కలిగిరి, జూలై 17(ఆంధ్రజ్యోతి): స్థానిక పొగాకు వేలం కేంద్రానికి గురువారం రైతులు మొత్తం 575పొగాకు బేళ్లను అమ్మకానికి తీసుకొచ్చారు. వేలంలో 10కంపెనీ ప్రతినిధులు పాల్గొని 411బేళ్లు కొనుగోలు చేశారు. నోబిడ్-140, ఆర్ఆర్-3, సీఆర్-11, జంపింగ్‌లాట్స్-10 కారణాలతో 164బేళ్లు తిరస్కరణకు గురయ్యాయి. కిలో పొగాకు గరిష్ఠ ధర రూ.280, కనిష్ఠ ధర రూ.160, సగటు ధర రూ.199.97గా నమోదైనట్లు వేలం నిర్వహణాధికారి శివకుమార్ తెలిపారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీ

కందుకూరు, జూలై 17(ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలోని వివిధ గ్రామాలకు చెందిన 30మందికి వైద్యఖర్చుల నిమిత్తం ముఖ్యమంత్రి సహాయనిధి నుంచి మంజూరైన ఆర్థికసహాయం చెక్కులను గురువారం ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు బాధిత కుటుంబాల వారికి అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నిరుపేద కుటుంబాల వైద్యఖర్చుల కోసం సీఎం సహాయనిధి ద్వారా సీఎం చంద్రబాబు ఇతోధికంగా ఆర్థిక సహాయం అందజేస్తున్నారని, ఈ ఒక్కరోజే రమారమి రూ.30 లక్షల చెక్కులు అందచేశామన్నారు.

పీ 4 పై గ్రామసభలు

జలదంకి, జూలై17(ఆంధ్రజ్యోతి): పీ 4పై గురువారం మండలంలోని పలు పంచాయతీల్లో సర్పంచుల అధ్యక్షతన ప్రత్యేకాధికారులు గ్రామసభలు నిర్వహించారు. ఈ సభల్లో బంగారు కుటుంబాల వివరాలను చదివి వినిపించారు. ఎంపికైన వారి వివరాలను పునఃసమీక్షించారు. మండలంలోని అన్నవరం, బ్రాహ్మణక్రాక, చోడవరం, చినక్రాక, గట్టుపల్లి, జలదంకి, జమ్మలపాలెం, కమ్మవారిపాలెం, కేశవరం, సోమవరప్పాడు గ్రామాల్లో ఈ సభలు జరిగాయి. పంచాయతీ కార్యదర్శులు, గ్రామప్రజలు పాల్గొన్నారు.

రహదారుల నిర్వహణపై నిర్లక్ష్యం

ఆర్‌అండ్‌బి రోడ్ల నిర్వహణను పట్టించుకోని అధికారులు

దెబ్బ తింటున్న మార్జిన్లు ● అడ్డగోలుగా పగులగొడుతున్న వైనం

కొండాపురం, జూలై17(ఆంధ్రజ్యోతి): రోడ్లు అభివృద్ధి చెందాలని గ్రామాల్లో ప్రజాభీష్టం మేరకు ప్రజా ప్రతినిధులు రూ. కోట్లు వెచ్చించి రహదారులు నిర్మిస్తున్నారు. అయితే నిర్వహణ సరిగా లేకపోవడంతో అవి దెబ్బ తింటున్నాయి.మండలంలో సుమారు 50 కిలోమీటర్ల ఆర్‌అండ్‌బీ రోడ్లు ఉన్నాయి. కొండాపురం- కొమ్మి, కొండాపురం- భీమవరప్పాడు, కొండాపురం- గరిమెనపెంట, కొండాపురం- శెట్టిపాలెం పరిధిలో ఆర్‌అండ్‌బీ రోడ్లు ఉన్నాయి. ఈ నాలుగు రహదారుల్లో కొండాపురం- శెట్టిపాలెం రోడ్డు డబుల్ రోడ్డుగా అభివృద్ధి చెందే క్రమంలో పనులు జరుగుతున్నాయి. మిగిలిన రోడ్లపై ఆర్‌అండ్‌బీ అధికారుల నిర్వహణ లేక తీవ్రంగా దెబ్బతిన్నాయి.

● **దెబ్బతింటున్న మార్జిన్లు**

రోడ్డు నిర్మాణ సమయంలో కాంట్రాక్టర్లు సరైన నాణ్యతా ప్రమాణాలు పాటించకపోవడంతో వేసిన కొద్ది రోజులకే దెబ్బతింటున్నాయి. ముఖ్యంగా రోడ్డుకు రెండు వైపులా మార్జిన్‌కు తోలుతున్న మట్టి నాసిరకంగా ఉండటంతో గుంతలు పడి, రెండు వాహనాలు ఎదురైన సమయంలో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వర్షాకాలంలో ద్విచక్ర వాహనచోదకులు రోడ్డు దిగితే చక్రాలు జారిపోయి ప్రమాదాలకు గురవుతున్నారు. ఇదిలా ఉండగా రైతులు వ్యవసాయ పనుల నిమిత్తం ఇష్టారీతిలో రోడ్లను పగులగొట్టి పైపులు వేస్తున్నారు. పనులు పూర్తయిన తర్వాత పగులగొట్టిన రోడ్డును అలానే వదిలివేస్తున్నారు. దీంతో ఆ ప్రదేశంలో ఇంకా పెద్ద గుంతలు పడుతున్నాయి. ఈగుంతల్లో వాహనచోదకులు ప్రయాణం చేయాలంటేనే భయాందోళనలకు గురవుతున్నారు. ఇప్పటికైనా ఆర్‌అండ్‌బీ అధికారులు రోడ్లను కాపాడాలని మండల వాసులు కోరుతున్నారు.



దెబ్బతిన్న రోడ్డు మార్జిన్, ప్రమాద సూచికలు లేని రోడ్డు మలుపు

ప్రజా సమస్యలు తెలుసుకునేందుకే
సుపరిపాలనలో తొలి అడుగు

కావలి,జూలై17(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఏడాది పాలనపై ప్రజాభిప్రాయం, ప్రజల సమస్యలను తెలుసుకుని, వాటిని పరిష్కరించేందుకు సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమాన్ని సీఎం చంద్రబాబు ప్రవేశపెట్టారని ఎమ్మెల్యే దగుమాటి వెంకటక్రిష్ణారెడ్డి తెలిపారు. పట్టణ ముసునూరులోని 15,16 వార్డుల్లోని 121వ బూత్‌లో గురువారం సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమాన్ని చేపట్టారు. ఇంటింటికి తిరిగి సమస్యలను తెలుసుకుని, సంక్షేమ పథకాల గురించి వివరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రజలు తమ సమస్యల కోసం అధికారులు చుట్టూ తిరగకుండా ముఖ్యమంత్రి, మంత్రులు, ఎమ్మెల్యేలు. టీడీపీ నేతలు మీ ఇళ్ల వద్దకు వచ్చి మీ సమస్యలు తెలుసుకుని వాటి పరిష్కారానికి చర్యలు చేపడుతున్నారన్నారు.అనంతరం కచేరీ మిట్టలో మీ కోసం స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో జరిగిన బ్లెస్డ్ హోమ్ మొదటి వార్షికోత్సవంలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. చిన్నారుల ప్రదర్శించి సాంస్కృతిక కార్యక్రమాలను తిలకించారు. అనంతరం సంస్థ అందిస్తున్న సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమాలలో టీడీపీ నాయకులు గుత్తికొండ కిషోర్, జ్యోతిబాబూ రావు, గుంటుపల్లి రాజకుమార్‌చౌదరి, పోట్లూరు శ్రీనివాసులు, బొట్లగుంట శ్రీహరినాయుడు, తిరువీధి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



ముసునూరులో సుపరిపాలన కరపత్రాన్ని అందచేస్తున్న ఎమ్మెల్యే క్రిష్ణారెడ్డి

అపోహలు నమ్మొద్దు... మీ భూములు ప్రభుత్వం తీసుకోదు : ఇంటూరి

ఉలవపాడు, జూలై 17 (ఆంధ్రజ్యోతి): మత్స్యకారుల భూములను పరిశ్రమల స్థాపన కోసం ఎట్టిపరిస్థితుల్లో ప్రభుత్వం తీసుకోదని ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు భరోసా ఇచ్చారు. గురువారం సాయంత్రం కరేడు పంచాయతీ పరిధిలోని బట్టిసోమయ్యపాలెం మత్స్యకార గ్రామంలో ఆయన సుపరిపాలన తొలిఅడుగు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామస్థులతో మాట్లాడారు. కొందరు కావాలనే మత్స్యకారుల్లో అపోహలు, భయాందోళనలు నెలకొల్పారని, వాటిని మనసులో నుంచి తొలగించుకొని తనపై నమ్మకం ఉంచమని ఆయన కోరారు.బాధిత రైతులను త్వరలోనే ముఖ్యమంత్రి చంద్రబాబు దగ్గరకు తీసుకెళ్లేందుకు ప్రయత్నిస్తానని హామీ ఇచ్చారు. చచ్చినా బతికినా ఇక్కడే మాజీవితాలు ఇక్కడి నుంచి కదిలే ప్రసక్తేలేదని, ప్రభుత్వ భూసేకరణకు తాము వ్యతిరేకమని మహిళలు ఈ సందర్భంగా ఎమ్మెల్యేకు చెప్పారు. మీ భూములు ఎక్కడికిపోవు నన్ను నమ్మండని ఎమ్మెల్యే వారితో అన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు రాచగల్లు సుబ్బారావు, ఆదాము, పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

● **రైతులను ఒప్పించే భూములు తీసుకుంటాం**

కందుకూరు, ఆంధ్ర జ్యోతి): ఉలవపాడు మండలం కరేడులో ఇండోసోల్ సోలార్ కంపెనీ కోసం బలవంతపు భూసేకరణ చేయబోమని, రైతులను ఒప్పించే భూములు తీసుకుంటామని ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు పేర్కొన్నారు. గురువారం సాయంత్రం ఆయన తన కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. కరేడులో రెండుపంటలు, మూడు పంటలు పండే భూములను ఇండోసోల్ కోసం తీసుకోబోమని, ఈ విషయమై ఇప్పటికే సీఎం చంద్రబాబునాయుడుతో చర్చించగా ఆయన అంగీకరించారని తెలిపారు. కందుకూరు నియోజకవర్గాన్ని ప్రకాశం జిల్లాలో కలిపే విషయంలో రాష్ట్రప్రభుత్వం ఇప్పటికే కమిటీ వేసిందని, ఎట్టి పరిస్థితుల్లో జరిగి తీరుతుందన్నారు. ప్రకాశంలో కలిశాకే తాను పోటీ చేస్తానన్నారు. ఈ సమావేశంలో పార్టీ నాయకులు దామా మల్లేశ్వరరావు, బుస్సారెడ్డి కృష్ణారెడ్డి, మాదాల లక్ష్మీనరసింహం తదితరులు పాల్గొన్నారు.



ఉలవపాడు : గ్రామస్థులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఇంటూరి

మున్సిపల్ కార్మికులకు చట్టబద్ధమైన జీతాలు ఇవ్వాలి

కావలి(టౌన్), జూలై17(ఆంధ్రజ్యోతి) : మున్సిపల్ కార్మికులకు చట్టబద్ధమైన జీతాలు, సెలవులు ఇవ్వాలని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు ఎం. మోహన్‌రావు డిమాండ్ చేశారు. గురువారం మున్సిపల్ కార్యాలయం ఎదురుగా ఏర్పాటు చేసిన కార్మికుల సమ్మె శిబిరంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కార్మికుల సమస్యలపై ప్రభుత్వం దాటవేత వైఖరిని అవలంబిస్తూ కాలయాపన చేస్తున్నదన్నారు. గత ప్రభుత్వం ఆప్కాస్‌లో కార్మికులను నియమించిందని, అప్పటినుంచి కార్మికులకు కొంత వెసులుబాటు కలిగిందన్నారు. మళ్లీ ప్రభుత్వం మున్సిపల్ కార్మికులను ప్రైవేట్ ఏజెన్సీలకు అప్పజెప్పాలని చేస్తున్న ప్రయత్నాలు మానుకోవాలని హితవు పలికారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు కృష్ణమోహన్, పీ. పెంచలయ్య, మధుసూదన్‌రావు, యూనియన్ నాయకులు తురకా శీనయ్య, బీ. మహేష్, రమేష్, జీ శీనయ్య, చిన్నమ్మ, అనిత తదితరులు పాల్గొన్నారు.



శిబిరంలో మాట్లాడుతున్న సీపీఎం నేత మోహన్‌రావు

బాబు మోసాలను ప్రజలకు తెలియజేయాలి : బుర్రా

వలేటివారిపాలెం, జూలై 17 (ఆంధ్రజ్యోతి): సీఎం చంద్రబాబు చేసిన మోసాలను వైసీపీ కార్యకర్తలు ఇంటింటికి వెళ్లి ప్రజలకు తెలియజేయాలని కందుకూరు నియోజకవర్గ వైసీపీ ఇన్‌చార్జి బుర్రా మధుసూదన్ యాదవ్ తెలిపారు. స్థానిక వైసీపీ కార్యాలయంలో పార్టీ మండల అధ్యక్షుడు ఏ. లక్ష్మీనరసింహం ఆధ్వర్యంలో గురువారం బాబూ ష్యూరిటీ- మోసం గ్యారంటీ కార్యక్రమం జరిగింది. ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఆయన మాట్లాడుతూ చంద్రబాబు సూపర్‌సిక్స్ అని అందరితో ఓట్లు వేయించుకొని ఇప్పుడేమో అన్ని పథకాలు అమలు చేశానని చెబుతున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు నాగిరెడ్డి శివరామిరెడ్డి కాకు వెంకటస్వామి, గుత్తా గోపి, తోకల కొండయ్య, పెయ్యల రమేష్, చౌడబోయిన యానాది, చెన్నిబోయిన ఓబులకొండయ్య తదితరులు పాల్గొన్నారు.

● **మాల్యాద్రికి పరామర్శ**

మండలంలోని కాకర్లపాలెంలో కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న వైసీపీ కార్యకర్త పెయ్యల మాల్యాద్రిని బుర్రా మధుసూదన్‌యాదవ్ గురువారం పరామర్శించారు. మాల్యాద్రి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు.



మాట్లాడుతున్న బుర్రా మధుసూదన్ యాదవ్

స్వచ్ఛందంగా రక్తదానం చేయడం హర్షణీయం

కావలి,జూలై17(ఆంధ్రజ్యోతి): యువత స్వచ్ఛందంగా రక్తదానం చేయటం హర్షణీయమని ఆర్డీవో వై.సుధాకర్‌రెడ్డి తెలిపారు. కావలి రూరల్‌మండలం రుద్రకోటలో గురువారం దేవళ్ల రమణయ్య జ్ఞాపకార్థం బుల్లెట్ బాయ్స్ యూత్ 31 మంది రక్తదానం చేశారు. రెడ్‌క్రాస్ పాలకమండలి సభ్యులు బెజవాడ ప్రసన్నకుమార్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన ఈ శిబిరాన్ని ఆర్డీవో ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ రక్తనిధి కేంద్రంలో అవసరమై గ్రూప్ రక్త నిల్వలు ఎప్పుడూ అందుబాటులో ఉండాలంటే యువత ముందుకు వచ్చి రక్తదానం చేయాలన్నారు. అనంతరం సుదాకర్‌రెడ్డితోపాటు ఎంపీడీ ఆర్. సుందరరావు, లక్ష్మీబాయి రక్తదాతలకు ప్రశంసా పత్రాలు అందచేసారు. ఈ కార్యక్రమంలో బుల్లెట్ బాయ్స్ యూత్ లీలా శంకర్, దేవళ్ల చిన బాబు, ఉప్పు నారాయణ, గండికోట హరీష్, శివక్రిష్ణ తదితరులు పాల్గొన్నారు.



రక్తదానం చేస్తున్న యువకులు

రోడ్డు పనుల ప్రారంభం



తారురోడ్డు పనులు పరిశీలిస్తున్న ఐవోడబ్ల్యూ రాజేష్

బిట్రగుంట, జూలై 17 (ఆంధ్రజ్యోతి): బిట్రగుంట కొత్త రైల్వేస్టేషన్ నుంచి ఇబ్రహీంపేట మెయిన్ బజారుకు వరకు తారురోడ్డు పనులు గురువారం ప్రారంభమయ్యాయి.ఈ పనుల్లో నాణ్యతను స్థానిక ఐవోడబ్ల్యూ రాజేష్ పరిశీలించారు. నాణ్యత లోపించకుండా పనులు చేయాలని కాంట్రాక్టర్‌కు సూచించారు. రైలు ప్రయాణికులు, రైల్వే సిబ్బంది కర్రతుమ్మ చెట్ల వల్ల ఇబ్బందులు పడుతున్నారని, జంగిల్ క్లీనింగ్, ఫైయిర్ ఉడ్ కు త్వరలో వేలం వేస్తామన్నారు.

మేం చెప్పినోళ్లకే!

(5వ పేజీ తరువాయి)

అందరికీ అనుమానాలు వస్తున్నాయి. కొంతమంది నాయకులు అవసరం లేకపోయినా అధికార దర్పం ఉపయోగించి వందల బస్తాలు ఇళ్లకు తరలిస్తున్నారు. మరికొంత మంది పంట సాగు చేపట్టకపోయినా వచ్చే సీజన్‌కు ఉంటాయని ముందు జాగ్రత్తగా తరలిస్తున్నారు. దీంతో చిన్న, సన్నకారు రైతులకు యూరియా అందడం లేదు. అయినా అదనపు కోటా కింద యూరియా బస్తాలను జిల్లాకు తీసుకొస్తున్నా ఆ నాయకులకు సమాచారం అంది, తమ వైపు మళ్లించుకుంటున్నారు.

● **తీవ్ర ఒత్తిడిలో ఎంఏవో, వీఏఏలు**

అధికార పార్టీ నాయకులు యూరియాను తరలించుకుపోతుండటంతో ప్రతిపక్ష పార్టీల నాయకులు, రైతులు మండల వ్యవసాయ అధికారులు, గ్రామ వ్యవసాయ సహాయకులను తీవ్రస్థాయిలో ప్రశ్నిస్తున్నారు. తాము ఏం చేయమంటారని బతిమలాడుకునే పరిస్థితి నెలకొంది. అధికారపార్టీ నాయకులను ప్రశ్నిస్తే ఏమవుతుందోనన్న ఆందోళన, మరోవైపు చిన్న, సన్నకారు రైతుల ప్రశ్నలకు సమాధానం చెప్పలేక అధికారులు తీవ్ర ఒత్తిడికి లోనవుతున్నారు.

● **ముందుగా నగదు చెల్లిస్తేనే...**

గతంలో మండల వ్యవసాయ అధికారులు, వీఏఏలు వారి పరిధిలో ఎంత మేర విస్తీర్ణం ఉంది.. ఎన్ని ఎకరాల్లో పంటలు సాగవుతాయని ఒక అంచనా వేసి ముందుగానే ఎరువులను తెప్పించి గోదాముల్లో ఉంచేవారు. అవసరమైన రైతులు వచ్చి పొలం పత్రాలు, ఆధార్ చూపించి నగదు చెల్లించి ఎరువులు తీసుకెళ్లేవారు. అయితే ప్రస్తుతం ఆ పద్ధతికి స్వస్తి పలికారు. రైతులు ముందుగా నగదు చెల్లించిన తరువాత వీఏఏలు మార్క్‌ఫెడ్‌కు ఇండెంట్ పెడతారు. రెండు, మూడు రోజులకు రైతు సేవా కేంద్రం వద్దకు లోడ్ వస్తుంది. ఆ తర్వాతే రైతులకు పంపిణీ చేస్తారు. మార్క్‌ఫెడ్‌కు బకాయిల బెడద లేకుండా ఉండేలా ఈ పద్ధతి తీసుకొచ్చారు. అయితే దీన్ని కొంత మంది నాయకులు దుర్వినియోగం చేస్తున్నారు. లారీ లోడ్‌కు వారే ముందుగా నగదు చెల్లించి తీసుకెళ్లిపోతున్నారు.

● **ప్రైవేటులో అధిక ధరలు**

వరినాట్ల తరువాత కేవలం 40 రోజుల్లోనే యూరియాతో అవసరం ఉంటుంది. సొసైటీలు, రైతు సేవా కేంద్రాల్లో యూరియా అందుబాటులో లేకపోవడంతో చిన్న, సన్నకారు రైతులు తప్పని పరిస్థితుల్లో ప్రైవేటు వ్యాపారులను ఆశ్రయిస్తున్నారు. ఇదే అదునుగా వ్యాపారులు అదనపు ధరలకు అమ్మకాలు సాగిస్తున్నారు. అదేమిటని ప్రశ్నిస్తే స్టాక్ లేదనే మాట కూడా చెబుతున్నారు. ఇంకొంత మంది యూరియాతోపాటు డీఏపీ, ఇతర పురుగు మందులు కొనుగోలు చేయాల్సిందేనని స్పష్టంగా చెబుతున్నారు. ఒక్కో బస్తాపై రూ.100 నుంచి రూ.150 వరకు అదనంగా వసూళ్లు చేస్తున్నట్లు సమాచారం. అయితే వీటిపై రైతులు అధికారులకు సూచన ప్రాయంగా సమాచారం ఇస్తున్నారే తప్ప ఫిర్యాదు మాత్రం చేయడం లేదు.

- నెల్లూరు (వ్యవసాయం, ఆంధ్రజ్యోతి)

40వేల మెట్రిక్ టన్నులు అందుబాటులో ఉంచాం

జిల్లా అవసరాలకు మించి అదనంగా యూరియాను అందుబాటులో ఉంచాం. ఇప్పటివరకు దాదాపుగా 40వేల మెట్రిక్ టన్నులు అమ్మకాలు జరిగాయి. అందులో సగం సొసైటీలు, రైతు సేవా కేంద్రాల ద్వారా రైతులకు ఇవ్వడం జరిగింది. వ్యవసాయశాఖ అధికారులు సిఫార్సు చేసిన దానికంటే ఎక్కువగా రైతులు యూరియాను వినియోగిస్తున్నారు. దీనివల్ల చీడపీడలు పెరిగే అవకాశం ఉంది. ఎకరాకు 135 కేజీలు మూడు దఫాలుగా వాడితే సరిపోతుంది. వ్యాపారులు యూరియాను అధిక ధరలకు విక్రయిస్తే చర్యలు తీసుకుంటాం.

- పి.సత్యవాణి, జిల్లా వ్యవసాయాధికారి

గది మరమ్మతులు పూర్తయినా
వినియోగించని టీచర్లు



మరమ్మతులు పూర్తయిన పాఠశాల గది

లింగసముద్రం, జూలై 17 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మొగిలిచెర్లలోని ఏజీపీ పాఠశాల ఆవరణలో మరమ్మతులకు గురైన పాత తరగతి గదిని ఏడాది క్రితం అధికారులు బాగు చేశారు.అయితే ఈ గదిని ప్రస్తుతం ఉపాధ్యాయులు వినియోగించడం లేదు. దీంతో ఈ గది నిరుపయోగంగా ఉంది. అయితే కొందరు విద్యార్థులు తరగతి లోపలా, మరికొందరు వరండాలో చదువుకుంటున్నారు. విద్యాశాఖ ఉన్నతాధికారులు స్పందించి గదిని వినియోగించేలా చర్యలు తీసుకోవాలని విద్యార్థుల తలిదండ్రులు పలువురు కోరుతున్నారు.

డిప్లమో విద్యతో అధిక నైపుణ్యాలు



తరగతుల ప్రారంభం సందర్భంగా నిర్వహించిన పూజలు

కందుకూరు, జూలై 17(ఆంధ్రజ్యోతి): డిప్లమో విద్యతో విద్యార్థులు తక్కువ సమయంలో తక్కువ ఖర్చుతో అధిక నైపుణ్యాలు పొంది ఉద్యోగాలు సాధించగలుగుతారని ప్రకాశం ఇంజనీరింగ్ కళాశాల కరస్పాండెంట్ డాక్టరు కంచర్ల విజయ్ శ్రీనివాస్ తెలిపారు. కళాశాలలో మొదటి సంవత్సరం డిప్లమో తరగతులను గురువారం పూజా కార్యక్రమాలతో ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కళాశాలలో ప్రాక్టికల్ నైపుణ్యాలకు అధిక ప్రాధాన్యమిస్తున్నామని పరిశ్రమలతో అనుబంధంతో విద్యార్థులకు ట్రైనింగ్, ప్లేస్‌మెంట్ అవకాశాలు కల్పిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టరు సీహెచ్ రవికుమార్, వైస్ ప్రిన్సిపాల్ వరపర్ల హరిబాబు, అకడమిక్ ఇన్‌చార్జి మీరావలి, ఏవో కొండలరావు తదితరులు పాల్గొన్నారు.

షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణంపై హైకోర్టు స్టే

కందుకూరు, జూలై 17(ఆంధ్రజ్యోతి): గ్రామదేవత అంకమ్మ ఆలయ ప్రాంగణంలో షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణాన్ని నిలిపివేయాలని గురువారం హైకోర్టు స్టే ఉత్తర్వులిచ్చింది. ఆలయ ప్రాంగణంలో షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణాన్ని సవాల్‌చేస్తూ ఆలయ పూర్వపుధర్మకర్త దివి లింగయ్యనాయుడు హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. విచారణలో భాగంగా కోర్టు స్టే ఉత్తర్వులిచ్చింది. షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణం నిబంధనలకు, ఆచారవ్యవహారాలకు విరుద్ధంగా జరుగుతుందని ఆయన పిటిషన్‌లో పేర్కొన్నారు. ఈ షాపింగ్ కాంప్లెక్స్‌కు అనుమతులు లేకుండానే మొదలుపెట్టారని, కాంప్లెక్స్ నిర్మాణం వల్ల భక్తులకు తీవ్ర అసౌకర్యం కలుగుతుందని, జాతరల సమయంలో లక్షలాదిమంది అమ్మవారిని దర్శించుకునే ఆలయం అయినందున షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణంతో తొక్కిసలాటలు జరిగే అవకాశం ఉందని ఆలయ సాంప్రదాయ పూజలకు కూడా విఘాతం కలుగుతుందని పిటిషన్‌లో పేర్కొన్నారు. ఈ మొత్తం వ్యవహారంపై సమగ్ర విచారణ జరపాల్సి ఉందని, సోమవారంలోగా అన్ని పత్రాలను కోర్టుకు సమర్పించాలని ఆదేశించిన న్యాయాధికారులు అప్పటివరకు నిర్మాణాలపై స్టే విధించారు.

డెంగ్యూ నివారణ చర్యలు తీసుకోండి

నెల్లూరు (వైద్యం), జూలై 17 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో డెంగ్యూ వ్యాధి నివారణ చర్యలు తీసుకోవాలని జిల్లా మలేరియా నివారణ అధికారి హుస్సేనమ్మ వైద్యాధికారులు, సిబ్బందికి సూచించారు. గురువారం నగరంలోని రామ్మూర్తి నగర్, జనార్దన్‌రెడ్డి కాలనీలో ఉన్న పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను ఆమె తనిఖీ చేశారు. జాతీయ డెంగ్యూ నివారణ మాసోత్సవాలలో భాగంగా ప్రజలకు వ్యాధిపై అవగాహన కల్పించాలని సిబ్బందిని ఆదేశించారు. లార్వా సర్వే, ఫీవర్ సర్వేలను సక్రమంగా నిర్వహించాలని, జ్వరాలను గుర్తించిన ప్రాంతాలలో రక్తపూతలు తీసి పరీక్షించాలని సూచించారు. ఏపీ హెల్త్ యాప్ కొత్త వెర్షన్‌లో ఫొటోలు అప్లోడ్ చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో వైద్యులు, సూపర్వైజర్లు, మలేరియా విభాగం సిబ్బంది పాల్గొన్నారు.

ఎరువుల దుకాణాల్లో ఆకస్మిక తనిఖీలు



కావలి : విత్తన దుకాణాల్లో తనిఖీలు చేసిన వ్యవసాయ, విజిలెన్స్ అధికారులు

కావలి రూరల్, జూలై17 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎరువులు, విత్తనాలు, పురుగు మందుల దుకాణాల్లో గురువారం వ్యవసాయశాఖ, విజిలెన్స్ అధికారులు తనిఖీలు నిర్వహించారు. మండల వ్యవసాయ శాఖ అధికారిణి లలిత ఆధ్వర్యంలో జరిగిన ఈ తనిఖీల్లో ఏడీఏలు రవికుమార్, నర్సోజీరావు విజిలెన్స్ సీఐ రాఘవరావు పాల్గొన్నారు. పట్టణంలోని సిరి సీడ్స్, నాగార్జున సీడ్స్ దుకాణాల్లో స్టాకు వివరాలు, రిజిష్టర్లు, ఫారంఏ, లైసెన్స్‌లను క్షుణ్ణంగా పరిశీలించారు.



కందుకూరు : ఎరువులు, పురుగుమందుల దుకాణాల్లో తనిఖీలు నిర్వహిస్తున్న విజిలెన్స్, వ్యవసాయ శాఖ అధికారులు

● **కందుకూరు (ఆంధ్రజ్యోతి):** పట్టణంలోని ఎరువులు, పురుగుమందుల దుకాణాల్లో గురువారం విజిలెన్స్, వ్యవసాయశాఖల అధికారులు ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. అనుమతిపత్రాలు లేని పురుగుమందులను సీజ్ చేశారు. విజిలెన్స్ సీఐ రాఘవరావు, ఏడీఏ నరసోజీ, వినుకొండ ఏడీఏ రవి కుమార్ మండల వ్యవసాయాధికారి అబ్దుల్ రహీంతో కలిసి ఎరువులు, పురుగుమందుల దుకాణాలతోపాటు ట్రాన్స్‌పోర్టు కార్యాలయాల్లోనూ తనిఖీలు నిర్వహించారు. అనుమతి పత్రాలు లేకుండా అనధికారికంగా తెప్పించిన పురుగుమందుల విక్రయాలను నిలిపివేయాలని ఆదేశాలు జారీచేశారు. సీజ్‌చేసిన పురుగు మందుల విలువ రూ. 3లక్షలు ఉంటుందని ఏవో తెలిపారు.ఎక్కడైనా అధిక ధరలకు ఎరువులు అమ్మితే చర్యలు తప్పవన్నారు.

వర్షంతో ఉపశమనం

కలిగిరి, జూలై 17(ఆంధ్రజ్యోతి): మండలంలో గురువారం ఓ మోస్తరు వర్షం కురవడంతో వాతావరణం చల్లబడింది. వారంరోజులుగా ఎండవేడిమి, ఉక్కపోతలకు తాళలేక ఇబ్బందులు పడుతున్న ప్రజానీకానికి ఈ వర్షం ఉపశమనం కలిగించింది. రైతులు హర్షం వ్యక్తం చేశారు.

చేపలు పట్టేద్దాం!

- సోమశిల డ్యాంలో నిబంధనల ఉల్లంఘన
- స్థానికేతరుల ద్వారా వేట సాగిస్తున్న అక్రమార్కులు
- మౌనం దాల్చుతున్న మత్స్య శాఖ



జలాశయం ఎగువున వేట సాగిస్తున్న మత్స్యకారులు

అనంతసాగరం జూలై 17 (ఆంధ్రజ్యోతి) : సోమశిల జలాశయం రైతులకే కాదు.. వందలాది జాలర్ల కుటుంబాలకు జీవనోపాధి కల్పిస్తోంది. అయితే, ఏడాదిలో మూడు మాసాలు చేపల వేటకు విరామం ఉంటుంది. అది కూడా చేపల ఉత్పత్తి కోసమే.. కాగా కొందరు వ్యాపారులు మాఫియాగా ఏర్పడి నిబంధనలు ఉల్లంఘించి అక్రమవేటను పోత్సహిస్తూ మత్స్యకారుల కడుపు కొడుతున్నారు. సోమశిల డ్యాం పరిధిలో వివిధ రకాల జాతుల చేపలు లభిస్తాయి. ఎర్రగండి, నల్లగండి, మూస, బొచ్చె, వాలుగ.. చిన్న రకాల్లో అరుజులు, బొమ్మిడాయి, ఇసుకదందులు, నాటురొయ్యలు దొరుకుతాయి. సాధారణ సమయంలో సుమారు 1000 మంది వరకు చేపలవేటతో జీవనం పొందుతారు. జలాశయం పరిధిలో ఎగువన కొంత దూరం మాత్రమే నెల్లూరు సరిహద్దు ప్రాంతం ఉంటుంది. ఆ తర్వాత కడపజిల్లా పరిధిలోకి వస్తుంది. ప్రస్తుత సీజన్‌లో చేప గుడ్డుదశలో ఉంటుంది కాబట్టి ప్రభుత్వం వేటవిరామం ప్రకటించింది. జూలై 1 నుంచి మూడు మాసాలు వేటకు వెళ్లరాదు. అయితే కొందరు వ్యాపారులు స్థానికేతరులను రంగంలోకి దింపి లోతట్టు ప్రాంతాలకు పంపంచి అక్రమవేట జరుపుతూ రాత్రిపూట మత్స్య సంపదను ఇతర రాష్ట్రాల మార్కెట్లకు తరలిస్తున్నారు. ఈ తరహా దోపిడీ వల్ల రాబోవు రోజుల్లో తమకు వేట జరగక ఇబ్బందులు పడతామని సామాన్య మత్స్యకారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అక్రమవేటపై నిఘా ఉంచి చర్యలు చేపట్టాలని డిమాండ్ చేస్తున్నారు.

ఆర్థిక మోసాలపై అవగాహన అవసరం

- ఆర్బీఐ చీఫ్ జనరల్ మేనేజర్ సుబ్బయ్య



సమావేశంలో మాట్లాడుతున్న ఆర్బీఐ చీఫ్ జనరల్ మేనేజర్ సుబ్బయ్య

నెల్లూరు(హరనాథపురం), జూలై 17(ఆంధ్రజ్యోతి): ఆర్థిక పరమైన మోసాల గురించి ప్రతీ ఒక్కరికి అవగాహన అవసరమని రిజర్వు బ్యాంక్ ఆఫ్ ఇండియా చీఫ్ జనరల్ మేనేజర్ సుబ్బయ్య అన్నారు. గురువారం కలెక్టరేట్ తిక్కన భవన్‌లో యాక్సిస్ బ్యాంకు ఆధ్వర్యంలో వినియోగదారులకు అవగాహన కార్యక్రమం జరిగింది. ఆయన మాట్లాడుతూ ఆర్థిక మోసాలను తెలుసుకోవటం, వాటిని నివారించేందుకు వినియోగదారులు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. డీఆర్వో హుస్సేన్ సాహెబ్ మాట్లాడుతూ సైబర్ నేరాలు రోజురోజుకు పెరుగుతున్నాయని, వాటిని ఎదుర్కొనేందుకు ఇలాంటి సమావేశాలు అవసరమని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఆర్బీఐ డిప్యూటీ జనరల్ మేనేజర్ కల్యాణ్ చక్రవర్తి, ఎల్‌డీఎం మణిశేఖర్, ఆర్బీఐ ఏజీఎం బాలతేజ, యాక్సిస్ బ్యాంకు సీనియర్ ఉపాధ్యక్షులు సంగీత సింగ్, చంద్రశేఖర్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

వైభవంగా వెంగమాంబ

నెల పొంగళ్లు

- అమ్మవారి దర్శనానికి బారులు తీరిన భక్తులు



దుత్తలూరు (ఉదయగిరి), జూలై 17 (ఆంధ్రజ్యోతి): నర్రవాడలోని శ్రీ వెంగమాంబ పేరంటాలమ్మ అమ్మవారి నెల పొంగళ్ల ఉత్సవం గురువారం కనులపండువగా జరిగింది. వెంగమాంబ బ్రహ్మోత్సవాల్లో అమ్మవారి కల్యాణ జరిగిన నెల రోజుల తరువాత వచ్చే మొదటి గురువారం ఈ ఉత్సవం నిర్వహించడం ఆనవాయితీ. ఈ సందర్భంగా ఆలయ పండితులు వెంగమాంబ దంపతులను, ఆలయ గర్భగుడిని సర్వాంగసుందరంగా తీర్చిదిద్దారు. జిల్లా నుంచేగాక కడప, ప్రకాశం జిల్లాల నుంచి భక్తులు ప్రత్యేక వాహనాల్లో అధికసంఖ్యలో తరలివచ్చి పొంగళ్లు నిర్వహించి అమ్మవారికి నైవేద్యం చెల్లించి మొక్కులు తీర్చుకొన్నారు. సంతానంలో లేని ఆలయంలో అమ్మవారి ముందు వరపడ్డారు. హోమ గుండం చుట్టూ ప్రదక్షణలు చేసి కొబ్బరి వేశారు. తెల్లవారుజామున వేదపండితులు అమ్మవారికి హోమాలు, ప్రత్యేక పూజలు జరిగాయి. ఆలయ వ్యవస్థాపక ధర్మకర్త పచ్చవ కరుణాకర్, ఈవో వెట్టిగుంట ఉషశ్రీలు అన్ని ఏర్పాట్లు చేశారు. ఎస్ఐలు ఆదిలక్ష్మి, రఘునాథ్‌లు బందోబస్తు ఏర్పాటు చేశారు. భక్తుల సౌకర్యార్థం అన్నప్రసాద వితరణ, పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు.

ఆషాడ మాస సారె సమర్పణ

ఆషాడ మాసం సందర్భం గా వెంగమాంబ పేరంటాలుకు సమరసత సేవా ఫౌండేషన్ ఆధ్వర్యంలో మహిళలు చీర, సారె సమర్పించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. శ్రీవిరజానందస్వామిజీ, సమరసత సేవా ఫౌండేషన్ జిల్లా సహా కన్వీనర్ మాలేపాటి స్రవంతిల ఆధ్వర్యంలో జనార్దన స్వామి ఆలయం నుంచి మహిళలు భారీ సంఖ్యలో సారె తీసుకుని గ్రామ పురవీధుల్లో ఊరేగింపుగా ఆలయం వద్దకు చేరుకున్నారు. అనంతరం అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేపట్టారు. ఈ కార్యక్రమంలో ఈవో ఉషశ్రీ, బీజేపీ నాయకులు మేకపాటి మాల్యాద్రినాయుడు, కదిరి వెంకట రంగరావు, చుండి హరిగోపాల్‌రెడ్డి, పెసల కృష్ణ, కర్రా భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.



ఆకట్టుకున్న చిన్నారుల కోలాట ప్రదర్శన

ప్రభుత్వ స్థలంలో

సైడ్‌రూమ్

- బరితెగించిన మద్యం దుకాణదారు
- పట్టించుకోని మున్సిపల్ అధికారులు
- బహిరంగంగా మద్యం సేవిస్తున్నా పట్టించుకోని పోలీసులు



ప్రభుత్వ స్థలం ఆక్రమించి ఏర్పాటు చేసిన పందిరిలో మద్యం సేవిస్తున్న మందుబాబులు

కావలి,జూలై17(ఆంధ్రజ్యోతి): కూతవేటు దూరంలో పోలీస్‌స్టేషన్... అంతే దూరంలో మున్సిపల్ కార్యాలయం... అయితే ఆ రెండు శాఖల అధికారులను ఎలా మేనేజ్ చేసారో తెలియదుకానీ... కావలి నడిబొడ్డున ఓ మద్యం దుకాణదారు ప్రభుత్వ స్థలం ఆక్రమించి సైడ్‌రూమ్ ఏర్పాటు చేశారు. అంతేకాక యథేచ్ఛగా మద్యం సేవింప చేస్తున్నా వారు పట్టించుకోవటంలేదు. వాస్తవంగా దుకాణదారు మద్యం సీసాలు అమ్ముకోవాలేకానీ, అక్కడే కూర్చోపెట్టి మద్యం తాపించకూడదనేది ప్రభుత్వ నిబంధన. అయితే ఆ నిబంధనను తుంగలో తొక్కి పట్టణ నడిబొడ్డున పొట్టి శ్రీరాములు విగ్రహం సాక్షిగా, వరవ కాలువపై వేసి ఉన్న శ్లాబ్‌మీదున్న చిరు వ్యాపారాలను తరిమేశారు. తనకున్న పలుకుబడితో ఆస్థలాన్ని ఆక్రమించాడు. అక్కడ ఒక పెద్ద బంకును, దానికి ఎదురుగా పందిరి వేసి చుట్టూ కనిపించకుండా ఫ్లెక్సీలు అడ్డంపెట్టి మద్యం సేవించే వారికి సైడ్‌రూమ్‌ను ఏర్పాటు చేశాడు. ఆ దుకాణంలో మద్యం కొనుక్కొని అక్కడే సేవిస్తుండటంతో ప్రజలు ఏంట్రా ఇంత దిగజారిపోయిందా వ్యవస్థ ? అంటూ చర్చించుకుంటున్నారు. సంబంధిత అధికారులకు ఏ స్థాయిలో నెలవారీ మామూళ్లు ముడుతున్నాయో అర్థం కావటంలేదని వారంటున్నారు. ఇప్పటికైనా ఆయా శాఖల ఉన్నతాధికారులు స్పందించి, ఆ ఆక్రమణలను తొలగించి అక్కడ మద్యం సేవించకుండా చర్యలు తీసుకోవాల్సి ఉంది.



షాపు నిర్వాహకులు ఏర్పాటు చేసిన బంకు

ఆక్రమణలు తొలగిస్తాం...

వరవ కాలువపై మద్యం దుకాణదారుడు ఆక్రమించి సైడ్‌రూమ్ లాగా ఏర్పాటు చేసుకున్న విషయం ఇటీవలే తన దృష్టికి వచ్చింది. అక్కడ ఆక్రమణలను తొలగించేందుకు చర్యలు తీసుకుంటున్నాం. ఈమేరకు టౌన్ ప్లానింగ్ వారికి ఆదేశాలు కూడా ఇచ్చా.

-జీ. శ్రావణకుమార్, మున్సిపల్ కమిషనర్

చేపల పెంపకంపై 21 నుంచి శిక్షణ

నెల్లూరు(వ్యవసాయం), జూలై 17 (ఆంధ్రజ్యోతి): చేప పిల్లల నర్సరీ నిర్వహణపై నెల్లూరులోని కృషి విజ్ఞాన కేంద్రం(కేవీకే)లో ఈనెల 21వతేదీ నుంచి 25వతేదీ వరకు శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నట్లు కేవీకే సమన్వయకర్త డాక్టర్ జీ లలితా శివజ్యోతి, మత్స్య విభాగం శాస్త్రవేత్త హరిసాదులు ఓ ప్రకటనలో పేర్కొన్నారు. కార్ప్ చేపల పెంపకంలో మేలైన యాజమాన్య పద్ధతులపై 26 నుంచి 31వతేదీ వరకు శిక్షణ ఉంటుందని పేర్కొన్నారు. ఆసక్తి కలిగిన రైతులు 9154806577 నెంబరును సంప్రదించి పేర్లు నమోదు చేసుకోవాలని కోరారు.

భూ సమస్యల ఫిర్యాదులపై జేసీ పరిశీలన

అనంతసాగరం, జూలై 17 (ఆంధ్ర జ్యోతి): మండలంలోని పలు గ్రామాల్లో భూసమస్యల ఫిర్యాదులపై జిల్లా జాయింట్ కలెక్టరు కార్తీక్ గురువారం పరిశీలించారు. ముత్తుకూరు చెరువును ఆక్రమించినట్లు స్థానికులు ఫిర్యాదు చేయగా తొలుత అక్కడకు చేరుకొని పరిశీలించి రికార్డులు తనిఖీ చేశారు. అనంతరం సంజీవనగరంలో సీజేఎఫ్ భూముల వివాదాన్ని పరిశీలించి సమస్యలు పరిష్కరిస్తామని తెలియజేశారు. కార్యక్రమంలో ఆత్మకూరు ఆర్డీవో పావని, మండల తహసీల్దారు జయవర్ధన్ పాల్గొన్నారు.



భూముల పరిశీలనకు వచ్చిన జేసీ కార్తీక్

‘వెలుగొండ’ను పూర్తి చేసి

సాగు, తాగునీటి కష్టాలు తీరుస్తా!

- రాష్ట్ర మంత్రి ఆనం వెల్లడి

వరికుంటపాడు(ఉదయగిరి రూరల్), జూలై 17 (ఆంధ్రజ్యోతి) : వెలుగొండ ప్రాజెక్టును పూర్తి చేసి మెట్ట ప్రాంతాలకు సాగు, తాగునీటికి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోనున్నట్లు రాష్ట్ర దేవదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి తెలిపారు. గురువారం ఎమ్మెల్యే కాకర్ల సురేష్‌తో కలిసి ఆండ్రావారిపల్లి, వరికుంటపాడు గ్రామాల్లో నిర్వహించిన సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమంలో మంత్రి ఆనం పాల్గొన్నారు. ఈ సందర్భంగా రామాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి ఆండ్రా వారిపల్లిలోని ఏఎంసీ మాజీ చైర్మన్ ఆండ్రా నాగిరెడ్డి నివాసంలో విలేకరులతో మాట్లాడారు. ఉదయగిరి నియోజకవర్గంలో 7 ఆలయాల అభివృద్ధికి నిధులు మంజూరు చేశానని, మరికొన్ని ఆలయాలకు సైతం ప్రతిపాదనలను సిద్ధం చేస్తున్నట్లు తెలిపారు. ఆలయాల పునఃనిర్మాణంలో భాగంగా జిల్లాకు రూ.35.61 కోట్లు మంజూరు చేయడం జరిగిందన్నారు. ఉదయగిరికి సైతం రెండు ఆలయాల పునఃనిర్మాణం దిశగా రూ.3 కోట్లు మంజూరు చేసినట్లు తెలిపారు. త్వరలో మరో రెండు ఆలయాలకు ప్రతిపాదనలు రూపొందిస్తున్నట్లు చెప్పారు. నందవరం-నందిపాడు రహదారి పనులతోపాటు ఆత్మకూరు-సోమశిల రహదారికి సైతం రూ.60 కోట్ల నిధులు మంజూరు చేసేలా ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపడం జరిగిందన్నారు. అనంతరం గ్రామాలతోపాటు కాలనీల్లో ఇంటింటికెళ్లి ఏడాది పాలనపై ప్రజల అభిప్రాయాన్ని తెలుసుకుంటూ కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో జడ్పీటీసీ రావిళ్ల నాగేంద్ర, టీడీపీ నాయకులు చెంచలబాబు, మధుసూదన్‌రావు, శివరామిరెడ్డి, శ్రీకాంత్, లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.



కరపత్రాలను పంచుతున్న మంత్రి ఆనం రామనారాయణరెడ్డి, పక్కన ఉదయగిరి ఎమ్మెల్యే సురేష్

మనస్తాపంతో వ్యక్తి బలవన్మరణం

కొండాపురం, జూలై17 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సాయిపేటలో మనస్తాపంతో గడ్డి మందుతాగి గురువారం ఓ వ్యక్తి మృతిచెందాడు. పోలీసుల కథనం మేరకు, కలిగిరి మండలం కొత్తూరుకి చెందిన చెరుకూరు రామాంజనేయులు సాయిపేటకి చెందిన రాజేశ్వరిని సుమారు 18 ఏళ్ల వివాహం చేసుకున్నాడు. వీరికి 15 ఏళ్లలోపు ఇద్దరు ఆడపిల్లలు. కుటుంబ కలహాలతో రాజేశ్వరి ఇద్దరు పిల్లలతో కొంతకాలంగా సాయిపేటలోని తల్లిదండ్రుల వద్దే ఉంటున్నది. ఈ క్రమంలో రామాంజనేయులు మద్యం తాగి అప్పడప్పుడూ ఇంటికివచ్చి గొడవ చేస్తుండే వాడు. ఇలా చేయడం సరికాదని రాజేశ్వరి,ఆమె కుటుంబ సభ్యులు అనడంతో మనస్తాపం చెంది, బుధవారం గడ్డిమందు తాగాడు. 108లో కొండాపురం పీహెచ్‌సీకి తీసుకువచ్చి ప్రథమ చికిత్స అనంతరం కావలి ఏరియా వైద్యశాలకు తరలించారు. వైద్యుడి సూచనలతో మెరుగైన వైద్యం కోసం నెల్లూరుకు తరలించారు. అక్కడ చికిత్సపొందుతూ గురు వారం మృతి చెందాడు. భార్య రాజేశ్వరి ఫిర్యాదుమేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్న ట్లు ఎస్ఐ మాల్యాద్రి తెలిపారు.

ఒకే రాత్రి నాలుగు ఆలయాల్లో చోరీ...

పొదలకూరు,(ఆంధ్రజ్యోతి) : మండలంలోని మొగళ్లూరులో గురువారం తెల్లవారుజామున నాలుగు ఆలయాల్లో చోరీలు జరిగాయి. గ్రామంలోని మాతమ్మ, భద్రకాళి, రామాలయం, ఆంజనేయస్వామి ఆలయాల్లో దొంగలు చోరీకి పాల్పడ్డారు.

పీ-4 అందరిదీ !

- వర్క్‌షాపులో కలెక్టర్ ఆనంద్

నెల్లూరు(హరనాథపురం), జూలై 17(ఆంధ్రజ్యోతి) : పీ-4 కార్యక్రమం ప్రభుత్వానిది మాత్రమే కాదని... ఇది ఒక స్వచ్ఛంద కార్యక్రమమని, ప్రజలం దరిదీ అని కలెక్టర్ ఆనంద్ అన్నారు. గురువారం కలెక్టరేట్ తిక్కన భవన్‌లో పీ-4పై వర్క్‌షాపు జరిగింది. ఆయన మాట్లాడుతూ పీ-4 కార్యక్రమంలో ప్రభుత్వ ఉద్యోగులు మాత్రమే కాకండా ఇతరులు కూడా స్వచ్ఛందంగా భాగస్వాములు కావచ్చని చెప్పారు. శాసన సభ్యులు, స్థానిక రాజకీయ నాయకులను కలుపుకుని అధికారులు ఈ కార్యక్రమాన్ని ముందుకు నడపాలని సూచించారు. పీ-4పై సందేహాల నివృత్తికి 1800-425-1999 కాల్‌సెంటర్‌ను సంప్రదించాలని కోరారు. గుర్తించిన బంగారు కుటుంబాలకు అవసరమైన సలహాలు, సంప్రదింపులు, వృత్తి నైపుణ్యాత శిక్షణ ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జి సీపీవో లక్ష్మీ నరసింహులు, నియోజకవర్గాల ప్రత్యేకాధికారులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.



వర్క్‌షాపులో మాట్లాడుతున్న కలెక్టర్ ఆనంద్

అనుమతి మేరకే పొగాకు సాగు చేయాలి

- పొగాకు బోర్డు ఈడీ విశ్వశ్రీ

కలిగిరి, జూలై17 (ఆంధ్రజ్యోతి): పొగాకు బోర్డు అనుమతించిన మేరకు రైతులు పంట సాగుచేయాలని పొగాకు బోర్డు ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ విశ్వశ్రీ పేర్కొన్నారు. స్థానిక పొగాకు వేలం కేంద్రాన్ని గురువారం ఆమె సందర్శించారు. పొగాకు మార్కెట్ తీరుతెన్నులను అడిగి తెలుసుకున్నారు. లోగ్రేడ్ పొగాకును కొనుగోళ్లు చేయక పోవడంతో తాము ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు పలువురు రైతులు ఆమె దృష్టికి తీసుకువచ్చారు. లోగ్రేడు పొగాకుకు మద్దతు ధర అందించడంతోపాటు నోబిడ్ శాతాన్ని తగ్గించాలని కంపెనీ ప్రతినిధులను వారు కోరారు. నాణ్యమైన పొగాకు గ్రేడ్‌లను వేలం కేంద్రానికి తీసుకువచ్చి మద్దతు ధర పొందాలని రైతులకు ఆమె సూచించారు. ఈ కార్యక్రమంలో పొగాకు బోర్డు ఏఎం రామాంజనేయులు, ఆర్ఎం రామారావు, స్థానిక వేలం నిర్వహణాధికారి శివకుమార్, ఫీల్డ్‌ఆఫీసర్ సంతోష్‌కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.



పొగాకు వేలాన్ని పరిశీలిస్తున్న ఈడీ విశ్వశ్రీ, తదితరులు

విద్యార్థి మృతిపై విచారణ జరపాలి

నెల్లూరు(క్రైం), జూలై 17 (ఆంధ్రజ్యోతి) : ఫార్మసీ విద్యార్థి మృతిపై నిష్పక్షపాతంగా విచారణ జరపాలని సీమాంధ్ర ఎంఆర్‌పీఎస్ నాయకులు పోలీసులు అధికారులను కోరారు. ఈ మేరకు ఆ సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు పందిటి సుబ్బయ్య, మృతుని కుటుంబ సభ్యులు గురువారం జిల్లా పోలీసు కార్యాలయంలో ఏఎస్పీ సీహెచ్ సౌజన్యకు వినతిపత్రం ఇచ్చారు. సత్యసాయి జిల్లాకు చెందిన జానా శ్రీకాంత్ నెల్లూరులోని ఓ ఫార్మసీ కళాశాలలో డీఫార్మసీ ద్వితీయ సంవత్సరం చదువుతున్నాడని చెప్పారు. చదువుకుంటూనే నగరంలోని ఓ ప్రైవేటు వైద్యశాల మందుల దుకాణంలో పార్ట్‌టైం ఉద్యోగం పనిచేస్తున్నాడన్నారు. బుధవారం అదే హాస్పిటల్‌లో విద్యార్థి అకస్మాత్తుగా మృతి చెందాడని, దీనిపై అనుమానాలున్నాయని, సమగ్రంగా విచారణ జరపాలని కోరారు.

సెల్‌ఫోన్ల గజదొంగ అరెస్టు

- ఇద్దరు మైనర్లు కూడా...
- 42 మొబైల్ ఫోన్ల స్వాధీనం

నెల్లూరు(క్రైం), జూలై 17 (ఆంధ్రజ్యోతి) : రైళ్లలో ప్రయాణిస్తూ ప్రయాణికులు నిద్రలో ఉండగా ఆరి సెల్‌ఫోన్లను అపహరించుకుని వెళ్లే ఫోన్ల గజ దొంగను రైల్వే పోలీసులు పట్టుకున్నారు. అతని వద్ద నుంచి 40 సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకు న్నారు. గురువారం నెల్లూరు రైల్వే డీఎస్పీ జీ మురళీధర్ తన కార్యాలయంలో నింది తుడి వివరాలు మీడియాకు వెల్లడిం చారు. గూడూరు పట్టణం దళితవాడకు చెందిన కే అఖిల్ అలియాస్ వెంకట రమణయ్య పాత నేరస్తుడు. ఆయన రైళ్లలో ప్రయాణిస్తూ ప్రయాణికుల సెల్‌ఫోన్లు చోరీ చేస్తుంటాడు. ఇదిలా ఉండగా నెల్లూరు రైల్వే సీఐ సుధాకర్ నేతృత్వంలో నెల్లూరు, గూడూరు ఎస్సైలు, సీఐ ఐడీ పార్టీ సిబ్బంది రైళ్లలో నేరాల నియంత్రణ కోసం ప్రత్యేక నిఘా చర్యలు చేపట్టారు. ఈ క్రమంలో బుధవారం సూళ్లూరుపేట రైల్వే స్టేషన్‌లో అఖిల్ అనుమానస్పదంగా తిరుగుతుండగా అదుపులోకి తీసుకుని గూడూరుకు తరలించారు. తమదైన శైలిలో విచారించగా పలు రైళ్లలో సెల్‌ఫోన్లు దొంగిలించినట్లు అంగీకరించడంతో అరెస్ట్ చేశారు. అతడి నుంచి సుమారు రూ.3 లక్షల విలువ చేసే 40 సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నా మని డీఎస్పీ తెలిపారు. ఇదేవిధంగా రైళ్లలో సెల్‌ఫోన్ల చోరీకి పాల్పడు తున్న మరో ఇద్దరు మైనర్లను అదుపులోకి తీసుకుమని, వారి వద్దనుంచి రూ. 70 వేల విలువ చేసే రెండు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకుని మైనర్లను హోంకు తరలించామని చెప్పారు. ఈ కేసులో ప్రతిభ కనపరిచిన సీఐ సుధాకర్, ఎస్సైలు హరిచందన, చెన్నకేశవ, సిబ్బందిని డీఎస్పీ అభినందించారు.



ఆయుష్మాన్ ఆరోగ్య కేంద్రంలో వృథాగా ఉన్న పరికరాలు

రూ.లక్షల వ్యయం..

సేవలు నామమాత్రం!

ఆయుష్మాన్ ఆరోగ్య కేంద్రాల్లో అందని సేవలు

ఉదయగిరి, జూలై 17 (ఆంధ్రజ్యోతి) : పేదలకు మెరుగైన వైద్యసేవలందించాలనే ఉద్దేశంతో గత ప్రభుత్వం జిల్లాలో ప్రతి సచివాలయాలకు అనుసంధానంగా ఆయుష్మాన్ ఆరోగ్య కేంద్రాలను నిర్మించింది. ప్రధాన వైద్యశాలలకు తీసిపోనివిధంగా ఈ కేంద్రాలను అన్ని హంగులతో ఏర్పాటు చేసినా అక్కడ వైద్యసేవలు మాత్రం అందని ద్రాక్షలా మారాయి. ఆరోగ్య కేంద్రంలో ఒక ఎంఎల్‌హెచ్‌పీ, ఏఎన్ఎం అందుబాటులో ఉండి రోగులకు వైద్యసేవలు అందించేలా చర్యలు చేపట్టింది. వీటిలో ఆధునాతన వసతులతోపాటు సుమారు 30కిపైగా రక్త పరీక్షలు, ఇతరత్రా పరికరాలను అందుబాటులోకి తెచ్చినా సేవలు మాత్రం సక్రమంగా అందడం లేదని గ్రామీణ ప్రజానీకం వాపోతోంది.

వృథాగా పరికరాలు

ఆయుష్మాన్ ఆరోగ్య కేంద్రాలకు రూ.లక్షలు వెచ్చించి రక్త పరీక్షల పరికరాలు, రోగులను తరలించేందుకు స్ట్రెచర్లు, సెలైన్ స్టాండ్లు, బెడ్‌లు, మందులు, సిరప్‌లు, ఇతరత్రా పరికరాలు ఏ ఆరోగ్య కేంద్రంలో చూసినా నిరుపయోగంగానే ఉన్నాయి. కొన్ని కేంద్రాలు వాడుతున్నా పూర్తి స్థాయి ఫలితాలు రావడంలేదు. కొన్ని కేంద్రాలకు సొంత భవనాలు పూర్తి కాకపోవడంతో అద్దె భవనంలో ఆ పరికరాలు మూలకు చేరి ఎందుకూ పనికిరాకుండా పోతున్నాయి. ఉదయగిరిలోని సచివాలయం-2 ఆయుష్మాన్ ఆరోగ్య కేంద్రం నిర్మాణం అసంపూర్తిగా నిలిచిపోవడంతో శిథిలభవనంలో బిక్కుబిక్కుమంటూ సిబ్బంది రోగులకు వైద్యసేవలు అందించాల్సి వస్తోంది. ఆయుష్మాన్ ఆరోగ్య కేంద్రం-1 నిర్మాణం పూర్తయినప్పటికీ భవనం అప్పగించకపోవడం, విద్యుత్ సౌకర్యం ఏర్పాటు చేయకపోవడంతో సిబ్బంది చీకట్లోనే రోగులకు వైద్యసేవలందిస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి అసంపూర్తిగా ఉన్న భవనాన్ని పూర్తి చేసి, ఆరోగ్య కేంద్రానికి విద్యుత్ సౌకర్యం కల్పించి రోగులకు మెరుగైన వైద్యసేవలు అందేలా చూడాలని పలువురు కోరుతున్నారు.

